
9-8-68
40 పైసలు
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



దగ్గు, జలుబులు నీర్సమును కలిగిస్తాయి, యితర వ్యాధులకు దారి తీస్తాయి


వాటర్‌బరీస్ కాంపౌండ్

ఎఱ్ఱ లేబిలు

ఉపశమనముతో సహా రోగనిరోధక శక్తిని కలిగిస్తుంది.


దగ్గు, జలుబులతో నీర్సముగా ఉండి రోగనిరోధక శక్తిని కోల్పోతారు. అటువంటప్పుడు మీకు యితర వ్యాధులు సోకే అవకాశముంది. అందువలన క్రమంగా వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి. వాటర్‌బరీస్ కాంపౌండ్‌లో గల ఓషధులు ఆకలిని వృద్ధి చేస్తాయి, [illegible]ోల్పోయిన శక్తిని తిరిగి చేకూరుస్తాయి, ఇతర వ్యా[illegible]గకుండా రోగనిరోధక శక్తిని యిస్తాయి. దీనిలో చేర[illegible] 'క్రియొసోట్' మరియు 'గయొకోల్' దగ్గు, జలుబుల నుండి ఉపశమనమును కలిగిస్తాయి.

బలము మరియు ఆరోగ్యమునకు
వాటర్‌బరీస్ కాంపౌండ్ త్రాగండి!



వార్నర్-హిందూస్తాన్ లిమిటెడ్

WH-7291 A



తప్పక చూడండి!
జయంతి పిక్చర్స్
భాగ్యచక్రము
దర్శకత్వం.. కె.వి.రెడ్డి. (B.Sc..HONS) నిర్మాత.. పి.యస్.రెడ్డి. BAR-AT-LAW
VIJAYA
వాహినీ రిలీజ్

ఉత్తరాలు

ముఖచిత్రం

ఈ వారం 19-7-68 పత్రిక జయంతి ముఖచిత్రం చూడ ముచ్చటగా యున్నది. 'రచయిత', 'నా భార్య' అనేకథలు చాల బాగున్నవి. ఒకవారం విపరీతం, రామలక్ష్మిగారి ప్రశ్నావలి పత్రికకు వెలుగు నిస్తూవున్నవి. 'మొగలి పొదలు' చదువుటకు చాల ఇంటరెస్టుగా యున్నది. సరస్వతి కథమధ్యలో చనిపోవడం, సుభద్ర తన సుఖంకొరకు, ఇంటిని సంస్కృతిని వదలి జగదీశ్‌తో హైదరాబాద్‌కు వెళ్ళడం అంతగా నాకు నచ్చలేదు. రాగమయి సీరియల్ బ్రహ్మాండముగా యున్నది. దానిలో భానుమతి పాత్ర కథకు వెన్నెముకవంటిది. రచయిత్రికి నా యొక్క హృదయపూర్వక వందనములు.

బి. వి. ఆంజనేయులు,
(కేరాఫ్ 56 ఎ. పి. వో.)

*　　*　　*

26-7-68 సంచికలో జేబిరాణి ముఖచిత్రము ఎంతో ముచ్చటగా నున్నది. ఈ వారము కార్టునులు ఎంతో ఆకర్షణీయంగా నున్నవి. 'రాగమయి', 'మొగలి పొదలు' సీరియల్స్ ఎంతో బాగున్నవి. రచయిత్రులకు ధన్యవాదాలు.

ఎ. బాబ్జి, ఎ. రూపా (సీతాఫల్‌మండి)

*　　*　　*

26-7-65 పత్రిక ముఖచిత్రము, బేబిరాణి చిత్రము పత్రికకు ఎంతో నిండు నిచ్చినది. రాగమయి చాల బాగున్నది. మొగలిపొదలుకూడ చాల బాగున్నది. ఇంకా కథలు కార్టూనులు చాల బాగున్నవి.

మరిశెట్టి నాగేశ్వరరావు, (పిఠాపురం)

కథలు

26-7-68 తేది సంచికలో ప్రచురితమైన 'ఆడమనసులు మగమనిషి' అనే కథ నాకు చాలా నచ్చింది. ఆ కథలో రాధ పాత్ర నన్నాకర్షించింది. రాధలాంటి, వయస్సు పెరిగినా మనస్సు పెరగని ఆడపిల్లలు; ఆ కథచదివి, ఇకమీదట తమను తాము అర్థం చేసుకొని ప్రపంచాని కనుగుణంగా ప్రవర్తించాలని ఆశిస్తున్నాను.

ఎస్. ఆర్. మనోహర్, (మద్రాసు)


తప్పక చూడండి!
“లేత హృదయాలలో విరిసే ఆనందమూ
పరవశించి వదుగుతీసే ప్రేమ
జలపాతమూ”
A.N.C
సమర్పించు
మురుగాఫిలిమ్స్
వారి
శ్రీ
స్క్రీన్‌ప్లే. దర్శకత్వం.
M.S.గోపీనాధ్
నిర్మాత
N.ఆరుముగం
మోహన్‌ఫిలిమ్స్‌రిలీజ్
SUVARNA

'విధిలిఖితం' కథ చాలా బాగుంది. అది చదువు తున్నంతసేపు మనస్సులో ఏదో విధమైన ఆందోళన కల్గింది. అందులో మాతృహృదయం చాలా బాగా వర్ణించారు. అనంతం అలా మాతృమూర్తికి మరియు బిడ్డడికి మధ్య నిలుచుండి వేరుపర్చడం మహా ఘోరంగా వుంది. ఆతల్లికి బిడ్డలకై పిచ్చి ఎత్తినప్పటి సంఘటన చదువుతుంటే మాకు కన్నీరుకారిన దంటే అతిశయోక్తికాదు. "దా—బాబా—నేను పిచ్చిదాన్నికాను—" అని ఆతల్లి అంటుంటే అబ్బా ఎంతబాధ మాకు కల్గిందో చెప్పలేము.

రావకొండ శ్రీధర్, సుశీల, రాజమణి (జగిత్యాల్)

* * *

26—7—68 తేది వారపత్రికలో ప్రచురితమయిన 'పరమపద సోపానము' కథ చాలా సహజంగా, ఉన్నతంగా వుంది. సీరియల్స్ రెండింటిలోనూ 'ఆడమనసులు' స్పష్టంగా కనిపిస్తూ 'మగమనిషి'ని కవ్విస్తున్నాయి 'లిపి'ని గురించి వ్రాసిన శ్రీ నీలం శంకరనారాయణగారికి నా అభినందనలు. వారు మరికొస్త విశదంగా తెలిపి వుంటే మరింత బావుండేది. శ్రీమతి కె. రామలక్ష్మిగారి జవాబులు సహజంగానూ. తమాషాగానూ వున్నాయి.

యుగంధరశ్రీ (భాగ్యనగరం)

* * *

ఈ వారం 26—7—68 పత్రికలో ప్రచురించిన పెళ్లకూరు జయప్రదగారి 'పరమపద సోపానము' అనే కథ బాగుంది. ఇదివరకు జయప్రదగారి రెండు కథలు మీ పత్రికలో ప్రచురింపబడ్డాయి. రచయిత్రిగారికి కథలు సుఖాంతం కావడం యిష్టముండదు గాబోలు. ఎలాగైతేనేమి యిప్పటికి ప్రచురితమైన ఆమె కథలు మాకు నచ్చాయి. ఆమెకు మా ధన్యవాదాలు.

యస్. నిర్మల, నాని, ఉష, (నాపడ)

ఉత్తరాలు

పెళ్లకూరు జయప్రదగారి 'పరమపద సోపానం' కథ పవిత్రమైన ప్రేమకు ఒక నిజమైన నిదర్శనం అనిపించుకుంటుంది. సాధారణంగా స్త్రీలకుండే చంచల స్వభావాన్ని చాల చక్కగా చిత్రీకరించ గలిగింది, రచయిత్రి. అంతస్తులను అధిగమించి, మరోమెట్టు పైకి పోయి ఆలోచిస్తేనేగాని మనిషికి కావలసిన వేమిటో, కావలసిన వారెవరో గుర్తుకు రాదు. కాని కథలోని మాధవిలా ఎంతమంది యువతులు తమ ప్రవర్తనను పొరపాట్లనుపరామర్శించుకుంటారుఅనేదేప్రశ్న!

కేవలం చదువు, హోదా, డబ్బు వుంటే చాలు, సుఖాన్ని కొనుక్కో వచ్చుననే భావనలో, జీవిత మాధుర్యానికే మూలికలవంటి ప్రేమను, మమతను, ఆరాధనను కాదని తమ జీవితాల్ని ఎండమావులు చేసుకునే కన్యలలో కొంతమందికైనా కనువిప్పు కలిగించగలదేమో, యీ కథ! ఒక చక్కని కథను మీ పత్రికద్వారా పాఠకులకు అందజేసిన రచయిత్రికి నా ధన్యవాదములు.

పి. 'ఈశ్వర్', (హైదరాబాదు)

సినిమా

శ్రీ మోహన్‌కుమార్‌గారి 'ఏమైనారు వీళ్లంతా' అన్న పాత నటీనటులపై వ్రాసిన సమీక్ష బాగుంది.

గుండుమళ్ళ సింహాచలం, (బుడితి)

గమనిక

కొన్ని అనివార్య కారణాలవల్ల ఈవారం 'మీరు పుట్టిన ఇంగ్లీషుతేదీ ననుసరించి మీ స్వభావం? మీ మిత్రులు' ప్రచురించ లేక పోతున్నాము.

—సం॥

వచ్చే వారమే!

స్వాతంత్ర్య దినోత్సవ సంచిక

పిల్లలకి ప్రత్యేకం!

ఆంధ్రపత్రిక వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 9—8—'68
కీలకనామ సం॥ శ్రావణ మాసం బ॥ పాడ్యమి

సంపుటము : 60 సంచిక : 48

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు .
శివలెంక రాధాకృష్ణ


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26.00
6 మాసముల చందా	13.00
3 మాసముల చందా	6.50

విషయానుక్రమణిక

ముఖచిత్రం నటి జమున.
ఫొటో : ప్రభాకర్.


పాకిస్తాన్
భారత దేశం
రష్యా
అమెరికా
ప్రభుత్వ ఉద్యోగులు
పత్రికా రచయితలు
కార్మికులు
సమ్మె జబ్బు
చిన్నకారు విమర్శకులు
పాకిస్తాన్ పట్ల సోవియట్ విధానం
విబంధ విధానం
OOMMEN

భారత్ - అమెరికా బాంధవ్యం

వర్షాలు ఆరంభమయ్యాయి. వాటితో పాటు పార్లమెంటు సమావేశమూ ప్రారంభమైంది. పాకిస్తానుకు రష్యా ఆయుధసహాయం ఈ సమావేశంలో ముఖ్య చర్చ. శ్రీమతి గాంధీగారికి కాంగ్రెసు, కమ్యూనిస్టు, డి. యమ్. కె. మద్దతు వుంది. అయినా తగినంత దృఢంగా ఈ చర్చ కొనసాగలేదు. ప్రతిపక్షంవారి వాగ్యుద్ధంలో శ్రీమతి గాంధీ బలాబలాలు తేలిపోయాయి. భారతదేశానికివున్న ఒక్కగానొక్క మిత్రదేశాన్ని విడిచిపెట్టుకోవాలని ప్రతిపక్ష సభ్యులు గోలచేశారు. భారతదేశం అంతకంతకు మిత్రులకు దూరమై పోతున్నది. దూరం చేస్తున్న వారెవరు ? అని ప్రశ్న వచ్చినప్పుడు—అందుకుకారణం ప్రతిపక్షంకాదు. భారత ప్రభుత్వమే ! ప్రభుత్వ విధానం మిత్రుల్ని శత్రువులుగా తయారు చేస్తున్నది !

ప్రభుత్వంలోనే రెండు వాదాలునాయి. ఒకరు కమ్యూనిస్టేతరుల్ని సమర్థిస్తే మరొకరు రష్యాను సమర్థిస్తున్నారు. పార్లమెంటులో 1968 వ సంవత్సరం ఏప్రిల్ నాల్గవ తారీఖున పాకిస్తానుకు ఇటలీ ఇవ్వనున్న 'టాంకు'ల మీద శ్రీమతి గాంధీ విరుచుకుపడ్డారు. ఇటలీవారు మిత్రులుగా వ్యవహరించడం లేదు అన్నారు. రష్యా విషయంలో ఇప్పుడు ఆమె సమాధానం వేరు. ఏ దేశమైనా ఎవరికైనా సహాయంచేయ నిశ్చయించుకున్నప్పుడు మనం మధ్యలో జోక్యం కలగజేసుకోనడం అనవసరం; ఇలాంటి సహకారోద్యమంవల్ల తప్పులేదు—అన్నారు ! రష్యావారు పాకిస్తానుకు ఆయుధ సహాయం చేసినా సరే, భారత దేశానికి బలం వున్నది ; దానితో ఎవరూ పోటీ చేయలేరు — అని ఎవరికీ తెలియనట్లు భారతదేశం గురించి గొప్పలు చెప్పుకున్నారేగాని ఈ విషయాన్ని ఆమె [illegible] వ్యవహారంగా తీసుకోలేదు. 'భారత్ చైనా భాయ్‌భాయ్' అనే నినాదం మీద కలలు కంటూ కూర్చునే వారు పండిట్ నెహ్రూ. దానివల్ల భారతదేశానికి ఎంత ఘోరప్రమాదం వాటిల్లిందో మనం కళ్లారా చూశాం. అలాగే ఇప్పుడుసాక్షాత్తు ఆ నెహ్రూగారి కుమార్తె అయిన శ్రీమతి గాంధీ పగటికలలు కంటున్నారు. భవిష్యత్తులో, వీరి కలల ప్రతిఫలాన్ని కూడా భారతీయులు అనుభవిస్తారు ?

మన పార్లమెంటు వ్యవహారాలు

లోక్‌సభలో ఇరవయ్యేడు బిల్లులు పెండింగులో వున్నాయి. రాజ్యసభలో పది పెండింగు బిల్లులకి ఏడు గట్టెక్కాయి ! దీనివల్ల పార్లమెంటులో ఎంత సత్వర కృషి జరుగుతున్నదీ గ్రాహ్యమవుతున్నది. పెండింగు బిల్లుల్లో బ్యాంకులకి, ఇన్సూరెన్సుకి సంబంధించిన సవరణ బిల్లులు, పేటెంటు బిల్లు, వ్యవసాయ ఋణసంఘ సంబంధమైన బిల్లు, సరిహద్దు రక్షణదళానికి సంబంధించిన బిల్లు మొదలైన ముఖ్యమైన వన్నీ వున్నాయి. ప్రభుత్వం కాయితంమీద పెట్టినవి ఇంకా ఇరవైనాల్గు కొత్తబిల్లులున్నాయి వాటిలో బీహారు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల బడ్జెట్టుల దగ్గరనుంచి అస్సాం పునర్వ్యవస్థీకరణ బిల్లువరకు అత్యవసరమైనవి ఎన్నో వున్నాయి.

పార్లమెంటు సమావేశమైన మొదటి వారంలో భారత సోవియట్ మైత్రిగురించి చర్చిస్తే, విదేశాంగశాఖ మంత్రిత్వం ఊరికే ఎలా కూర్చుంటుంది ? వారు భారత్ అమెరికా చుట్టరికాన్ని చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ సమస్యలతో పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది !

పాకిస్తాన్ రష్యాతో ఎలాగయితే సహకార సంబంధాలేర్పరచుకున్నదో— అమెరికాతోనూ అలాగే ఏర్పరచుకున్నది. భారత దేశానికంటే పాకిస్తానుకు అమెరికా ప్రభుత్వంలో ఎక్కువ చోటున్నది. దీని కంతకీ కారణం మనవారే. అమెరికా ధన సహాయాన్ని రష్యానుంచి ఆయుధాల్ని దిగుమతి చేసుకోడానికి భారతదేశం వినియోగిస్తున్నదని మన హైకమిషనర్ ధవన్ గారు లండన్‌లో అన్నారు. ఇలా నోరు జారడంవల్లనే మనదేశం పరపతి గంగలో కలుస్తున్నది వాటిని ఆసరా చేసుకుని పాకిస్తాను ఇతరదేశాల్లో ఇట్టే స్థానం సంపాదించుకోగల్గుతున్నది.

మన అభివృద్ధి పథకాలు అమెరికా ఋణంమీద ఆధారపడి వున్నాయి. వాగ్దానాన్ని కోతకోయ్యడం క్రిందటి సంవత్సరం రుచి చూశాం. ఈ సారికూడా అదే పాఠం చెబుతున్నది అమెరికా.

మన కేంద్రంలో రష్యా తరఫున పని చేస్తున్నవారు చాలామంది వున్నారనే విషయం రహస్యమేమీ కాదు. ప్రభుత్వం ప్రచురించిన 'ఆయిల్ కామెంటరీ' అనే పుస్తకం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది అదే పుస్తకంలో అమెరికాగురించిన వ్యాఖ్యానాలుకూడా వున్నాయి.

భారత్-అమెరికా సంబంధాలు

పరిపాలన విషయంలో భారత్—అమెరికా రెండూ బాగా దగ్గర. సమస్యలని పరిష్కరించడంలో రెండు దేశాలు ఇంచుమించు ఒకే పద్ధతిని అనుసరిస్తాయి. 1954 లో ప్రపంచ వ్యవహారాలకి సంబంధించిన ఒక భారత సంఘం భారత్—అమెరికా సంబంధాన్ని తరచి చూసింది. భారతదేశం తరఫున బి. కె. కౌల్, డా. గాడ్గిల్, అశోక్‌మెహతా, కీ. శే. కె. యమ్. పణిక్కర్ పనిచేశారు. వారి రిపోర్టు అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ భావాలతో అచ్చుగుద్దినట్లు అమరిపోయింది !

'ఇతర దేశాలకంటె భారతదేశం అన్ని విధాలా వెనకబడి వున్నది. ఆర్థిక పరంగాను, రక్షణ బలంలోను ఈ వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. వాటికి ఇతరదేశాల సహకారం భారత దేశానికి చాలా అవసరం' అని ఆ రిపోర్టులో నెహ్రూగారన్నారు.

భారత — అమెరికా సహకారోద్యమానికి ఆయన నాంది వేసినప్పుడు ఆమె

రికావారు కొన్ని సూచనలు ఇచ్చారు. ఈ సూచనలు రెండు దేశాలమధ్య మిత్రత్వానికి ఎలా బలాన్నిస్తాయో సూచించాయి. అందుకు భారతదేశం ఏయే విషయాలని మనసులో వుంచుకోవాలో ఒక పట్టీ యిచ్చింది.

ఈ పద్ధతిని సమీక్షిస్తూ చెస్టర్ బౌల్స్ ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటనలో భారతదేశ పరిస్థితులను వివరించారు 'భారతదేశం మీనమేషాలు లెక్కించుకుంటూ భవిష్యత్తును గురించి పేకమేడలు కట్టుకోవడంలో అలవాటు పడిపోయింది కార్మికుల అలజడి, గుత్తాధికారాలు భారతదేశ అభివృద్ధికి అడ్డుపుల్లలుగా వున్నాయి. దేశ పద్ధతి ప్రయివేటు రంగంలోకూడా వేళ్ళు పాతుకుపోయి దేశం అనుకున్నంత అభివృద్ధిని సాధించలేకపోతున్నది' అని ఆయన అన్నారు.

విదేశీసహాయం_సద్వినియోగం?

ప్రయివేటురంగం స్వతంత్రంగా వ్యవహరించలేక పోతున్నది అది ఆశించిన ఫలితాల్ని అందుకనే సామర్థ్యం కలిగినదే అయినా వాటికి పంచవర్ష ప్రణాళికలోని కొన్ని సూత్రాలు అడ్డుతగిలి ఎదగనివ్వడం లేదు. ప్రయివేటు రంగంలో రాబడిమీద రిజర్వుబ్యాంకు అజమాయిషీకొచ్చింది. దానితో వ్యాపారస్థుల్లో నిరుత్సాహం ప్రబలింది. ఇక, అమెరికా యిచ్చిన ధన సహాయాన్ని భారతదేశం అనుకున్న విధంగా వినియోగించుకోలేక పోతున్నది. ఇది అమెరికా వారిని 'షాక్' తినిపించే విషయం. అమెరికా ఆర్థిక సహాయం భారతదేశ 'స్వతంత్ర' జీవనానికి గొడ్డలిపెట్టు అని భయపడే భారతీయులున్నారు. ఇది విదేశాంగ విధానానికి కొంత దెబ్బ కాకపోదు.' అంటూ అమెరికా అభిప్రాయాన్ని ఆయన తన మాటల్లో చెప్పారు!

చైనా యుద్ధ సందర్భంలో భారత–అమెరికా మైత్రి గాఢతమంగా వుండేది. భారత్–పాక్ యుద్ధ సమయంలో భారతదేశానికి ఆయుధ సహాయం రద్దు చేయడంతో అపోహలు బయలుదేరాయి. క్రితం ఎన్నికల తర్వాత భారత–అమెరికాల మధ్య సయోధ్య పూర్తిగా చెడింది. ఇంత చెడ్డగా మునుపెన్నడూ లేదు. ఇప్పుడు రష్యా పాకిస్తానుకు ఆయుధ సహాయం చేసింది గనక అమెరికాతో మన దోస్తీ పెరగడానికి అవకాశం లేకపోలేదు! ఇప్పుడు అమెరికా ప్రభుత్వం తరఫున శ్రీ నికొలాస్ కాట్‌జెన్‌బెక్ మరి కొందరు ఆఫీసర్లతో మన దేశం వచ్చి వున్నారు. భారత్ అమెరికా స్నేహ సంబంధాలని మెరుగుపెట్టే చర్చలు కొనసాగుతాయని ఆశించవచ్చు. స్నేహ సంబంధాలు ఎక్కువగా ఏర్పడినా ఏర్పడక పోయినా ఇప్పటికంటె అధ్వాన్నంగా తయారు చేయకపోతే అంతే చాలు! ●



ఒకనాడు ప్రత్యూషకాలంలో ఉదయనుడు, వాసవదత్త అంతఃపురంలో వున్నాడు. యౌగంధరాయణుడు కూడా ఉన్నాడు. అప్పుడు వాసవదత్త ఉదయనునితో వీనులవిందుగా ఇలా అన్నది :

'దేవ, నాకు రాత్రి కల వచ్చింది. కలలో భస్మధవళుడు, జటాధరుడు, ఏనుగుతోలు కప్పుకున్నవాడు, నీలకంఠుడు, శూలపాణి అయిన ఈశ్వరుడు దర్శనమిచ్చాడు. నీకు స్మరావతారుడయిన కుమారుడు కలుగుతాడు. అతడు నీ వంశానికి కీర్తి తెచ్చి సర్వ విద్యాధరులకు రాజవుతాడు. దీనికి నిదర్శనంగా నీకొకటిచెబుతాను ఉదయం నీ పతి కొలువుకు దంపతు లిద్దరు వాదులాడుతూ వస్తారు. వారిలో భర్త ఏపాపమూ ఎరుగనివాడు. భార్యమాత్రం మంచిది కాదు—అని చెప్పి మాయమై పోయాడు. నేను వందిమాగధ వధువుల మంగళ గీతాలాపాలతో మేల్కొన్నను.'

భూపాల వల్లభ ఇలా అంటుండగానే ప్రతీహారుడు వచ్చి రాజుకు నమస్కారం చేసి ఇలా విన్నవించాడు: 'దేవ, ఒక స్త్రీ తన కుమారులు బంధువులతోపాటు తన భర్తను లాక్కునివచ్చి, వివాద పరిష్కారం కోసం మహాద్వారం ఎదుట నిలబడివుంది. ఆమె బంధువులు ఆమె భర్తను కొడుతున్నారు. ఆమె తన కాభర్త వెచ్చాలకు కూడా ఇవ్వడంలేదని, అతనితో వాదులాడుతున్నది. భర్తఏమో నేను అంతా ఇచ్చాను. అంటున్నాడు. మరేమీ మాట్లాడడంలేదు. ఏమీ ఇవ్వలేదని ఆ స్త్రీ అంటున్నది. దేవర వారే నిర్ణయించాలి.'

ప్రతీహారుని మాటలు ఉదయనుడు విన్నాడు. అప్పుడు మంత్రి యౌగంధరాయణుడు ఇలా మనవిచేశాడు: 'దేవా, సాక్షాత్తుగా త్రినేత్రుడే వాసవదత్తాదేవిస్వప్నంలో కనిపించి ఈ పురుషుడు నిష్పాపుడని తెలిపాడు. కనుక మరొకసాక్ష్యం అక్కరలేదు. అయినా, అతడు తనభార్యకు ధనం ఇచ్చాడా లేదా అనేది సాక్ష్యంతో నిరూపించడం అవసరం. లోకులను నమ్మించినప్పుడే కదా, గొప్పవారి గొప్పదనం నిరూపితమవుతుంది.'

ఉదయనునికి మంత్రిమాటలు నచ్చాయి. అతడు కొలువుతీర్చి వారివివాదం విన్నాడు. సాక్ష్యాధారంతో పురుషుడు నిర్దోషి అని నిరూపించి, ఆ స్త్రీకి పట్టణ పరిత్యాగ శిక్ష విధించాడు.

ఆ సందర్భంలో విదూషకుడు వసంతకుడు నవ్వుతూ ఒకకథ చెప్పాడు:—'మహారాజా, అన్యాసక్త అయిన వనితకు భర్త అంటే గిట్టదు, భర్తను ద్వేషిస్తుంది. ఒకకథ చెబుతాను, చిత్తగించండి:—

పూర్వం వారణాసిలో సింహపరాక్రముడనేవాడు వుండేవాడు. అతడు మంచివంశంలో పుట్టినవాడు. రూపసి. అందువల్ల రాజు కొలువులో సేవకుడుగా కుదిరాడు.

అతని భార్యపేరు కలహకరి. పేరుకు తగి నట్టిది. ఆమెనోరూ చెడ్డది. భర్త ఎంత సంపాదించి తెచ్చి ఇచ్చినా ఆమె దాహం తీరేదికాదు. అతనిని కలహాగ్నితో మాడ్చి వేసేది

అతడు ఆ బాధ భరించలేక, వింధ్యారణ్యానికి వెళ్ళి, వింధ్యావాసినీ దేవిని ఆశ్రయించాడు. తపస్సు చేశాడు. ఆమె అతని తపస్సుకు మెచ్చి బంగారునిధిని, ఒక నిర్మలమయిన రత్నపాత్రను అనుగ్రహించింది. 'ఈ రత్నపాత్రలో విశేషం ఏమిటంటే, పాత్రలోకి ఎవరైనా శ్రద్ధగా చూస్తే, వారి పూర్వజన్మ వృత్తాంతం కనిపిస్తుంది' అని వింధ్యవాసిని అతనికి తెలిపింది.

సింహపరాక్రముడు ఆ నిధిని తీసుకుని, రత్నపాత్ర జాగ్రత పరచుకొని వారణాసికి బయలుదేరాడు. ఒకనాడు ఆ రత్నపాత్రలో చూచాడు, తన పూర్వజన్మ వృత్తాంతం ఏమిటో అని. పూర్వజన్మలో తాను సింహమని, తనభార్య ఎలుగుబంటి అని కనిపించింది.

ఎప్పుడూ కోపగించుకుంటూ, ప్రాణి జాతాన్నే విరోధిస్తూన్న ఆ హీనురాలయిన విరుద్ధజాతి కళత్రాన్ని వదలిపెట్టాడు. ఆ రత్నపాత్ర ద్వారావే తనకు సజాతీయ అయిన కన్యకను ఎన్నుకున్నాడు. ఆమె రత్నగుంజుడనే వైశ్యుని కుమార్తె. పేరు సింహవతి. ఆమెను పెండ్లాడి సుఖంగా వున్నాడు. మహారాజా, పూర్వజన్మ విరోధం వల్ల, ఇతర కారణాలవల్ల మానవులకు భార్యతోను, మిత్రులతోను, పుత్రులతోను వైరాగ్యి ఏర్పడుతూ వుంటుంది.'

వసంతకుని కథ విని రాజు ఆశ్చర్య పడ్డాడు.

* * *

ఇలావుండగా కొంతకాలానికి ఒక శుభముహూర్తంలో యౌగంధరాయణునికి కుమారుడు కలిగాడు. అతడు తండ్రితో సమానుడు. సంపదలకు నిధానవంటి అతనికి యౌగంధరాయణుడు మరుభూతి అనే పేరుపెట్టాడు. అలాగే రుమణ్వంతునికి కూడా కుమారుడు పుట్టారు. అతనికి హరిశిఖుడనే పేరుపెట్టాడు. సతతోద్యోగ శీలుడయిన నిత్యోద్యుతుడనే ప్రతీహారునికీ ఒక కుమారుడు కలిగాడు. ఇతనికి గోముఖుడనే పేరు పెట్టారు. 'వీరందరూ; విద్యాధర ప్రభువు కాబోయే వత్స రాజ నందనునికి సహాయకు లవుతారు!' అని వీరు పుట్టినప్పుడు ఆకాశవాణి పలికింది.

పుణ్యవంతులకు యోగ్యమైనది, శుభ దైవతమయినది అయిన ముహూర్తంలో వాసవదత్త, దేవకి మురారిని కన్నట్టు ఒక కుమారుణ్ని కన్నది. పిల్లవాడు కాంతి పుంజంతో వెలిగిపోతున్నాడు. అప్పు డామె చంద్రుడు ఉదయించిన ఆకాశ లక్ష్మివలె కనిపించింది.

వాసవదత్తాదేవి కుమారుణ్ని ప్రసవించిందన్న వార్త నగరంలో వ్యాపించింది. సిరియే వచ్చి సంతోషంతో నగరాన్ని కౌగిలించుకున్నట్టుగా నగరంలో ఎటుచూచినా ఉత్సాహ సంతోషాలతో ఉత్సవాలు జరిగాయి.

అంతలో ఆకాశంనుంచి రాజు ముందు పుష్పవర్షం కురిసింది. దాని వెంటనే, అమృతంనుంచి పుట్టినదా అన్నట్టున్న దివ్యవాణి వినిపించింది:— 'ఓ రాజా, కాముడే నీకు కుమారుడుగా పుట్టాడు. వీడు విద్యాధర చక్రవర్తి అవుతాడు వీని పేరు నరవాహన దత్తుడు.'

ఆకాశవాణి ఈ విధంగా అన్నవెంటవే దివ్య శంఖనాదం వినిపించింది; దానితో పాటు దేవదుందుభులు మోగాయి. అప్సరలు గీతాలాపాలు చేశారు. ఉదయనుడు ఈ శుభ శకునాలకు చాల ఆనందించాడు. కుమారునికి నరవాహనదత్తుడు అని పేరు పెట్టాడు.

నరవాహన దత్తుడు ప్రజల మనోరథాలతో పాటు పెరుగ సాగినాడు. అతనికి మరుభూతి మొదలయిన మంత్రి సేనాపతి పుత్రులు సేవచేయ సాగినారు. ఆ ఉదయన బాలచంద్రుడు హర్షోల్లాసాలతో కలకలలాడుతూ, అందరి కన్నులను అమృతప్రాయంగా చల్లబరుస్తూ, ఆనంద చంద్రికా సుధాకాంతులను వెల్లివిరియిస్తూ, దినదినాభి వృద్ధి చెందాడు. ఉదయ పర్వతంనుంచి పుట్టి, దినదినమూ ఒక్కొకకళనే సంపాదించుకొంటూ జనం కళ్ళను చల్లబరుస్తూ, ఆనందం కలిగించే వెన్నెల వాకలను కురిపిస్తూ, ఆశా(దిక్) మండలాని కంతా భూషణ ప్రాయుడుగా వున్న చంద్రుడిలాగవున్న ఆ బాలుడు తండ్రి సకల ఆశాసముదాయానికీ భూషణప్రాయుడుగా వుండడం చూచి జనం ఉదయన మహారాజును మెచ్చుకున్నారు.

(ఇంకా ఉంది)

వైవారమే ప్రారంభం!

రచన

ఉన్నవ విజయలక్ష్మి

వారఫలం

9-8-1968 శుక్రవారం మొదలు 15-8-1968 గురువారం వరకు.

మేషం : వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

వృషభం : వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో కార్య భారం పెరుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

మిధునం : వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి. ప్రయాణం ద్వారా కార్య సాధన చేయగలరు. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది సాటి వారిలో గౌరవం లభిస్తుంది.

కర్కాటకం : వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. నూతన వ్యవహారాలు శ్రమ మీద ఫలిస్తాయి. విద్యా వైజ్ఞానికరంగాలో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

సింహం : భాగస్వాములతో కలసి చేసే వ్యాపారలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య : వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. ఇతరుల మీద ఆధారపడి యే వ్యవహారమూ ప్రారంభించడం తగదు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. అధిక వ్యయం జరుగుతుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు.

తుల : మీకు ముస్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధించగలరు. వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షుల సంచలనం పెరుగుతుంది. ప్రయాణాలు కొంచెం శ్రమ మీద ఫలిస్తాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృశ్చికం : కొన్ని వ్యవహారాల్లో మీ మంచితనమే మీకు ఇబ్బందిని కలిగిస్తుంది. వారం మధ్యలో వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు. వ్యాపారంలో సాటివారితో పోటీ పెరుగుతుంది.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

ధనుస్సు : వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాల్లో ముంగ మాటలు తగవు. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

మకరం : వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. నూతన వ్యవహారాలు ఫలించగలవు. స్థిరాస్థి వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

కుంభం : ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన చికాకులు తొలగిపోతాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు. కోర్టు వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మీనం : లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం వచ్చే పరిస్థితి యేర్పడుతుంది. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది. వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. అధికవ్యయం జరుగుతుంది.

—మహేష్

రాకాసి గుళ్ళు

మానవుడు పుట్టడం, చావడం సహజం. చనిపోయిన వాళ్ళని దహనంచేస్తారు. కొందరు పూడుస్తారు. పూర్వం చనిపోయిన వాళ్ళని పూడ్చేవారు. అలా పూడ్చిపెట్టిన చోట్లో రాళ్ళతో కట్టడాలు కట్టేవాళ్ళు. ఇలాంటి కట్టడాలని 'మెగాలిత్'లు అంటారు. ఇది గ్రీకు పదం. మెగాస్ అంటే పెద్ద, లితోస్ అంటే రాళ్ళు. వాటినే రాకాసిగుళ్ళు అని కూడా అంటారు.

ఇలాంటి మెగాలిత్‌లు దక్షిణ హిందూ దేశంలోనే చాల ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి ఆచారాన్ని ఇప్పటికీ గోన్డులు, ఖాశీలు, నాగాలు పాటిస్తారు. వీరు చనిపోయిన వారి జ్ఞాపకార్థం ఒక రాయిని నిలబెడ్తారు. చనిపోయిన వ్యక్తి ప్రాణం అలా ఉంచబడిన రాళ్ళలో అతుక్కుపోయి అక్కడుండే వాళ్ళకి మంచి చేస్తుందని వాళ్ళ నమ్మకం.

'మెగాలిత్' భూస్థాపితం చుట్టూ రాళ్ళు ఉంటాయి. చుట్టూ రాళ్ళు ఉంటే మెగాలిత్ అని దృఢంగా చెప్పొచ్చు. మణిమేఖలై, శిలప్పదికారం అనే సంగమ్ కాల పుస్తకాలలో పూడ్చడం గురించి చెప్పబడి ఉంది. సంగమ్ కాలం సుమారు ఒకటవ శతాబ్దం నుంచి మూడవ శతాబ్దందాకా అంటారు.

మెగాలిత్‌లలో అనేక రకాలున్నాయి. ఒక చోట్లో ఉండే మెగాలిత్‌కు మరో చోట్లో ఉండే మెగాలిత్‌కు తేడా ఉంటుంది. డాల్‌మినాయిడ్ సిస్ట్, హాట్ స్టోన్స్, హూడ్ స్టోన్స్, మెన్‌హీర్‌లు కొన్నిరకాల మెగాలిత్‌లు. డాల్‌మినాయిడ్ సిస్ట్‌లలో నాలుగు రాళ్ళు నాలుగుపక్కల ఉంటాయి. వీటిపైన మరొక పెద్దరాయి పెడ్తారు. తూర్పుపక్క ఉండే రాయిలో ఒక రంధ్రం ఉంటుంది. కొచ్చిన్‌లో టోపి క్కల్ (టోపీరాయి) లేక కుడైక్కల్ (గొడుగురాయి) అనే మెగాలిత్‌లున్నాయ్. కొన్ని చోట్లలో ఒక రాయి మాత్రమే ఉంటుంది.

పూర్వం శవాల్ని, ఎముకల్ని పెద్ద **కుండలలో లేకపోతే శవ పేటికలలో** ఉంచి పూడ్చడం ఆచారం. ఈ శవపేటికలకు 'సార్కోఫాగస్' అనిపేరు. కడప జిల్లాలో శంకవరం అనే చోట్లో దొరికిన శవ పేటిక గొర్రె ఆకారంలో ఉంది. ఈ శవ పేటిక లోపల ఎముకలు, ఇనుప కత్తి ముక్క ఉండేవి. ఆ పేటిక చుట్టూ కుండ లుండేవి.

కుండలు, ఇనుప వస్తువులు ఎందుకు శవాలతో పూడ్చేవారు? సమాధానం గట్టిగా చెప్పలేము. మతాచారంగా ఉండవచ్చు. మరణం తరువాత మరో ప్రపంచంలో జీవితాన్ని గురించి వారికి నమ్మకముండేమో. అందుకే కుండలు, ఇతర ఇనుప వస్తువు లుంచేవారు.


మెగాలిత్‌లు ఇంగ్లాండు, పోర్చుగల్, స్పెయిన్, ఫ్రాన్సు, జెర్మెని మొదలగు దేశాలలో కూడ ఉన్నవి. అక్కడుండేవి చాల పాతవి. అంటే 4000 సంవత్సరాలనాటివి. ఈ దేశాలలోని మెగాలిత్‌లలో రాతియుగం నాటి పనిముట్లు దొరికాయి.

మన దేశంలో ఉండే మెగాలిత్‌ల కాలం నిర్ణయంగా చెప్పలేం. అవి క్రీ.పూ. 300 సంవత్సరాల నాటివిగా ఉండవచ్చు.

తిరునెల్‌వేలిలో ఆదిచ్చనల్లూర్ అనే చోటుంది. ఆ చోట్లో కొన్నేళ్ళకు ముందు శవపేటికలు దొరికాయి. ఆ శవ పేటికలలో ఎముక లుండేవి. ఎముకలు మాత్రమే కాదు. కుండలు, ఇనుప కత్తులు, దీపాలు, ఇంకా ఎన్నో వస్తువులు దొరికాయి. ఇలాంటివి చెంగల్‌పట్, ఆర్కాట్, చిత్తూరు, కడప జిల్లాలలో ఎక్కువ.

ఈ మెగాలిత్‌లను ఎవరు కట్టారు? వారేకాలం వారు? ఎందుకు కట్టారు? ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పడం అంత తేలికైన పని కాదు. కాని తెలుసుకోడం అవసరం. తెలుసుకోవాలంటే ఇంకా పరిశోధన చేయాలి.

—నీలం శంకరనారాయణ



గొర్రె ఆకారంలో ఉండే సార్కోఫాగస్ అనే శవపేటిక.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

వి.ఎస్. ఎస్. ఆర్, తెనాలి

'ఇట్లాచేస్తే ఇట్లాంటి ఫలితాన్ని పొందుతారు' అంటూ పెద్దవారు అనుభవం మీద చెప్తారు. అది మాబోటి యువకులకు ఉపయోగకారిగా సమస్యలను సులువు చేసుకోడానికి తోడ్పడేదిగా ఉంటోంది ...అనుభవం గొప్ప గుణపాఠాన్ని నేర్పుతుంది. కాని చేయిబోయేముందు దాన్ని గురించి తెలుసుకొని ఉండడం మంచిది అనే నా భావన...

సంసారం సాగరం దుఃఖం నాయనా అని పెద్దలన్నంత మాత్రాన వివాహం చేసుకోవడం మానేస్తున్నారా? ! అయినా దాంపత్యం వంటి అతి సన్నిహిత విషయాలను గురించి—ఎవరి అభిప్రాయాలు, అనుభూతులు వారివే గాని ఒకరికొకరు చెప్పేదేముంటుంది? ఇటువంటి విషయాలపై ప్రాతీకరించినా అవి సరదాకి చదవడానికే గాని గైడు పుస్తకాలు కావు...ఈ శీర్షికకు ఒచ్చే ఉత్తరాలకు వ్యక్తిగత సమాధానాలిచ్చే అలవాటు లేదునాకు.

ఎమ్. కె. ఆర్, రాజమండ్రి

నేనేపని చెప్పినా అది చేస్తాను. అయినా నన్ను గొప్ప గౌరవంగా చూడరెందుకు—నా వాళ్ళు.

బాగుంది. పద్యం రెండో పాదం రాకుండానే పుల్స్టాపు పెమవరం ప్రయాణంలా హడావిడి పడితే ఎలాగ— వినదగు నెవ్వరు చెప్పిన అంతేగాని వినినంతన వేగపడకు!!

జె. ఎస్. ఆర్, రాయగడ

ప్రశ్నరాసి పంపించాలనే ఉద్దేశ్యంతో పెన్నుతీసి రాయబోయే సరికి పెన్‌లో సిరా అయిపోవడమో, లేక చేతిలోనుంచి పెన్ జారిపోవడమో జరుగుతుంది దీనికి కారణం ఏమంటారు రామలక్ష్మిగారు.

ఏముటుంది శ్రీనివాసరావుగారూ అశ్రుత తప్పింది. ఈమాటు కలం కాగితం చేతులో ఉన్నప్పుడు అనుకోకుండా రాసేయిండి ఏం జరుగుతుందో చూద్దాం.

వి. వి హెచ్. ఆర్, ఇచ్ఛాపురం

'వేరీజ్ గర్ల్స్ దేరీజ్ డేంజర్' అని నేనంటాను మీరేమంటారక్కయ్యా.

ఒకటి: ముందు ఇంగ్లీషు బాగా నేర్చుకోమంటాను.

రెండు: డోంట్ యు గో నియర్ డేంజర్!— అంటాను.

వి. ఎస్, తిరుపతి

అవునూ, ఆరుద్రగారు గెడ్డం ఎందుకు పెంచుకున్నట్టు రామలక్ష్మిగారు.

అవునూ, ఎందుకంటారు?

సి హెచ్. ఎన్, మారుటేరు

భార్యమనసు అర్థం చేసుకోలేని భర్తని ఏమంటారు అక్కయ్యగారూ.

కొంపలో కొలిమిని సంపాదించే అమాయకుడు అని చెప్పుకోవచ్చు చెల్లెలా,

బి. ఎన్. ఆర్, అనపర్తి

నాకు కోపం ఎక్కువ. దానితో ఎవరూ నన్ను పట్టించుకోడం లేదు...

వైరు లెవ్వరు? చిత్తంబున్నైరికాక?... కోపం తగ్గించుకుందు ప్రయత్నించండి.

ఎస్. కె. డి, భువనేశ్వర్

డి. కె. ఆర్, రాజమండ్రి

ఎమ్. డి హెచ్. ఎల్, విశాఖపట్నం

మీరు భార్యా భర్తలమధ్య రొమాన్సు రాస్తారేమిటండీ? పెళ్ళికాని వారిమధ్యనే కదా రొమాన్సు జరగాలి?

కృష్ణమూర్తికీ పార్వతికీ రొమాన్సేమిటండీ—ఇద్దరు పిల్లలున్నాక?

అయ్యా క్షమించాలి? భార్యభర్తలు కూడా ప్రేమించుకుంటారని నమ్మే మూర్ఖురాలిని.

బీ. వి. ఎస్. ఆర్. ఎస్, నిడువోలు

లక్ష్మిగారూ, ఆడవారు జవాబు లిస్తారంటే మొగవారికెందుకండి యింత ఉత్సాహం? అలాగే మగవారన్నా ఆడవారికి ఉత్సాహమేనా.

ఉంటుందండి — అపోజిట్లు అన్యోన్యాకర్షణ ఈనాటిదా? ఏనాటిదో,

ఎన్. ఆర్మీ పోస్టాఫీసు

డైరీ వ్రాయిటం నాకు పదేళ్ళనుంచి అలవాటు. ప్రయోజనం ఏమిటని అడిగితే జవాబు చెప్పలేక పోతున్నాను. మీరైనా చెప్పగలరా రామలక్ష్మిగారూ,

నాకు ఏకొంటున్న రాయిజమేగాని డైరీరాసే అలవాటేలేదు నిరంజన్‌గారూ, డబ్బుగిబ్బులంతో మాటా మాటా రాకూడదని చాలా శ్రద్ధగా పద్దులురాస్తాను. ఇకడైరీ అంటారా? ఆడవాళ్ళ రోజూ ఆడే చిన్నచిన్న అబద్ధాలు, విసుగులు,తిట్లు దీవనలు—ఇవన్నీ ఎందుకు రికార్డు—డేంజర్ అని ఊరుకున్నాను. మీకు ఎవరేనా శ్రద్ధగా డైరీరాసే వారే సమాధానం ఇవ్వాలి. క్షమించండి.

ఆర్. ఎస్, జగిత్యాల

ముప్ఫయిజాట్లు కలిసి ఉంటాయి గాని మూడు శిఖలు కలిసి ఉండవు. అని ఒక సామెత వుందికదా? ఇది నేటి కాలంలో ఎంతవరకు వర్తిస్తుంది?

వర్తించదనలు—నేటి సంఘసేవా కార్యక్రమాలు సంస్థలు అన్ని మాటేమిటి? ఎన్నెన్నో శిఖలుకలిసి నడుపుతున్నాయి. అంతదాకా ఎందుకు ముప్ఫై మూడువారీ సామెత పరమ అబద్ధం అని నిరూపించి చూపారుకదా?

పి. వి. ఎస్, నేలకొండపల్లి

మానవుడు బాహ్య పరిస్థితులకు దాసుడా? దాసుడైనచో ఎట్లు?

చుట్టూవున్న వాతావరణం మానవుణ్ణి దాసుణ్ణి చేసుకోవడంలేదా? ఎలాగంటే ఓం చున్నాను ధన వంతునిచూసి ధనవంతుడవాలని కళా కారుణ్ణి చూసి కళాకారుడవాలని సినిమాచూసి పేవరకు నుంచి తప్పుకోవాలని...ఇదంతా ఏమిటి?

ఎమ్. బి. ఆర్, మద్రాసు

భార్యంటే ఏమిటి రామా!

వర్తమానంలో పెళ్ళాం, భూతంలో ప్రేయసి భవితవ్యంలో రాక్షసి—భీమా!

జి. కె. కె, మేడ్చల్

డిటెక్టివు నవలలు చదవడం వల్ల చెడిపోదురని నా స్నేహితుడు, కాదని నేను అంటున్నాం. మీరేమంటారు?

డిటెక్టివ్ సాహిత్యం చదివితే చెడిపోరని—బోలెడు సాక్ష్యముంది (పెద్దలు ప్రముఖులు విజ్ఞానులు చాలామంది ఉన్నారు) కాని డిటెక్టివు సాహిత్యంపేర "కామం పిలిచింది" "లంకపాలా?" ల్లాంటి పుస్తకాలు చదువుతున్నారేమో!—ఈనాడు తెలుగులో ఇలాంటి జుగుప్సాకరమైన సాహిత్యం చాలానే వస్తోంది! కొంచెం చూసికొనండి పుస్తకాలు.


టి. బి. ఎల్, పాలకొల్లు

మీరు కొన్ని కథలలో భర్తని నువ్వు అని సంబోధించినట్లు వ్రాస్తారు...అది హిందూ సాంప్రదాయ వ్యతిరేకంకాదా?

ఆత్మీయంగా పిలవడంలో అగౌరవం ఏమీలేదు. అయినా భర్తని దూరంగా ఉంచడమేనా హిందూ సాంప్రదాయం—?

చంటిపిల్లలకు పరివిధ సంపూర్ణాహారం కావలసిన విటమిన్లుగల క్షీరాహారం





అమూల్
దుగ్ధాహారము

మీ పాపకు కావలసిన 7 విటమినులు గలవు.

ASP/ABF-58

ఒకవారం విపరీతం



షైలాక్షుడు

పై చదువులకి అవకాశం లేదని అమ్మాయి ఆత్మహత్య!

కాట్పాడిలో పరలక్ష్మి అనే అమ్మాయి కాలేజీలో చేరి, పై చదువులు చదువుకోలేని జీవితం వృధా అని నిశ్చయించుకొని, వసూర్ గ్రామంలోవున్న అత్తయ్య యింటికివెళ్ళి అక్కడ నల్లులమందు తాగిందట. ఆస్పత్రికి వెళ్లేసరికి చనిపోయింది. విద్యావ్యామోహం అంత పనిచేసింది.

ఆస్తి పంపకాలు-ఆవేశాలు

ఆవేశాలు అనర్థాలకు కారణం. అన్నగారిమీద వచ్చిన కోపంతో గోవిందరాజన్ అనే అతను తన అన్నగారి కొడుకును చంపాడట. ఆస్తిపంపకాల తగవులో అతను తన అన్నగారి కొడుకును పిలిచి, విషం కలిపిన అరటిపండు పెట్టాడట. సగం పండుతిని ఆ కుర్రాడు అక్కడే పడిపోయాడట. ఆసుపత్రికి తీసుకు వెళితే అక్కడ చనిపోయాడట. ఇది మధురాంతకానికి సమీపంలోవున్న వోరుత్తి అనే గ్రామంలో జరిగింది.

* * *

దైవ సన్నిధిలో సజీవ దహనం

విరుధునగర్లో గౌరి అనే 22 ఏళ్ళ అమ్మాయి భగవంతుని సన్నిధిలో కాలి చనిపోయిందట.



చక్కగా స్నానంచేసి, ఓ నైలాన్ చీర కట్టుకుని ఇంట్లో దేముడికి పూజచేసి, కర్పూరం వెలిగించి హారతిచ్చి, నమస్కరిస్తుండగా చీర దీపానికి తగిలి, అంటుకుని, నిలువునా కాలి, ఆసుపత్రిలో చేర్చాక చనిపోయిందట. మొన్న వేసంగుల్లో యీామె యమ్మే ప్యాసయిందట— ఇది భగవల్లీలనాలా!

* * *

తొండప్పనాయకన్ పాలయంలో కందసామినాయకర్ కొడుకు ముత్తుస్వామి వివాహం చేసుకొని ఆస్తిలో వాటా తీసుకుని, అది ఖర్చుచేసి, వాళ్ళ వాటా యిమ్మన్నాడట. ఇవ్వననేసరికి అమ్మనూ, అమ్మమ్మనూ కొడవలితో నరికి అడ్డొచ్చిన తండ్రిని కూడా నరికి పారేసి, చేతికందిన డబ్బు, నగలు తీసుకుని పారిపోయాడట.


* * *

తిరుచ్చివద్ద కావేరినదిలో ఘోరమైన పడవ ప్రమాదం ఒకటి జరిగింది. పడవకి ఓ చిన్న కన్నం వున్నాసరే నిర్లక్ష్యం చేసి పడవ నడిపే అతను పడవను బయల్దేరదీశాడట. దారిమధ్యలో కన్నానికి

డాక్టర్ కబుర్లు

వయస్సు మళ్లిన వారికి సలహా

వయస్సు మళ్లిన వారి కాళ్ళు, పాదాలు కొన్ని బాధలకి, మార్పులకి గురి అవుతూ ఉంటాయి.



చర్మం ఎండిపోతుంది, రక్తనాళాలు బిగుసుకు పోతాయి, రక్తప్రసారం తగ్గుతుంది...వారు గమనించ వలసిన కొన్ని విషయాలు :

1. చర్మానికి వీలయినంతదాకా నూనెరాస్తేనే మంచిది. సారాయం కలిపిన 'మందులు' మంచివి కావు.

2. కాళ్లకి 'మాలీష్' పట్టటం తగదు. చర్మం బాగా దెబ్బతినవచ్చు.

3. నడవటం మంచిది.

4. పులిపిరి కాయలు, చెప్పుల వల్ల ఏర్పడిన కాయలకి స్వయంగా మందులు వాడటం ప్రమాదకరం.

5. అతి వేడిగా ఉన్న నీటిలో స్నానం చెయ్యడం శ్రేయస్కరం కాదు.

హెచ్. ఎల్. హెర్షెన్‌సోన్

(కాపీరయిటు)

అడ్డంపెట్టిన గడ్డివూడి లోపలకు నీరు ప్రవేశించి పడవ మునిగిపోయిందట. ప్రయాణం చేస్తున్న 70 మందీ మునిగిపోయారట. 47 మంది యీదుకుని ఒడ్డుకు రాగలిగారనీ, మిగిలిన 23 మందిలో 13 మంది శవాలు దొరికాయనీ తెలిసింది. ఈపడవమీదగా స్త్రీల శవాలేనట!

*   *   *

కొన్ని మళయాళ చిత్రాలలోనూ, తమిళ చిత్రాలలోను నటించిన రాణిచంద్ర (ఈమె మళయాళ సుందరిగా ఎన్నికయింది) తండ్రి సినిమాలో చేరుస్తాను అని, అమాయిక స్త్రీలను మోసగించుతున్నాడన్న నేరానికి ఆయన్ను అరెస్టు చేశారు. ఒక వున్నతోద్యోగి కూతుర్ని మోసగించి, 2500 రూపాయలు కాజేసిన నేరంలో యీయన పట్టు బడ్డాడట.

*   *   *

యం. బి. బి. యస్. ప్యాసయిన 24 సంవత్సరాల ఉష అనే ఆమె కనుపించటం లేదని ఆమె స్నేహితురాండ్రు రిపోర్టి స్తే పోలీసులు 17 గంటలు వెతికి, ఆనక ఆమె రూము తలుపు పగులకొట్టి చూస్తే, లోపల ఆమె చనిపోయి వుందట. పక్కన డాక్టర్ జివాగో నవల పడి వుందట. ఈమె కేరళకి చెందిన ఒక పోలీసు అధికారి కూతురట. ఈ దారుణం ఢిల్లీలో జరిగింది.

*   *   *

వరాహగారిని చంపి, మధుర జైల్లో యావజ్జీవ కారాగారశిక్ష అనుభవిస్తున్న మన్నారం అనేవ్యక్తి మొన్న 17న ఉదయం 6.45కు ఫలహారం తినడానికి అందరితో బాటు బయటికి వచ్చి, వున్నట్లుండి ఆ పక్క నున్న గోడ ఎక్కి, అక్కడ నుంచి దూకి, ఆత్మహత్య చేసుకున్నాడట.

పడవని ముంచిన ఈదే ఎలుకలు

ఇద్దరన్నదమ్ములు ప్రయాణం చేస్తున్న పడవని కొన్నివేల ఎలుకలు ఎదుర్కొని ముంచేశాయట. ఆ ఎలుకలు (ఈదే ఎలుకలట) యీదుకుంటూ వచ్చి వారి పడవ ఎక్కేసరికి భయంతో వాళ్ళు చిందులు వేశారట. దాంతో పడవ తిరగబడి అన్నదమ్ములిద్దరూ చనిపోయారట. ఇది మనిలాలో జరిగింది. ఇండియా ఎలుకలకు యీదడం వచ్చా!?



ఫ్రాన్స్‌లో వృద్ధ దంపతు లిద్దరూ ఓకారులో వెడుతున్నారట. తేనెటీగ ఒకటి కారు నడుపుతున్నాయన ముఖం మీద కుట్టిందట. దాంతో స్టీరింగు పట్టు తప్పి, కారు ఓ చెట్టుకు ఢీకొందట. ఆ చెట్టుకున్న తేనెపట్టులోంచి కొన్నివేల తేనెటీగలు వచ్చి అతన్ని కుట్టాయట. బాధతో ఆర్తనాదం చేయడానికి నోరు జాపేసరికి నోట్లోకి కూడా వెళ్ళి కుట్టి క్షణాల మీద చంపాయట. భార్య వర్మాత్రం స్వల్ప ప్రమాదంతో బయట పడిందట.

* * *

తనతో పొద్దస్తమానూ దెబ్బలాడుతోందనీ, ఏ విషయంలోనూ ఏకీభవించటం లేదనీ ఆవేశంతో గోపాలన్ అనే అతను తన భార్య ఈశ్వరిని నరికేశాడట. వాళ్ళిద్దరికి వచ్చిన ఓ పోట్లాటలో గోపాలన్‌కి ఆవేశం వచ్చి దగ్గరలో వున్న కొడవలి వంటి ఆయుధంతో భార్య తల నరికి, ఆనక తను ద్రావకం తాగాడట. పోలీసులు అతన్ని అరెస్టు చేసి, ఆసుపత్రిలో జేర్చిస్తే నాలుగోనాడు చని

ఒకవారం విపరీతం

పోయాడట. ఇది ఆరణార్ తాలూకాకు చెందిన మనియంబాడ గ్రామంలో జరిగింది.


* * *

మద్రాసు పి. డబ్ల్యు. డి. శాఖలో పని చేస్తున్న సచ్చిదానందం అనేవ్యక్తి శవం 'సౌకాడు అనే గ్రామం వద్ద మొన్న దొరికిందట. 12వ తారీఖున ఆఫీసులో ఓ అయిదువందలు అప్పు తీసుకుని ఇతను శౌకాడు బయలుదేరాడట. దారిలో అతన్ని ఎవరో అటకాయించి, ఎలక్ట్రిక్ వైరుతో చితక్కొట్టి, నీళ్ళ తొట్టిలో ముంచి, అతి దారుణంగా హత్యచేసి, ఆ డబ్బుతో పరారైపోయారట.

* * *

పోర్‌కి చెందిన వాక్రహార్‌పేట ప్రాంతంలో 45 ఏళ్ళ వృద్ధుని శవం ఒకటి మొన్న 18న దొరికిందట. శవం వంటి మీద బనీను, ఒక లుంగీ పంచ తప్ప ఏ యితర వస్తువులూ లేవు. అసలు ఆయన ఎవరు? ఎందుకు ఎలా చనిపోయాడు అనే విషయం మీద పోలీసులు విచారిస్తున్నారు.





పడుకున్న పిల్లల్ని కాటేసిన పాము

కాళియమ్మన్‌పేట (గుడియాత్తం) లో పాము కరిచి యిద్దరాడ పిల్లలు మరణించారట. దీపాల వేళ పాకలోకి పాము ప్రవేశించడం ఒక కుర్రాడు చూసి, చెప్పినా లాంఛనంగా వెతికి నిర్లక్ష్యం చేసిందటా యిల్లాలు. తీరా నలుగురు పిల్లల్ని పడుకోబెట్టే—రాత్రి నలుగుర్ని పాము కరచిందట ఆ భయంకర కేకలకు లేచి, పామును చంపారట. 17 ఏళ్ళ సరస్వతి అనే అమ్మాయి వెంటనే గిలగిల తన్నుకుని చనిపోయిందని, 12 ఏళ్ళ బేబీ ఆసుపత్రిలో పోయిందని మిగిలిన యిద్దరు పిల్లలు ప్రాణాపాయ స్థితిని దాటారని వార్త!

శివాజీ కత్తి

ఇదే ఛత్రపతి శివాజీ వుపయోగించిన కత్తి అవటాని మహాడు లక్షల రూపాయలకు వేలం వేస్తున్న కత్తి నిజానికి ఛత్రపతి శివాజీది కాదనీ. శివాజీ కత్తి లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియం లోనేవుందనీ మహారాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. లోక్‌సభలో ఈ విషయం మాట్లాడుతూ, వెనకటికి గురుగోవిందసింగ్ కత్తిని బ్రిటిష్ మ్యూజీయంలో నుంచి తెచ్చినట్లు శివాజీ కత్తి కూడా తేవాలని ఒకాయన సూచించారట. ఇంతకీ శివాజీ కత్తి అదే అయినా 3 లక్షలకు వేలం పాడడం బాగుండలేదని సోలంకి అభిప్రాయపడ్డారట. ●





యామినీదేవి

గుండెలో రగిలే మంటలో శత్రు కరవాలం చలి తీర్చుకున్నది. వీరేంద్రసింగ్ రక్తంలో తడిసి ముద్దయినాడు. శత్రు భేద్యమైన గుండెలాంటి కోటలో పఠాన్లు ప్రవేశించి, కోటలాంటి గుండెలో గునపం గుచ్చారు. చెట్టంత మనిషి, నిట్టనిలువునా కూలిపోగా, పరదా ఒత్తిగిలించి చూచింది విమల, అతని నీడలోనే హర్మ్యాలు నిర్మించుకున్న యిల్లాలు. ఓపిక తన ఆధీనంలో ఉన్నంతమేరకు పోరు సాగించాడు పాపం, కాని కాలం శత్రుసైనికునిరూపాన కాటేసింది.

విమల, భర్త దుస్థితికి కన్నీరుమున్నీరుగా విలపించే వ్యవధిలేక, పరుగు పరుగున అభ్యంతర విలాస మందిరానికే చేరుకున్నది రాచవారి విలాసమందిరాలలో అనుమతి లేకుండా చొరబడరాదు, నిజమే. కాని కడుపుతీపివల్ల కట్టుకున్నవాడు కత్తుల బోనులో చిక్కుకున్నా, కన్నబిడ్డ భవిష్యత్తునైనా కాపాడాలన్న తపనతో, కన్నీటిని గుండెల్లోనే ఎండబెట్టి పరుగున వచ్చింది.

రాజకుమార్ జగత్‌సింగ్, ప్రియురాలి పరిష్వంగ సుఖంలో, స్వర్గసోపానాలు లెక్కిస్తున్నాడు. అతివ సొదులో ఆదమరచి, సోలిపోయి ఉన్నాడు. అతిలోక లావణ్యవల్లి తిలోత్తమ, నునులేత పెదాలతో అతనికి అధరామృతాన్ని ఆరగింపు చేస్తున్న తరుణంలో, విమల శయ్యామందిరం ప్రవేశించింది. రహస్యం చెవి కొరికింది.

ఏమరుపాటున, మధుర లోకాలలో, తూగుటుయ్యాల లూగుతున్న, ప్రేమ పక్షులు, రెక్కలల్లార్చాయి. వడిసెల వేటదిన్న పక్షుల్లా ముగ్గురూ, రహస్య ద్వారం వేపు పరుగు దీశారు. గవాక్షాలను, కవాటాలను క్షణంలో దాటారు. మరో క్షణంలో రహస్య ద్వారం దాటి, బిల మార్గం చేరి, బంధాలు మూయబడేవేళ, కాల కింకరుల్లా, నలుగురు పఠాను యోధులు. పలాయనం చిత్తగించే హారిని గమనించి, పరుగున వచ్చారు. కత్తులు తళతళలాడాయి. కుత్తుకలపై ఎగబాకాయి.

ఇద్దరాడవారి మధ్యనున్న, రాజకుమారుడు జగత్‌సింగ్, భీరువుకాడు. రాజపుత్ర రక్తం ఆతనిలో ఎండిపోలేదు. పారిపోవడానికి వీల్లేని ఘట్టం. 'అల్లాహో అక్బర్' అంటూ పఠాన్లు, మీద కురికారు. జగత్‌సింగ్ కత్తి గాలిలో మెరిసింది. వేటు కొకటిగా శత్రువుల తలలు నేల వాలాయి. నలుగురు యోధులు నేల రాలే సమయానికి, మరొక దండు దండుకున్నది. ఇంక పోరాడి ప్రయోజనం లేదు. ప్రతిఘటన నిష్ఫలం. అప్పటికే అలసిపోయి, చెమటోడ్చుతున్నాడు. శత్రుఘాతాలకు, శరీరం యావత్తూ రక్త చందనం అలముకున్నట్లు అయింది. పఠాన్ల కత్తుల పదునుకు అతను ఎరగాబోతున్న తరుణంలో, ఎవరిదో కేక, గంభీరంగా వినిపించింది.

'అతన్ని చంపకండి ప్రాణాలతో పట్టి తెండి' ఆమాటలో హుకుం వినిపించింది... ఉస్మాన్‌ఖాన్ గొంతు కంచుగంట. సర్వ సైన్యాధిపతి కావడంతో అతనిమాట సైనిక కూటమిలో, శాసనం. నవాబ్ కల్లూఖాన్‌కు అతను యిష్టుడు.

జగత్‌సింగ్‌కు ఎప్పుడో తెలివి తప్పింది. నిర్జీవ స్థితిలో, మగతగా, కనురెప్పలు ఎత్తినపుడు, అది ఏ లోకమో తెలియదుగానీ, మంజుల కిన్నెరీస్వనం చెవుల సోకింది. అటూ, ఇటూ పరికించాడు పదారు వన్నెల ముగ్ధ, లావణ్యసుందరి, ఏ దేవకన్యో, అప్సరాంగనో, తన ప్రక్కచేరి, గాయాలకు మందురాసి, సేవ చేస్తోంది. దూరాన, తివాచీపై కూర్చున్నది ఉస్మాన్‌ఖాన్ అని గ్రహింపు కలిగింది. జగత్‌సింగ్ అనుమానం, పెనుభూతం కాగా పెదవి కదిపి ప్రశ్నించాడు, అవాసక్తంగా—

'నే నెక్కడున్నాను?'

దాపున చేరిన కలకంఠ కమనీయ కంఠస్వరం ఊరడించింది, 'మరేం భయపడకండి, సురక్షితంగానే ఉన్నారు'

'ఏవేళైందిప్పుడు?' మరో ప్రశ్న. తన స్థితికి, ఉనికికి అదొక సూత్రం కావాలి.

'అపరాత్రి' ఆమె తీయనిమాట.

'నీ వెవరు ?' పలుకులో పదును, రాజసం ... కదలలేని స్థితిలోనూ కరుకుదనం,

'ఆయెషా' ఆమె సంతోషంతో నిట్టూర్చింది.

అతని భావవీచికలలో తిలోత్తమ రూపొందింది...క్షణం నిర్వేదం..... మరుక్షణంలో నరాలు చిట్లి రక్తం స్రవించి స్పృహ తప్పి పోయింది.

'ఉస్మాన్' ...వెంటనే హకీంను పిలిపించు.' ఆయెషా ఆజ్ఞ అంచెలంచెలుగా హకీంను చేరింది. అతడు రెక్కలులేని విమానంలో వచ్చి వాలాడు ఆయెషా మ్రోల. అవసరమైన మందులు, తోచిన మాకులు ఉపయోగించాడు..... తెల్లవారింది, కాని జగత్‌సింగ్‌లో చలనం లేదు. ఊపిరి మాత్రం ఆడుతున్నది, సజీవుడే అనడానికి నిదర్శనంగా. ఒక్కసారిగా జ్వరం తారస్థాయికి చేరింది. శరీరం కొలిమిలా కాలుతున్నది. రాజవైద్యుడు ఎన్నోసార్లు వచ్చి ఎన్ని మందులు వాడినా గుణం కనిపించలేదు. ఆయెషా కంటికి కునుకు కరువైంది. అన్నపానీయాలు విసర్జించింది. కంటికి రెప్పలా రాజకుమార్ ప్రక్కనే కనిపెట్టుకుని ఉన్నది.

చీకటి పడ్డది. క్షణాలు యుగాలుగా నిశిరాత్రి దాటింది. రాజకుమార్ కళ్ళు తెరిచాడు. అతని పెదాలపై నిర్జీవ హాసం లాస్యం చేసింది ఆమె బరువుగా నిట్టూర్చింది గుండె బరువు కొంత తగ్గింది. కాని అతని మనసు విశ్రాంతి తీసుకోవడం లేదని ఆమె గ్రహించింది...మనసున ముసురు పట్టింది. మంచుపొగ క్రమ్మింది. ఏదో జ్ఞాపకం అతన్ని కకావికలు చేస్తోంది. అది ఏది ?

కొన్ని క్షణాలు గడిచాయి. రాజకుమార్ గుండె దిటవు చేసుకుని ప్రశ్నించాడు, 'నేనెక్కడున్నాను?'

'కల్లూఖన్ కోటలో' ఆమె, ఆయెషా మంద్ర స్థాయిలో, మంజులంగా సమాధానం చెప్పింది.

జవాబు విన్న మరక్షణంలో అతని మతి తప్పింది. మరో రెండురోజులు, ఏ లోకాలలోనో ఉన్నాడు. అప్పుడు, ఈ లోకంలో కళ్ళు తెరిచి అడిగిన ప్రశ్న.

'నేనిక్కడెందుకున్నాను.'

ఆమెకు వెంటనే సమాధానం చెప్పే ధైర్యం లేదు. మరలా మగత నిద్రలో కరిగిపోతాడని జంకు. కాని చెప్పక తప్పదు. తెలిసీ తెలివిడి చేయక పోవడం లక్షణం కాదు. 'మీరు జబ్బుతో ఉన్నారు అన్నది... దాని కొసన, కనిపించిన సమాధానం.

జగత్‌సింగ్ అజ్ఞానికాదు, అతివల ఆంతర్యం ఎరిగినవాడే, మాటల చాటున దాగిన మమతలు, గ్రహింపుచేసుకో గల సరసుడే. తల అడ్డంగా ఊపి, విషాదంతో

చిరునవ్వును రంగరించాడు:

'నేను బందీని కదూ' అన్నాడు. దానికీ, సుకుమారి ఆయెషా మౌనమే సమాధానం.

'ఇంతకీ నీవెవరవు' అతడే తిరిగి ప్రశ్నించాడు.

'ఆయెషా' అన్నది రూఢిగా.

'ఆయెషా! అంటె?' అతని ప్రశ్న.

'నవాబ్ కల్యాణ్ ఖాన్ గారాల కూతురును.

జగత్‌సింగ్‌కు మాటలు పొడిగించే త్రాణ లేదు. కొంతసేపు ఊరుకున్నాడు. చివరకు అడిగాడు.

'నేనిక్కడ ఎంతకాలంగా వున్నాను?'

'నాలుగురోజులు'

'అయితే కోట విూ ఏలుబడిలోకి వచ్చిందా'

'అవును'

'వీరేంద్రసింగ్ ఎక్కడ?'

'కారాగారంలో...ఈరోజు ఉరితీస్తారు' అతను వేటుదిన్న పులిలా చూచాడు.

'అతనికయిన వారెక్కడున్నారో?'

ఆయెషా గ్రహించింది. సమాధానం తన నోటితో చెప్పడం యిష్టంలేదు.

'నాకు తెలీదు' అన్నది.

'మీ ఆరోగ్యం బాగాలేదు. ఎక్కువగా మాట్లాడవద్దని హకీం చెప్పారు. దయచేసి విశ్రాంతి తీసుకోండి' అని అతని ఆలోచనలు తప్పించింది. ఏవో మందులుతీసి అతనికి అందించింది. ఆయెషా కళ్లలోని కామనలు గ్రహించాడు రాజకుమార్. ఆమె జేల కన్నులలోకి సూటిగా చూస్తూ అన్నాడు.


ఆయెషా

'తెలివి తప్పిన స్థితిలో ఒక కలగన్నాను. ఎవరో ఒక దేవత నన్ను కాపాడి, ఉపచరించింది. ఎవరామె? నీవా! తిలోత్తమా?'

'బహుశా తిలోత్తమ అయివుంటుంది' అన్నది ఆయెషా, గుండెలలో కొండల బరువు మోస్తూ...

తిలోత్తమ పేరు వినగానే, జగత్‌సింగ్ మనసు ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరైంది.

తుఫానురాత్రి తాను ఆమెను, ఒంటిగా కలుసుకున్నాడు! ఎక్కడ? బిలేశ్వరాలయంలో తలదాచు కొనడానికి వెళ్లిన తనకు, అదే స్థితిలో ఉన్న తిలోత్తమ కనిపించింది. ఆమె అపూర్వ సౌందర్యం, తనను ముగ్ధుణ్ని చేసింది, ఆమె ముగ్ధ అయింది. తనను చూచి పిరుదులు దాటిన ఆమె కేశాలు, వానకితడిసి ఒంటినంటిన చీర ఆమె యవ్వనాన్ని, సౌందర్యాన్ని, ప్రత్యంగుళంలో కమనీయంగా ఉద్దీపింప చేసింది. తిలోత్తమ మేలి ముసుగులోనుండి తనను వీక్షించింది. కళ్ళు కళ్ళు కలుసుకున్నాయి. గుండెల్లో దాగిన హృదయాలకు సంకేతాలు, సందేశాలు అందజేశాయి. ఆమె సిగ్గుల మొగ్గగా, తలవంచుకుని, వనసుందరిలా పులకరించింది. ఆ పులకరింత తనపై పూలవాన కురిపించింది. తనకు ఆ క్షణంలో, ఆ మధుర క్షణంలోనే తోచింది, ఆమె, తన దేవేరి అని, తన ప్రేమనీరాజనాలు అందుకో సిద్ధమైనదని. కాని ఆమె ఎవరో ఆ క్షణంలో తెలియదు.



తనకు ఆతిథ్యం యిచ్చి, ఆదరిస్తున్న విమలతో చెప్పాడు తన గుండె గుబులు గురించి. ఆమె ప్రసన్నంగా నవ్వింది. సరే నన్నది. చూదామనీ అన్నది...ఆ చిన్నదాని చెలిమికోసం రాజకుమారుడు అలమటించాడు...నిద్రాహారాలను జతచేసి విసర్జించాడు.

వెలపొడుపునాడు, విధాయకంగా కోనెలకు బయలుదేరాడు దేవతార్చన కోసం. అక్కడే స్వప్న సుందరి, నిజరూపంలో ఎదురైంది. తోడుగా వచ్చిన విమల నవ్వింది. ఇద్దరికీ పరిచయం చేసింది. పుట్టుపూర్వోత్తరాలు కులగోత్రాలు ఏకరువు పెట్టింది ఏకబిగిని. అదృష్టం అరచేతిలో విలిచింది. ప్రసన్నసుందరి తిలోత్తమ ఎవరోకాదు, విమల కూతురే, అవరోధాలు లేని ఝరీ ప్రవాహం ప్రేమ... నాటి నుండి మలుపులు తిరిగింది.

జగత్‌సింగ్ శరీరానికి తగిలిన గాయాలు మానుపట్టాయి. కాని మనసుకు తగిలిన గాయం? స్వస్థత చేకూరిన తర్వాత తిలోత్తమను గురించిన ఆవేదన ఎక్కువైంది. ఆమె ఎక్కడున్నది? ఏ స్థితిలో ఉన్నట్లు? తన గది ఏమిటి? ఈ ఆయెషా ప్రవేశానికి అర్థం, అంతర్యం ఏమిటి? పైగా వీరేంద్రసింగ్‌కు ఉరిశిక్ష?

ఆయెషా, సంపూర్ణ విశ్వాసంతో, ప్రేమతో అతన్ని బ్రతికించుకున్నది ... సేవించింది. ఉదయం అతని మందిరంలోకి వస్తే తిరిగి అమ్మ పిలుపు అందేవరకు కదలదు. ఆమె అందం ఆరాధన, అతన్ని పులకింపచేస్తున్నాయి.

జగత్‌సింగ్ కాస్త అటు, ఇటు తిరుగుతున్న సమయంలో ఒక వాచాలుడు చెప్పాడు, విమల తిలోత్తమ, కల్యాణ్ ఖాన్ రాజప్రాసాదంలో దాసీలుగా ఉన్నారని. ఆ వార్త అగ్నిలా అతని రక్తాన్ని ఉడికించింది ... రాత్రి అంతా కంటికి నిద్ర రాలేదు మరురోజు కల్యాణ్ ఖాన్‌తో గోష్టికి విన్నపం పంపాడు.

నవాబు సైతం, అతని వీరోచిత చర్యలకు ముక్కున వద్దాడు...అతనితో మాట్లాడాలని సరదా పడ్డాడు. విశాల హృదయంతోనే విన్నపాన్ని మన్నించి ఆదరంగా ఆహ్వానించాడు. జగత్‌సింగ్ చనిపోతే లాభం లేదు. అతను బ్రతికుంటేనే విలువ. తాను జగత్‌సింగ్‌ను క్షణంలో కడతేర్చగలడు. కాని అతని తండ్రి రాజా మాన్‌సింగ్ అతి

బలాఢ్యుడు. తనపై దండెత్తి, తనను తునాతునకలు చేయగలడు. మాన్‌సింగ్‌తో, తన షరతులతో సంధి చేసుకోవడానికి జగత్‌సింగ్‌ని ఉపయోగించాలని అతని పన్నాగం. అవే షరతులు, జగత్‌తో చెప్పాడు. కానీ పౌరుషం మొక్కవోని జగత్ వాటిని కాలరాచి వేశాడు. ఆగ్రహంతో జగత్‌ను చెరసాలలో బంధించమని హుకుం జారీ చేశాడు కల్యాణ్‌ఖాన్.


జరుగుతున్న తతంగాలన్నీ విమలకు తెలుస్తూనే ఉన్నాయి...జగత్‌ను చెరసాలలో వేశారని తెలియగానే కోటనుండి తప్పించడానికి ఆమె పథకం వేసింది. సైన్యాధిపతి ఉస్మాన్‌ను మురిపించి అనుమతి ముద్రిక సంపాదించింది. తిలోత్తమకిచ్చి, అర్ధరాత్రి కోట సింహద్వారం చేరుకొమ్మని సలహా యిచ్చింది ముద్రికతోపాటు. అక్కడ మరొక వ్యక్తి ఎదురై, అలాటి ముద్రికనే చూపిస్తాడు. ఆమెను అభిరామ్‌సూరి యింటికి చేర్చుతాడు. తాను మరునాడు వెళ్ళి వారిని కలుస్తుంది. ఇదీ ప్రక్రియ.

చెప్పినట్లే తిలోత్తమ అర్ధరాత్రి దాటగానే, కోట సింహద్వారంవేపు బయలుదేరింది. జగత్‌సింగ్ బందీగా వున్న చెరసాల దగ్గరకు రాగానే ఆమె కాళ్ళు స్వాధీనం తప్పాయి...మనస్సు మారింది...తాను బయలుదేరిన పని మరచిపోయింది...'జగత్‌సింగ్' అనే పేరునే ఉచ్చరించింది.

ఆమె చేతినున్న ఉంగరం చూచాడు. ద్వారపాలకుడొకడు ఆమె నోటి మాట విన్నాడు 'జగత్‌సింగ్' అని. ఆమె అతని కొరకే వచ్చిందనుకొన్నాడు. అనుకుని ఆమెను వెంటపెట్టుకుని కారాగారంలోకి తీసుకువెళ్ళాడు. జగత్‌సింగు ఎదురుగా నిలబడ్డాడు. ఆమెకు నోట మాట రాలేదు. అతని పాదాలపై బడి కన్నీటితో అభిషేకించింది...అతను దిగ్గున అడుగు వెనక్కి వేశాడు. 'నీవు వీరేంద్రసింగ్ కుమార్తెవు ... ఇదేం పని, వెళ్ళిపొమ్మా' అన్నాడు తల త్రిప్పుకుని.

జగత్‌సింగ్ మాటలు, ఆమెకు అశనిపాతంలా సోకాయి. అతని కటువర్తనకు మూర్ఛపోయింది...'ఆయెషా'ను పిలవమని ద్వారపాలకునితో చెప్పాడు.

ఆయెషా వచ్చింది. చూపులోనే జరిగింది గ్రహించింది. తిలోత్తమ ప్రక్కనే కూర్చుని, ఆమెతల తన ఒడిలోకి తీసుకుని, ముఖంపై చన్నీరు చిలికింది...తిలో



పశులను తినగల్గే సాలీళ్లను గురించి విన్నారా? నేలమీాదనే సంచరించే టరంట్యులా అలాంటిది. సుమారు 3 అంగుళాలను మించిన శరీరానికి, 7, 8 అంగుళాల కాళ్ళుంటాయి. సాధారణంగా వీటి ఆహారం పురుగులే. అవకాశం వస్తే చిన్న పశులను చంపి తింటుంది. దీనివల్ల మనకు ప్రమాదం లేదు కాని, తేనెటీగ కుట్టినంత బాధపెడుతుంది. ఇంత బలం ఉన్న కందిరీగకు సాధారణంగా బలి అయిపోతుంది. వాటికి మధ్య ఘోరమైన యుద్ధం సాగుతుంది. గెలిస్తే కందిరీగ దీనిని కుట్టి మూర్ఛపోనిచ్చి తన పిల్లలకు ఆహారంగా కానుకనిస్తుంది!

సాలీడులకు రెండు అప్రతిష్ఠ కల్గించే గుణాలున్నాయి. ఒకటి దాని విషతత్వం. వాటికి విషాన్నెక్కించే కోరలున్నా మానవుడికి ప్రమాదం చెయ్యలేవు. ఒకటి రెండు మాత్రం బాధ కల్గిస్తాయి— అదే కుట్టినప్పుడే. తమ భర్తలను హత్య చేసే గుణం ఆడ సాలీళ్ళకుందనేది రెండో ప్రతీతి. మగసాలీళ్లు ఆడవాటికన్నా చిన్నవే. కుటుంబ కలహాలకు బొత్తిగా ఆస్కారం లేదన్నమాట! ఒక్కోసారి ఆడది 2 అంగుళాలు మగది 1/10 అంగుళం ఉంటే, ఇక మగది ఏం చెయ్యగలదు? అయితే కొన్ని రకాలకు ఈ ఘోర గుణం కూడా లేకపోలేదు. దానివల్ల ఆ రకాలను 'విధవ సాలీళ్లు' అని అంటారు కూడా! భర్తను ఘోరంగా హత్య చెయ్యడమే కాకుండా, సుష్టుగా తినేస్తాయి కూడా!

—జమ్మి కోనేటిరావు

ఆయెషా

త్తమకు స్పృహరాగానే, ఆయెషా తన చెలికత్తెతో చెప్పింది. 'ఈమెను నా గదికి చేర్చి, అవసరమైన శుశ్రూషలు చేయండి'

'వెళ్లమ్మా...నీకేం భయం లేదు', అని తిలోత్తమకు హామీ యిచ్చింది.

జగత్‌సింగ్ ఏదో తనతో చెప్పాలని ఉన్నట్లు ఆయెషాకు తెలుసు. అందుకే తిలోత్తమతో, చెలికత్తెనుపంపి, తాను వెనకగా నిలిచిపోయింది...జగత్‌సింగ్ ప్రక్కనే నిలబడి ముచ్చటిస్తూ, అప్రయత్నంగా అతని చేతులు తన చేతుల్లోకి తీసుకున్నది. ఆప్యాయంగా, ప్రేమగా నిమిరింది. ఆమె కళ్ళు ఆర్ద్రాలైనాయి.

ఆయెషా అతని స్పర్శతో పరవశించి, కళ్ళు మూసుకున్నది. ఓ మధుర లోకాన్ని సృష్టించుకున్నది కళ్ళు తెరిచే సరికి, మూడవ వ్యక్తి వెనక ప్రత్యక్షమై 'మంచి పనే చేశావు ఆయెషా' అని వ్యంగ్యంగా అభినందిస్తున్నాడు.

'ఏమిటి నీ అభిప్రాయం' ఆమె తీవ్రంగా ప్రశ్నించింది. పరపురుషుని సమక్షంలో, తన చేత చిక్కిన ప్రియుని హస్తాలు వదిలి వేసింది.

'అర్ధరాత్రి, కారాగారం ప్రవేశించి, పరపురుషులతో ముచ్చటలాడ్డం, ఏ న్యాయశాస్త్రం అంగీకరిస్తుందో' పెద్దగా, కటువుగా అరిచాడు ఉస్మాన్.

'అది నీ కనవసరం ఉస్మాన్... నా విషయం నాకు తెలుసు' ఆమె ఛురికలాంటి విసురు విసిరింది.

'నేను అడుగుతున్నాను, నీ సమాధానం చెప్పు.'

'అయితే విను ఉస్మాన్. నేను రాజకుమార్‌ని తల మునకలుగా ప్రేమిస్తున్నాను. ఏమి జరగనీ, నా ప్రేమ చెరగదు, నా బొందిలో ప్రాణం ఉన్నంత కాలం ఈయననే ప్రేమిస్తుంటాను. వారితో ఏం మాట్లాడుతున్నానో చెప్పమంటావా? చెబుతాను విను. వారిని పారిపొమ్మని, సాయం చేస్తానని చెప్పాను, మంచి గుర్రాన్ని యిచ్చి, ద్వారం దాటిస్తానని చెప్పాను. కాని వారు అందుకు ఒప్పుకోవడం లేదు. నా ప్రాణాలకేమి ముప్పవస్తుందోనని, ఆయనలోని రాజపుత్రరక్తం ఆరాట

పడుతోంది. పైగా సిరికివాడుగా వారి పోషడం వారి కిష్టం లేదు'

ఉస్మాన్ నోరు అప్పళించాడు. ఆయెషా కన్నీరు తుడుచుకుంటూ చెప్పింది 'ఉస్మాన్, నిన్ను నొప్పించి ఉంటే నన్ను క్షమించు కానీ నేను తప్పు చేయలేదు. సమయం వచ్చి నప్పుడు నాన్నతో నా మనసు విప్పిచెబుతాను'

ఉస్మాన్ కొన్ని క్షణాలపాటు చెక్కేసిన శిలగా మారిపోయాడు. తర్వాత, నెమ్మదిగా బయటకు నడిచాడు.

భర్త ఉరికంబం ఎక్కినప్పుడే విమల పగబట్టింది ప్రతిన చేసింది ఎలాగైనా కల్యాణ్ ఖాన్‌పై పగ సాధించాలి కూతురుతో పారిపోవాలని చేసిన ప్రయత్నం విఫలమైంది. కాగా, కల్యాణ్ ఖాన్, దర్బార్‌లో నర్తకి అయింది. ఆదొక్కటే. గౌరవనీయమైన పదవి పగ సాధించడానికి, వలపన్నడానికి. పగలతో పగలు రగిలించడానికి మార్గం

ఓ నాడు, కల్యాణ్ ఖాన్, నిషాలో, తానీషాగా విమల నృత్యం తిలకిస్తున్నాడు ఖుషీగా.

ఆమె గుప్తంగా, ఛురి భద్రం చేసుకునే ఉన్నది. అదనుచూచి, కత్తి పదును చూపించింది అతని గుండెల్లో దిగనకత్తి, మరుక్షణంలో నేలనగుండెల్లో నూ దిగింది.

రక్తపు మడుగులో, మృత్యు కౌగిలిలో ఉన్న కల్యాణ్ ఖాన్ జగత్‌సింగ్‌ను రావించి, సంధి కోరాడు. జగత్‌సింగ్‌కు స్వార్థం లేదు. స్వాభిమానంతప్ప అక్బర్ సామ్రాజ్యాధికారానికి తలవంచితే చాలునని షరతు పెట్టాడు.. కల్యాణ్ ఖాన్ అంగీకార సూచకంగా తలఊపి, వేలితో అటు దిక్కుగా చూపించాడు అక్కడ ఓ గ్రహంలో కల్యాణ్ ఖాన్ కుమారుడే సింహాసనంపైన ఉన్నాడు అతనికి అది దక్కితే చాలునని కన్న తండ్రి కన్నుమూసేవేళ పొందిన ఆవేదన. అతని ఆవేదన నిర్వేదంగా అంగీకరించాడు, మానిని హృదయ చోరుడు జగత్‌సింగ్.

జగత్‌ను వెంటనే విడుదల చేసి, సకల మర్యాదలతో సాగనంపమని, ఉత్తర్వు చేశాడు కల్యాణ్ ఖాన్. జగత్, సంతృప్తితో లేచాడు. కల్యాణ్ ఖాన్, పోతున్న ప్రాణాల్ని క్షణకాలం నిలబెట్టి చివరిమాటగా చెప్పాడు 'ఆమె అనాథ.. కాపాడు'

జగత్‌సింగ్ ఎదురుగా ఆయెషా ప్రత్యక్షమైంది. మదిలో తిలోత్తమ మెదిలింది. ●

ఆంధ్రసచిత్రవారపత్రిక

1968 దీపావళి కథల పోటీ

ఎప్పటివలెనే ఈ సంవత్సరం కూడా 'ఆంధ్రసచిత్ర వారపత్రిక దీపావళి కథల పోటీ' నిర్వహించపోతున్నదని తెలపటానికి సంతోషిస్తున్నాము రచయితలందరూ ఎప్పటి వలెనే మాతో సహకరించి ఈ పోటీని జయప్రదం చేస్తారని ఆశిస్తున్నాము.

మొదటి బహుమతి రు. 2100
రెండవ బహుమతి రు. 1500
మూడవ బహుమతి రు. 500

నిబంధనలు

1. కథలు స్వంత రచనలై ఉండాలి. ప్రతి కథతోనూ రచయిత అది తన స్వంత రచనే నని, దేనికీ అనువాదంకానీ, అనుసరణకానీ కాదని హామీరాసి పంపాలి ఈ హామీలు వేరే కాగితం మీద కాకుండా కథ వ్రాతప్రతి మీదనే రాసి ఉండాలి.

2 కథలు తెలుగువారి జీవితానికి సంబంధించి ఉండాలి

3. వ్రాతప్రతి మీద "దీపావళి కథలపోటీకి" అని స్పష్టంగా రాయాలి. కాగితానికి ఒక వైపు మాత్రమే సిరాతో రాయాలి. రచయితపేరు, పూర్తి చిరునామా కూడా వ్రాతప్రతి మీద స్పష్టంగా రాయాలి. రచనలు 12 అరఠావు (ఎక్సర్సయిజు నోట్‌బుక్ పేజీకి రెండు రెట్లు) పేజీలకు మించరాదు

4 కవరుమీద "దీపావళి కథల పోటీకి" అని స్పష్టంగా రాయాలి పోటీకి రచనలు 'సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, 7, తంబుచెట్టిస్ట్రీట్, మద్రాసు—1'కి పంపాలి.

5. పోటీ గడువు తేదీ 14—8—68 ఆ తర్వాత మా కార్యాలయానికి చేరిన కథలని మామూలుగా ప్రచురణకి పరిశీలిస్తాము.

6. పోటీలో బహుమతి పొందిన కథలని 'దీపావళి ప్రత్యేక సంచికగా' వెలువడే 25—10—68 తేదీ కల ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రచురిస్తాము

7. పోటీ తుది నిర్ణయం ఆంధ్రసచిత్ర వారపత్రిక సంపాదకుడిదే ఈ విషయమై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలూ జరపడానికి వీలులేదు.

8 వ్రాతప్రతులని ఎటువంటి సందర్భంలోనూ తిప్పి పంపడానికి సాధ్యం కాదు. పోటీలో పాల్గొనేవారు తమ రచనలతో తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామాకల కవర్లు పంప నవసరం లేదు.

9 పోటీలో బహుమతి పొందక మామూలుగా ప్రచురణకి స్వీకరించిన కథల రచయితలకి ఆ విషయం ప్రచురించే ముందు తెలుపుతాము.

ధర్మపథం



లక్ష్మీకటాక్షం

— బులుసు వేంకటరమణయ్య

ధనవంతులు తమ ఐశ్వర్యానికి తగినట్లుగా దేవాలయాల్లో భోగ రాగాలకు ఏర్పాట్లుచేసి కార్లలో వచ్చి విశేష పూజలు జరిపిస్తారు భగవదనుగ్రహాన్ని సంపాదించాలని. అంతే కాకుండా తమ యిళ్ళల్లో వెండి, బంగారాల దేవతా విగ్రహాలను వుంచి, యింకా తమ ఐశ్వర్యం వృద్ధి పొందాలని ఆ విగ్రహాలకు మొక్కరిల్లి ప్రార్థనలు చేస్తారు...దరిద్రులు ఇలా ఏమీ చెయ్యలేరు. చివరకు పుష్పాలను అర్పించడానికయినా శక్తి లేకపోతే హస్తాలు ముకుళించి నిర్మల మనస్సుతో నమస్కారం మాత్రం చేస్తారు. ఈ ఉభయుల పూజా విధానాలలోనూ తారతమ్యం కనిపించవచ్చు మనకి. దేవుడికి మాత్రం భేదం లేదు. పరిశుద్ధమైన భక్తి, నిర్మలమైన మనస్సు మాత్రమే ఆయన వాత్సల్యాన్ని చూరగొంటాయి.


ఒక ధనిక వర్తకుడి భవనంలో తరతరాల నుంచి వస్తూ వున్న లక్ష్మీదేవి రజత విగ్రహం వుంది. ఆతని పూర్వీకులు ఎంతో భక్తితో ఆ విగ్రహాన్ని పూజిస్తూ, లక్ష్మీదేవి అనుగ్రహం వల్ల ఐశ్వర్యాన్ని వృద్ధిపరుచుకుంటూ వచ్చారు. ఆ ధనవంతుడు కూడా ఎంతో భక్తితో ఆ విగ్రహాన్ని పూజించేవాడు. వ్యాపారం వృద్ధికి వచ్చింది. అందువల్ల భక్తి కూడా పెరిగింది. లక్ష్మీదేవి వున్న పూజా గృహంలోనే చలువరాళ్ళతో చక్కని మండపం కట్టించి, అందులో ఆ విగ్రహాన్ని వుంచి ఘనంగా పూజలు చేసేవాడు. క్రమంగా అతనికి గర్వం పెరిగింది. తాను పూజించి నైవేద్యం పెడితే దేవి ఆరగిస్తుందనీ, లేకపోతే ఆమెకు పస్తే అనే భావం కలిగింది. దానితోపాటు ఆలోచనలు కుమార్గాన్ని పట్టాయి. అన్యాయంగా ఎక్కువ లాభాలు సంపాదించడానికీ, తన సంకల్పం నెరవేరేటందుకు అధికారులు కొందరికి లంచాలు యివ్వడానికీ బాగా అలవాటు పడ్డాడు. బంగారం వెండి ధరలు పెరిగిపోవడం వల్ల వేల తులాల బరువున్న దేవి రజత విగ్రహాన్ని కరిగించి సొమ్ము చేసుకుని, ఆ విగ్రహానికి బదులు శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనే దుర్బుద్ధి కూడా అతనికి కలిగింది


ఇలావుండగా, ఇతని అన్యాయార్జన సంగతీ, లంచాల సంగతీ రహస్య పరిశోధన శాఖకి తెలిసింది. ప్రభుత్వం తన మీద చర్య తీసుకుంటుందని అతడు పసికట్టాడు. ఆ వర్తకుడు దిగులు పడి భయంతో దేవి విగ్రహందగ్గరకు వచ్చి సాగిలబడి 'అమ్మా! నిన్నెంతో భక్తితో ఘనంగా పూజిస్తున్నాను. నీకు నాయందు దయ లేదు. అధికారులువచ్చి యిల్లు సోదా చేస్తే నాకు శిక్ష పడక తప్పదు. వాళ్ళు ఇక వస్తారని కూడా తెలిసింది. నా పూజకు తృప్తిపడి నువ్వు నాకు ఏ కష్టమూ రాకుండా తొలగిస్తావని అనుకున్నాను' అని వాపోయాడు.

అప్పుడా విగ్రహం 'ఛీ దుర్మార్గుడా! అన్యాయంగా ధనం సంపాదిస్తూ, జనాన్ని కష్టాలు పాలుచేస్తూవున్న నీకు నేను సాయపడాలా? చిక్కులనుంచి తప్పించాలా? చాలు చాలు. నీ మనస్సులో ఏలాటి కుళ్ళు అభిప్రాయాలున్నాయో నాకు తెలుసు. ఇక యిలాటి దుర్మార్గుని యింట్లో ఒక్క క్షణం కూడా వుండను, ఇదిగో, వెళ్ళిపోతున్నాను' అంటూ చరచరా నాలుగు అడుగులు నడిచి అంతలోనే మాయమైపోయింది.

వర్తకుడు నిర్ఘాంత పోయాడు. కళ్ళు చీకట్లు కమ్మాయి. తెలివి తప్పి పడిపోయాడు.

అతడు తెలివి వచ్చి కళ్ళుతెరిచి చూచేటప్పటికి ఎదుట రహస్య పరిశోధనశాఖ అధికారులు ప్రత్యక్షమయాడు. ●





జరిగిన కథ

చాలా కష్టాల్లో వుండగా శ్రీనివాస్ తల్లి చనిపోయింది. తండ్రి గోపాలం వ్యసనాల పుట్ట. అతను రెండో వివాహం చేసుకుంటాడు. అంత వయసువాడితో తనకి వివాహం జరిగినందుకు సుభద్ర లోలోన కుమిలిపోతుంది. గోపాలం చనిపోతాడు. సరస్వతి మనోవ్యాధితో కృశించి చనిపోతుంది. పద్మావతి రామదాసును రెండో వివాహం చేసుకుంటుంది ఆమెకు ప్రభాకర్ అనే కొడుకు, రాజేశ్వరి అనే కూతురూ వున్నారు. ప్రభాకరం తన కథని శ్రీనివాస్‌కి చెప్తాడు జగదీశ్ సుభద్రని మోసం చేసి వెళ్ళిపోతాడు శ్రీనివాస్‌కి నగరం 'లో' ఉద్యోగం దొరుకుతుంది అతన్ని వెతుక్కుంటూ వస్తుంది రాజేశ్వరి. సుభద్రని చూసి మాధవరావు జాలిపడతాడు. ఆమెకి ఆడపిల్ల కల్గుతుంది.

9

సాయంత్రం స్కూలునుంచి రాగానే శ్రీనివాస్‌కి రోజులా ఎదురు రాలేదు రాజేశ్వరి. యిల్లంతా బావురు మన్నట్లని పించింది. 'రాజేశ్వరీ! కేకవేస్తూ గడప యెక్కాడు. ముందుగదిలో సీటుగాముస్తాబై శ్రీనివాస్‌కోసమే యెదురు చూస్తోంది! 'వీధిలోకి రాకపోతే చెప్పకుండా వెళ్ళిపో యారనుకున్నాను బ్రతికించారు' శ్రీనివాస్ అన్నాడు.

రాజేశ్వరి నవ్వింది: 'మహా నేను లేక పోతే యేమిటో అయిపోయినట్లు మాట్లాడకండి.'

'పోన్లెండి మీకు మంచి కబురు తెచ్చాను. ఏం పెడతారు?'

'యింకా యేవీపోలేదు మీవిూద పెట్టేందుకు'

'నిజం రాజేశ్వరీ 'వెల్ఫేర్ సెంటర్'లో మీకు టీచర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ తెచ్చాను'

రాజేశ్వరి చటుక్కున అందుకుంది కాగితాలు. 'యిప్పటికి రెండుమూడు నెలలుగా యింటిపట్టునే వున్నాను. సూర్యుడు ఎటువైపు వుదయిస్తున్నాడో ఎటువైపు అస్తమిస్తున్నాడో తెలిసి చావదు. అలా ఎక్కడైనా వెడదాం. మీరు రావాలి' పంతంగా అంది.

నిట్టూర్చాడు శ్రీనివాస్: 'మీరు మరేవీ అనుకోవద్దు రాజేశ్వరీ. లోకం అంతమంచిది కాదు. దున్నపోతు యీనిందంటే దూడను కట్టేయమంటుంది. అరె! దున్నపోతు యేవిటి? ఈనడం యేవిటి అనైనా ప్రశ్నించదు. మనం నలుగురి కళ్ళల్లో పడడం అంత మంచిదికాదు'

'శ్రీనివాస్'

'ఆశ్చర్యానికి యేవీ లేదు యిందులో. మరోలాఅనుకోవద్దు. మీకు ఈ ఏర్పాట్లు కావాలనే చేశాను. వెల్ఫేర్ సెంటర్‌లో వుద్యోగం. హాస్టల్లో వుండేందుకు వసతి యేర్పాట్లు!'

రాజేశ్వరి గుమ్మంలోనే కూలబడి పోయింది.

'నన్ను వదిలించుకోవాలను కుంటున్నారా'

రాజేశ్వరి నోట్లోంచి మాటలు రావడంలేదు.

'స్త్రీ' పురుషులు ఒకే గదిలో ఎంత పవిత్రంగా వున్నా ప్రపంచం హర్షించదు. నేను బస్సులో వెడుతూంటే రకరకాల వ్యాఖ్యానాలు, వినిపిస్తూనే వున్నాయి. నేను పట్టించుకోలేదు. ఒకమాట అడుగుతాను యేవీ: అనుకోరుకద'

'ఊహుఁ'

'ఆరోజు అంటే . నీళ్ళకోసం మట్టాడ రోడ్డుమీదకు వెళ్ళారు చూడండి అప్పుడు నీళ్ళు తీసుకురానని చేపిపెట్టి ఏడ్చారు దేనికి?'

'అపును ఆరోజు అందరూ నన్ను నాయెదుటే దుమ్మెత్తి పోశారు. మీకూ, నాకూ యేదో సంబంధం వుందట. అదే నీటో నాకే అంతు తెలీనిది వాళ్ళు ఎన్ని మాటలు అన్నారనీ, యేఆశా లేనిదే నన్ను యింట్లో అట్టిపెట్టుకుని మేపరని' రాజేశ్వరికి దుఃఖం ముంచుకు వచ్చింది.

'విూతో యిన్నాళ్ళూ చెప్పలేదు. యింక చెప్పక పోవడం కూడా అంత సబబు కాదు. అవధాని బాబాయి పినతల్లి మనుమరాలు యిక్కడే పనిచేస్తోందిట. యిష్టం అంటే చూసుకోమన్నారు. వాళ్ళకా పట్టింపు లేదుట— మొన్న ఆదివారం మాట్నీకి వెళ్ళలేదు. ఆపిల్లని చూశాను. సంసారపక్షంగా బాగానే వుంది. ఆలోచించి చెబుతానన్నాను. మీరు వున్నారు కనుక యిన్నాళ్ళూ నాకు తిండివిషయం చూసిపెట్టారు.

మగవాడికి రోజా వండుకోవాలనే పని అన్ని శిక్షల్లో కఠిన శిక్షగా అనిపిస్తుంది నామటుకునాకు. నా బాగోగులు చూసేందుకు స్త్రీ చాలా అవసరం అనిపిస్తోంది. యెప్పటికైనా యీ బంధం నుంచి తప్పించుకోలేం కద. ఆ పిల్ల చాలా పేదయింటి నుంచి వచ్చింది. ముందు నేను పెళ్ళి చేసుకుంటే కొంతలో కొంత యిద్దరం సంఘం బాధలోంచి తప్పుకోవచ్చును. మీరు యేమంటారు?'

తలెత్తిఅంది: 'మీరు యేవీ అనుకోకపోతే నన్ను వెల్ఫేర్ సెంటర్‌లోనే వుంచేయండి. త్వరగా ఆ పనిచేసి పుణ్యం కట్టుకోండి. అన్నయ్యకు లాగానే నన్నూ కొన్నాళ్ళు మీరు దయగా ఆదరించి ఆశ్రయం యిచ్చారు. కృతజ్ఞురాలిని. రేపే యేర్పాట్లు చేయండి!

'అదేవిటి రాజేశ్వరీ అంత తొందరేం. మాటవరసకి చెప్పవలసిన టైము వచ్చిందని అన్నానే గానీ మీరు నాకు బరువు అని నేను అనలేదే. ఫస్టుదాకా ఆగండి'

నవ్వింది రాజేశ్వరి!' ఫస్టేం ఖర్మ యెన్నాళ్ళైనా వుండేదాన్ని. యిన్నాళ్ళూ యే ఆశా లేకుండా మీరు అట్టే పెట్టుకున్నారంటే మీ ఆవిడ నమ్మదు. అనవసరంగా మీ జీవితాన్ని దేనికి పాడుచేయడం?'

'అంటే మీ వుద్దేశ్యం?'

రాజేశ్వరి లేచి నిలుచుని మెల్లగా అతని దగ్గరకి వచ్చి కూర్చుంది:

'మీకూ మాకూ కుల పట్టింపులు వుంటాయి కాదనను మావాళ్ళు మతం పుచ్చుకున్న క్రైస్తవులు. అలాగని నేను మిమ్మల్ని మామతంలో చేరమనీ, నాయిష్టప్రకారంగా నడవాలనీ నేను అనుకోను. కాలం మారిపోయింది. పూర్వంలా కులం అనీ గోత్రం అనీ యెవరూ అంతగా లెక్కచేయడంలేదు. మరి మీకు యీ విషయాలమీదవున్న అభిప్రాయం యేవిటో నాకు తెలియదు'

'అంటే నాకు యేవీ అర్థం కావడం లేదు,' శ్రీనివాస్ వింతగా చూస్తున్నాడు. 'రాజేశ్వరి యిన్నాళ్ళూ యిటువంటి ప్రస్తావనే తీసుకు రాలేదు 'స్త్రీ వొకోసారి మనసులో బడబాగ్నులు దాచుకుని పైకి ఎలా నటిస్తుంది?' అతను అనుకున్నాడు మనసులోనే.

— 'నేనింత ధైర్యం చేస్తున్నానని, స్త్రీ జాతికే తలవొంపులు తీసుకువస్తున్నాననీ అనుకోకండి. మీరు అనుకున్నా ఆ విషయం నాకు తెలియదు. వున్నమాట అడగడం నాకు అలవాటు. నేను స్త్రీని. మీకు స్త్రీ అవసరం యెంత వుంటుందో పురుషుడి అవసరం అతనికన్నా యెక్కువగా ఆడదానికి కూడా మాకు వుంటుంది. నేనుకూడా పెళ్ళి చేసుకోవాలనుకున్నాను.' శ్రీనివాస్ మొహంలో సంతోషం తాండవం చేసింది. 'ప్రభాకరం కూడా సంతోషించేవాడు' అనుకున్నాడు. 'చాలా మంచి కబురు చెప్పారు.



మొగలి పొదలు

రాజేశ్వరీ, యివాళ యెంత మంచిరోజు. ఎవరు అతను. నేను వెళ్ళి యివాళే కనుక్కుంటాను, వున్నంతలో నలుగురిని పిలిచి ఘనంగానే చేద్దాం. నాకు అసలు కుల పట్టింపులు లేనేలేవు. చెప్పండి అతని కులం గోత్రం. మాట వరసకే అడుగుతున్నాను సుమా!'

'హాఁ, యెంత అమాయకంగా మాట్లాడుతున్నారు. ఒక యింట్లో యిన్నాళ్ళు వుండి అర్థం చేసుకోలేక పోయారు నన్ను. యీ గది గోడలు దాటి నేను యెక్కడికి వెళుతున్నాను? యెవరిని చూస్తున్నాను. నాకు తెలిసిన మనిషి మీరు యెందుకు కాకూడదు. ఈ ఆలోచన మీకు రానేలేదా? నేను...యింత మనిషిని యింట్లో మీ కళ్ళ యెదుట తిరుగుతూంటే...పై పై సంబంధాలు తిరగేస్తున్నారా? మీకు నేను తగనా? నన్ను చేసుకుంటే యేం?'

'రాజే...శ్వరీ' అతను ఆశ్చర్యంతో, సంతోషంతో మాట్లాడలేక పోతున్నాడు. 'మీకు... మీకు యింత మంచి వుద్దేశ్యం వుందా రాజేశ్వరీ. నేను ఆ ప్రస్తావన తీసుకువద్దాం అనుకున్నాను చాలాసార్లు. కానీ భయపడ్డాను. నాకు తోచిన సహాయం నేను చేశానని మిమ్మల్ని నిర్బంధంలో వుంచడం యిష్టం లేకపోయింది. నేను మనిషిని రాజేశ్వరీ. కోరికలూ, ఆశలూ రెండుపాళ్ళు యెక్కువగానే వున్నాయి నాలో. జీవితంలో మరీ అన్యాయంగా బ్రతుకుతున్నాను నేను. బంగారం ముట్టుకోబోతూంటే అది నల్లగా మసిబొగ్గు అయిపోయి మిగులుతోంది నా చేతిలో...

'మిమ్మల్ని చేసుకోవడం నావంటివాడికి అదృష్టమే మరి. చాలా థాంక్స్...మెనీ... మెనీ థాంక్స్. నేను సిద్ధమే,' శ్రీనివాస్ యింక ఆలోచించలేదు. మనసువిప్పి నిస్సంకోచంగా తన యెదుట నిలుచున్న రాజేశ్వరిని చూస్తూంటే అతని కన్నుల్లో సముద్ర కదిలింది. అతని అంతరంగం జాలితో నిండిపోయింది. బహుశా ఆవిడ కూడా యిలాగే అడిగిందేమో...?

యిన్నాళ్ళూ స్తబ్ధంగావున్న అతని రక్తనాళాలు కట్టలు తెంచుకుని విజృంభించాయి. అతని శరీరంలోంచి వెచ్చని రక్తం ప్రవహిస్తూ మెల్లగా అతని భుజంతట్టి లేపుతోంది. రాజేశ్వరి యెదురుగా అతని వక్షస్థలానికి దగ్గరగా నిలుచుని అతని భుజంమీద చేయి వేసింది. రెండు చేతుల్తో ఆవిడ నడుంచుట్టూ చేతులు పోనిచ్చి గుండెలకు అదుముకుని నుదుటిమీద చెంపలమీద తనివితీర ముద్దు పెట్టుకున్నాడు.

రాజేశ్వరి తమాయించుకుని అంది! 'నేను మీకు యెంత ఋణపడి వున్నాను? మీరు యెంత మంచివారు?!' రాజేశ్వరిని మాట్లాడనివ్వలేదు అతను. అపార అనురాగం కొన్నాళ్ళుగా గుండెల్లో మంచు గడ్డలా పేరుకుపోతే దాన్ని నెమ్మదిగా యీ క్షణం కరిగించేసింది. ప్రవాహంలా తయారైన ఆ ప్రేమలో రాజేశ్వరికి వూపిరి సలపడంలేదు కళ్ళు మూసుకుని అతనికి లోలోపలే కృతజ్ఞతలు తెలుపుకుంటోంది.

* * *

నెల తిరక్కుండానే శ్రీనివాస్‌కి హైదరాబాదు ట్రాన్స్‌ఫర్ అయింది. సామానంతా సర్దేసి ముందుగా చూసుకు వచ్చిన అందమైన చిన్న డాబా యింట్లో మకాం మార్చాడు.

ఆరుబయట వెన్నెల్లో తెల్లని దుప్పటి పరిచిన మంచంమీద శ్రీనివాస్ జరుగుతున్న సుడియల్ని నెమరు వేసుకుంటున్నాడు. పైన వెన్నెల్లా అతని జీవితం పంగు వెన్నెల పిండారబోసినట్లుగా వుంది. చక్కని చదువుకున్న, ప్రేమించిన భార్య, తనని అనుక్షణం అంటిపెట్టుకున్న సహచరణి ... మనిషికి యింతకన్న యింకేం కావాలి?

'యేమండీ' రాజేశ్వరి అతని పక్కనే చోటుచేసుకుని పడుకుని అతని వీపుమీద చేయివేసి తన వైపుకి తిప్పుకుని నెమ్మదిగా అంది. 'మరి మనం...'

'ఆపేశావేం? మరి మనం...'

'మనం సంఘంలో పెళ్ళి చేసుకోవాలి'

శ్రీనివాస్ మొహం ఆశ్చర్యంతో నిండిపోయింది. అంటే మనది పెళ్ళి కాలేదనా?'

'అదికాదు శ్రీనివాస్. మనం సంఘంలో బ్రతికేవాళ్ళం. తప్పకుండా యీ ముద్ర బహిరంగంగా వేసుకోవాలి. చెప్పండి మీకూ నాకూ యెవరూ లేరు. శాస్త్రోక్తంగా పెళ్ళి చేసుకుంటే ఆ తరువాత...

'ఆ తరువాత' శ్రీనివాస్ కోపంగా రెట్టించాడు.

'మీరైనా, నేనైనా పేచీ పెట్టుకుంటే కోర్టు రక్షణ యిస్తుంది.'

'పోనీ అని వూరుకున్నాను, యిదే మరొకళ్ళైతే'

'వూఁ మరొకళ్ళైతే'

'చంపేవాడిని'

'అబ్బ ధైర్యవంతులే. తమాషాకి అంటే కోపం దేనికి?'

'చూడు రాజేశ్వరీ మనం కొత్తగా యీ వూరు వచ్చాం. కొంత దంపతులమాదిరిగానే. నువ్వు యిలా అశుభం మాటలు అంటూంటే ఏమీఁ బావుండదు నాకు.'

'సారీ...ఐయామ్ వెరీసారీ. మిమ్మల్నిక నొప్పించను'

'థాంక్స్ సోమెనీ థాంక్స్' శ్రీనివాస్ అమాంతంగా వుప్పొంగిపోయాడు.

రాజేశ్వరి నవ్వుతూనో, తమాషాకో యేదో విధంగా అంది నిజం యెంతైనావుంది అందులో. నలుగురికోసం పెళ్లి చేసుకోవడంలో తప్పేమీఁలేదు. రాజేశ్వరిని అనవసరంగా అపార్థం చేసుకున్నాడు. అతను గుండెల్లోకి తీసుకుని అన్నాడు.

'నేను యింట్లోంచి బయటకి వెళ్లింది మొదలురోజూ రిసెర్చి చేస్తూనే వున్నాను'

'దేనికేవిఁటి ?'

'మనం యేవిధంగా పెళ్లిచేసుకుంటే మంచిదో అని'

'పోనివ్వండి' రాజేశ్వరికి శ్రీనివాస్‌ని నొప్పించడం యిష్టంలేదు.

'మీకూ నాకూ యిష్టం అయింది. యింకెవరూ అడ్డుపెట్టరు. మనం యిలాగే హాయిగా వుందాం'

'అదికాదు. నువ్వు అన్నదాంట్లో నిజం గ్రహించాను. ఆర్యసమాజంలో మనం మతం పుచ్చుకుని చేసుకోవచ్చును. నీకు అభ్యంతరం యేమీఁ లేదుకద'

రాజేశ్వరి అతని కౌగిలిలోకి ప్రవేశ్శ్ పోనిచ్చి నెమ్మదిగా అంది: 'నాకు మతం మీద అంత నమ్మకంలేదు, నా మతంలో మీరు చేరాలనే పట్టుదల లంతకంటే లేదు. మీ యిష్టమే నా యిష్టం. అలాగే కానివ్వండి'

రాజేశ్వరీ శ్రీనివాస్‌లమధ్య యేనాడూ పొరపొచ్చాలు లేవు. తమాషాకి కూడా పోట్లాటగానీ వాదనగానీ పెంచుకోరు. నిమిషాలమీద ఆలోచనల్ని సెకండ్లలో పెడతారు. ఆర్యసమాజంలో పదిమంది పెద్దల మధ్య వున్నంతలో ఘనంగానే చేసుకున్నారు పెళ్లి. గవర్నమెంటు వుద్యోగం, ప్రేమించి పెళ్లిచేసుకున్నభార్య కొరత లేని సంపాదనతో జీవితం మల్లెపూల పాన్పులా వుంది. యిన్నేళ్లకి శ్రీనివాస్ సుఖంగా బ్రతుకుతున్నాడు.

రాజేశ్వరి మంచానికి దగ్గరగా వచ్చింది. తెల్లని గ్లాస్కో చీర అదేరకం జాకెట్టు, పొడుగ్గా మిసమిసలాడే తలకట్టుతో కదిలి వస్తూంటే మంచి పరిమళంతో అతని తనువు పులకరించింది.

'అమ్మ దొంగా యింత అందం యెక్కడ దాచుకున్నావు యిన్నాళ్ళూ. నా కోసం యెంత శ్రమ పడ్డావోయ్'

'యేమీఁలేదు. మీరు అద్దంలో చూసుకోండి. ఆ నొక్కుల జుట్టు, ఆ బుగ్గన ఆడపిల్లమాదిరి సొట్టలూ, ఆ సన్న ముక్కూ, ఛ! భగవంతుడు పక్షపాతి. ఆడదానికి వుండాల్సిన లందం మీకు యిచ్చాడు అనవసరంగా'

'సరిసరి. యీ మాటల్తో అమూల్యం అయిన కాలాన్ని వృథా చేస్తావు కాబోలు అదేం కుదరదు.'

'వూఁ' రాజేశ్వరి కొంటెగా అతన్ని యేడిపిస్తుంది. అతను కంఠం విప్పి సన్నగా ఆలాపన చేయడం ప్రారంభించగానే అతని గుండెల్లోకి జారిపోయి మైమరచి నిద్రపోతుంది. శ్రీనివాస్ అంటూంటాడు: 'నీ దగ్గర దాచాను మొదట్లో. పిచ్చి యెక్కువుందో యేం యిబ్బంది పడుతోందో ?' అతని ఆలోచనలు సాగనివ్వదు.

'నిజమే యేం చేస్తాం? నాకు నమ్మకం వుంది యెప్పుడో వొరోజున మీకు కనిపిస్తారు. బహుశా మనలాగే వాళ్ళూ హాయిగా వుంటున్నారేమో'

'అలా అయితే నాకు కావలసింది యేముంది రాజేశ్వరీ. నా నిరీక్షణ ఫలిస్తుంది. కానీ నాకు నమ్మకంలేదు'


'అయితే ఆవిడ యేమైపోయారంటారు ?'

'ఆ జగదీశ్ మోసం చేసి పారిపోతాడు. అబ్బ పిచ్చి నరకం అనుభవిస్తూ అందరి పక్షంలో ఆశ్రయం కోరి వూడిగం చేస్తూంటుందేమో'

'మీరు యెన్నాళ్ళు ఆలోచించినా లాభం వుండదు. కాలం కలిసి రావాలి. ఆవిడ మీకు కనిపిస్తారు. తప్పకుండా మనింటికి తీసుకురండి.'

'ఆవిడకు జగదీశ్‌వల్ల పిల్లో పిల్లాడో పుట్టేవుంటాడు రాజేశ్వరీ.'

'పిచ్చి మనదైనప్పుడు పిల్ల జగదీశ్‌ది కాలేదు. మనతోటే వుంటుంది. అశుభం శుభం తెలియని పిల్లమీదా మన ప్రయోగం?



పిచ్చికమీద వజ్రాయుధంలా'

'యేవిటో ?' శ్రీనివాస్ నిట్టూర్చుస్తూంటే అతని కంఠం పిదుకుపోతోంది. రాజేశ్వరి కబుర్లతో అతను రెప్పలు వాల్చాడు,

* * *

వారంరోజులు గడిచిపోయాయి. సుభద్ర చేతికి డిస్చార్జ కాగితాలు యిచ్చారు. యే వొక్కరూ కనికరం చూపించలేదు. కొంచెం దయగా ఆదరించి యింటికి రమ్మని అడ్రసు యిచ్చిన రాజారావు ఆ రాత్రికి రాత్రే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ చేతిలో పడగానే చెప్పేందుకైనా అవకాశం లేకుండా వెళ్లిపోయాడు విశాఖపట్నం.

'పద యింటికి ఓడకూసుని యేం చేస్తావు', సుభద్ర వినిపించుకోలేదు.'

'యేయ్ నిన్నే అంటున్నది. యినిపిస్తోందా ?' తలెత్తి చూసేలోగా అందుకున్నాడు పిల్లని ఫకీరు. గళ్లలుంగీ, గళ్ల బనీను, చెంపలవరకూ జుట్టూ సినిమాల్లో రౌడీలా సుభద్ర కంటికి కనిపిస్తూంటే గజ గజ లాడిపోయింది.

'పిల్లని యిటివ్వు' సుభద్ర అంది.

'యింటికి పద యిస్తాను'

'నేనెందుకు రావాలి?'

'నిన్ను కొన్నాను కనుకే'

నిలువునా నీరైపోయింది: 'నేను రాను. నువ్వు నాకు తెలీదు. పిల్లనిచ్చి వెళ్లు. పోలీసులకు చెబుతాను లేకపోతే'

'వాహ్ ... యిలాంటి బెదిరింపులకేం లొంగే ఘటంకాదు నా పేరు చెప్పిచూడు, పోలీసులు నీ కే పాటి సాయం చేస్తారో? ఫకీరు పోలీసుల యెదురు రొమ్ముల్లో నిద్రపోతుంటాడు'

సుభద్ర గుండె ఆగిపోలేదు గజం దూరంలో నలుగురైదుగురు డాక్టర్లు నిలబడి మాట్లాడుకుంటున్నారు. విమానాల్లా రెక్కలు చాచుకున్న కార్లకి అనువుకాని రాజకీయాల్లో మునిగి తేలుతున్నారు. సుభద్ర పరుగునవెళ్లి అంది. 'నేను దారి తప్పాను. వీడెవడో నన్ను బలవంతంగా తనింటికి రమ్మంటున్నాడు. నన్ను రక్షించండి' యే ఒక్కరూ వినిపించుకోలేదు.

'డాక్టర్ ...నేను...నేను'

యిటువైపు తిరిగి అన్నాడు అందులో ఒకతను. 'యేవిటమ్మా' అని.

'నన్ను వాడు రమ్మంటున్నాడు. నాకు తెలియదు అతను యెవరో, నా పాపను కూడా బలవంతంగా లాక్కుపోతున్నాడు. మీరు చెప్పండి!' సుభద్ర యేడుస్తూంటే అన్నాడు అతను మెల్లగా: 'నిన్ను అసలు ఈ హాస్పటల్లో చేర్పించింది యెవరమ్మా?'

సుభద్ర మాట్లాడలేదు. ఆవిడ కన్నుల్లో నీళ్లు జలజలా రాలుతున్నాయి వొకటొకటిగా.

'నిన్ను చేర్పించింది ఎవరూ ?' అతను మళ్లీ మళ్లీ అడిగాడు.

'మా అన్నయ్య'

'అతను యేడీ'

'ఆనాటి రాత్రే వెళ్లిపోయాడు'

'ఎక్కడికి ?'

'తెలీదు'

'మరి నీభర్త ?' డాక్టరు ప్రశ్న పూర్తి కాలేదు.

'నన్నడగండి నేను సెప్తాను' డాక్టర్‌కీ సుభద్రకీ మధ్యన నిలువెత్తు విగ్రహం నిలబడిపోయింది.

'యిది నా పెళ్లాం డాక్టరు బాబూ. ఆడి యెవడెంటో యెలిపోయింది. దీన్ని కంది. యిప్పుడు యింటికి రమ్మంటూంటే యిట్టా మొండికేత్తుందాది'

డాక్టర్ పరీక్షగా చూశాడు సుభద్రని. తలదించుకుని కుళ్లి కుళ్లి యేడుస్తోంది.

'డాక్టర్...' వెక్కిళ్ల మధ్య అంటూంటే సుభద్రని ఆప్యాయంగా చూస్తూ అన్నాడు. 'చూడమ్మా కట్టుకున్నవాడు భర్తకాకుండా పోడు. ఒకసారి తప్పటడుగు వేస్తే భగవంతుడైనా రక్షించడు. నేనేం చేయగలను చెప్పు'

'నేను పరువున్న యింట్లో పుట్టాను డాక్టర్. నా ఖర్మకాలి నన్ను అతను అన్యాయం చేశాడు'

ఈసారి చుట్టూ వున్న డాక్టర్లు కొంచెం ముందుకు వెళ్లారు.

అంతవరకూ మాట్లాడిన అతను దగ్గరలోనే నిలబడ్డాడు. స్వరం తగ్గించి అన్నాడు: 'నాయింట్లో నిన్ను వుంచుకునేందుకు అభ్యంతరం యేవీ లేదు. అందం యవ్వనం అన్నీ నీలో రంగరించి పోశాడు. అది పుట్టింటికి వెళ్లింది. కొన్నాళ్లు వుందువుగాని'

'డాక్టర్', సుభద్ర ఆశ్చర్యంలో వుండిపోయింది. భూమి, ఆకాశం యేకం అయిపోయి గుండ్రంగా తిరిగిపోతున్నాయి ఆవిడ మెదడులో. ఎటువంటి సాలెగూడు ఈ ప్రపంచం. అందిన పురుగుని గప్‌చిప్‌గా తినేసి దర్జాని వొలకబోస్తూ యేమీ యెరుగనట్లు యెందుకుంటుంది? కడుపుకు తిండిలేదని ప్రలోభంలోపడి వచ్చేస్తే చివరికి తనకి మిగిలింది యేవిటి? డాక్టరు యింత చదువు, సంస్కారం, యెంతో ఆదర్శం వున్న యిటువంటి పెద్ద మనుషులు సంఘంలో యెంత ఘనంగా చలామణీ అవుతున్నారు. సంస్కారం లేని లంబా యెదుటి మనిషికీ, డాక్టర్‌కీ తేడా యేముంది ?.

'లక్షణంగా అతనితో వెళ్లు. అట్టే పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యక. మొగుణ్ని వదులుకోవాలనే ఆడదాన్ని క్షమించడానికి వీల్లేదు. రండి డాక్టర్ మనకి టైము అయిపోతోంది' సారాంశం తెలీని మరో డాక్టర్ సంజాయిషీ యిచ్చి వెడుతూంటే అచేతనంగా నిలబడిపోయింది సుభద్ర.

'నా మాటిను బుల్లే. కొబ్బరి పంట అంతా నీ సేతుల్లో పెడతాను. నిన్ను ఆడమ్మేసిన ట్కమ్మేత్తానుకోమాకు. నా దగ్గిరే అట్టిపెట్టుకుంటాను. యింటి కాడ అదుందనుకో. దాంతో నీకేటి పేసీ.'

'భగవంతుడా,' సుభద్ర అనుకుంది అడుగు ముందుకువేస్తూ.

తెగిన గాలిపటంలా గాలివాటుకికొట్టుకుపోతూ అందిన చిటారుకొమ్మలో కాస్సేపు దాక్కుంటూ మళ్లీ పెనుగాలి రాగానే కొద్ది కొద్దిగా చిరిగిపోతూ ప్రయాణం చేస్తోంది సుభద్ర బ్రతుకు. ఆశా, నిరాశా, పాపం పుణ్యం...యేవీ లేవు ఆ మనసులో. నిశ్చలంగా కదలికే లేకుండా వుండిపోయింది మొద్దుబారి సుభద్ర హృదయం. ఫకీరు మర్యాదగానే తీసుకు వెళ్లాడు.


* * *

'నందమామ రాయె, జాబిల్లి రాయె.' ఫకీరు మోటుకంఠం రాత్రికాగానే పలుకురాయిలా ఖణేల్ మంటుంది. లావుగా యెత్తుగా బలంగా బుర్రమీసాలతో కదులుతూంటే, భూమి కంపిస్తుందేమో అనిపించే ఆకారంతో నల్లగా జిడ్డోడుతూ బుర్రమీసాలతో వున్న ఫకీరును చూస్తే చిన్నారి మాధవి దడుసుకోదు. పైపెచ్చు ఆ మీసాల్లోకి బుల్లిబుల్లి వేళ్లు పోనిచ్చి తమాషాగా ఆడుకుంటుంది. ఆ పిల్ల అంటే కసాయిలాంటి ఫకీరుకి పంచ



NGB/19A/68 Tel

చంపేస్తాను...! జాగ్రత్త...!



కె. రామలక్ష్మి

ఓ చిన్న కుర్రాడు ఇంట్లోంచి పారిపోయాడు. రెండు రోజులయింతరువాత ఎంతో దూరంలో దొరికాడు. ఈ రెండు రోజులలోనూ తల్లితండ్రులు బెంగతో భయంతో సగం పిచ్చెత్తి పోయారు. అలా ఎందుకు పారిపోయాడో తెలుసా? వాడికో చిన్న కుక్కపిల్ల దొరికింది. దాన్ని వాళ్ల అమ్మ వెళ్లకొట్టి తీరాలంది. 'చిన్న ఇంటో కుక్క కూడా ఎక్కడ ... అస్తమానూ కాళ్లకి అడ్డుపడుతూ ఉంటుంది.. వెధవది' అంది. ఇంకో పూట ఆగి ప్రాణం విసిగి 'రెండు రోడ్ల అవతల పారేసి వస్తావా? లేదా?' అంటూ అరిచింది. నిజంగా అంత కోపం వచ్చిందో లేదో అమ్మకి, వాడికేం తెలుసు? వాడికి తెలిసిందల్లా ఒక్కటే — కుక్క పోవాలి. అందుకే దాన్ని తీసుకు తనూ బయలుదేరాడు!

పెద్దవాళ్లు చాలా ఖండితంగా ఉండకోట్లతారు. కాని మనం ఆ మాటలకి నిజంగా అంత అర్థం యిస్తున్నామో లేదో గ్రహించకల్గే శక్తి పిల్లల కెక్కడిది ? ఎంత కోపంగా అరిస్తే అంత కోపంగానూ ఉంది కాబోలు అనుకుంటారు. అబద్ధాలాట్టం తప్పని చెప్తాం కాబట్టి మనం ఆడినది నిజమేనని తలపోస్తారు. అందుకే మన మాటలకి ఇవ్వవలసిన విలువనిచ్చి దాని ఫలితాలకి గురి అవుతారు. జ్ఞాపకం తెచ్చుకోండి. ఎంతమంది చిన్నపిల్లలు 'బూచాడు వస్తాడు, గోనిలో కట్టుకు పోతాడు' అన్నది విని భయంతో ఒణికి పోయి ఉంటారు ? 'పోలీసుని పిలుస్తానుండు' అని భయపెడ్తాం. నిజానికి పిల్లవాడు పోలీసులంటే భయపడాలనా మన ఉద్దేశ్యం ? కానే కాదు. కాని ఏమవుతోంది ? పోలీసులని తప్పించుకు తిరగాలన్న బాల నేరగాణి మెల్లిగా తయారు చేయడానికి నాంది పల్కుతున్నాం మనం !

నా చిన్నతనంలో మా అందర్నీ అమ్మమ్మ కోప్పడేది— ఎన్నో అనేది. ఏదీ జ్ఞాపకం లేదుగాని 'ఎముకలు విరిచి పులుసులో పారేస్తాను' అంటే హడలి చచ్చేదాన్ని ! ఏమో ఎప్పుడో ఒకప్పుడలా చేస్తే ? అందులోనూ తిండి పోతు. కాని అమ్మమ్మ ఎప్పుడేనా నేనెంత భయపడి ఒణికి పోయానన్నది ఆలోచించిందనా, ఏం లేదు. ప్రాణం విసిగిన ప్రతి తల్లీ అంటుంది — నాన్నగారు రానీ వీపు చీరిం చేస్తాను! నిజానికి నాన్నగారసలు కొట్టనే కొట్టరేమో. ఆఫీసులో చాకిరీ చేసి వచ్చి ఇంట్లో తరిమి తరిమి పిల్లల్ని కొట్టడమే నేమిటి ఆయన పని? కాని పసి వాడికేం తెలుసు నాన్నగారంటే ఓ పెద్ద పులిగానో బ్రహ్మరాక్షసుడిగానో తలచుకుని భయపడి పోతాడు. కంటికి అంకకుండా తిరుగుతాడు. అంతేకాదు ఓ వేళ అమ్మ చెప్పిన దాయిన సాధించలేకపోతే అర్భకుడు అని కూడా ఊహించుకుంటాడేమో!... క్రూరత్వపు ఛాయలు లేని పెద్దవాళ్లు ఉండరేమో దాని రూపమే — ఈ పసివాళ్లని, నిస్సహాయులని భయపెట్టడం కొట్టడం అనుకోవచ్చు — చూశారో లేదో కొట్టినా కొట్టక పోయినా, దెబ్బ పడినా పడక పోయినా పిల్లలు భయంతో దెబ్బ తిన్నంతగానూ ఒణికేలా చేస్తారు. కొందరు పెద్దలు—వీళ్లు ఆలోచించనిది ఒక్కటే— మనం నిర్లక్ష్యంగా మాట్లాడినా దాన్ని పిల్లలు ఎంత శ్రద్ధగా వింటారన్నది.

క్లాసులో ఏదో ఘనకార్యం జరిగినట్టు చిలవలూ పలవలూ చేర్చి చెప్పి చూస్తుందొక చిన్నారి. ఆమె తత్వం తెలిసిన తల్లి అయితే—'మరీ పోనిద్దూ,' అని ఊరుకోవచ్చు. నిజానికా చిన్నది అమ్మావాళ్లా చెప్పకునేటట్టు అంతా అల్లి చెప్పాలని తాపత్రయ పడుతోంది — అంతే గాని వేరేం కాదు. అది కాస్త విని విననట్టు ఊరుకోక 'ఉండు క్లాసు కొచ్చి అడుగుతాను' అంటే పేచీ ప్రారంభం అవుతుంది! పెద్దవాళ్లు మాట్లాడుకొంటున్నప్పుడు పిల్లలు విననట్టే ఉంటారు గాని, అన్నీ వింటారు భద్రంగా పదిల పరుచుకుంటారు కూడా. ఎప్పుడో మనం ఎదురు మాడనప్పుడుగాని ఈ సంగతి మనం గ్రహించలేం. 'నేను కామేశ్వరిని చూసొస్తాను' అని యథాలాపంగా అన్నదానికి ఠపీమని వస్తుంది — 'మరి కిందటి వారమేగా మళ్లీ జన్మలో ఆవిడతో మాట్లాడనన్నావు?' అని—

పిల్లలకి అర్థం కానిది ఒక్కటే— ఈ పెద్దవాళ్ల మాటకి నిలకడ ఎందుకుండదన్నది. ఒకసారి కోప్పడ్డదానికే ఇంకోసారి ఊరుకుంటాం. ఓసారి ముద్దుచేసిన దానికి ఇంకోసారి కసిరికొట్టి పొమ్మంటాం — కోపంగా ఉన్నప్పటి ధోరణి పూర్తిగా మరిచిపోతాం. కాని పిల్లలకిదంతా ఎలా తెలుస్తుంది?—మనకి పిల్లలతో బ్రతకడం యాతన ఉండొచ్చు. కాని ఇలాంటి పెద్దల్లతో మసలడం పిల్లలకి యాతనా యాతనన్నరా! ఆలోచించి చూడండి. ●

సెక్రటరీలు


అబ్బ! మావాడికి రాయనూ చదవనూ రాదు. ఉపన్యాసం నే చాలాసార్లు చదువుతే బట్టీ పడుతాడు
అసలు నీకేం తెలీదు - వాటి ఫూల్ నువ్వు అన్నాడు రాత్రి - నాయన ఇలా వుందానేపని అని 'ఆగష్టు పదిహేను ఆంధ్రప్రదేశ్ అవతరణ' అని ఉపన్యాసంలో రాసాం!
సెక్రటరీ ఉపన్యాసం రాయడం ఆలస్యం చేసుంటాడు!
మీరు రెండు ముక్కలు కూడా మాట్లాడ్లేదేం?
వెధవది - మా సెక్రటరీ సెలవు పెట్టాడు
మళ్లా ఉపన్యాసం రాయడం ఎందుకయ్యా - పోయిన సంవత్సరం కాపీ ఇవ్వు చాలు
AUGUST 15
అరగంట ఉపన్యాసమే రాసాను సార్ - కాని ఒక్కొ వాక్యం రెండు సార్లు చెబితే గంట ఉపన్యాసం అవుతుంది!



జ రి గి న క థ

కృష్ణమోహన్‌కి కళ్ళు కనిపించవు. అతన్ని దైవంగా ఆరాధిస్తూ మురిసిపోతూవుంటుంది భానుమతి. కృష్ణమోహన్ చెల్లెలు మాధవి, ఆమె ఎంతో అన్యోన్యంగా వుంటుంటారు. కృష్ణమోహన్ కళ్ళు పరీక్షించే నిమిత్తం తమ్ముడు సారధిని రప్పిస్తుంది భానుమతి. ఆపరేషన్ విజయవంతమవుతుంది. కృష్ణమోహన్‌కి కళ్ళు వస్తాయి. సారథి, మాధవి అన్యోన్యతను కనిపెట్టి వారిద్దరికీ వివాహం జరిపిస్తుంది భానుమతి. క్రిష్ణమోహన్‌కి సినిమాల్లో పాటలుపాడే ఛాన్సు లభిస్తుంది. అతనికి మేరీతో పరిచయమవుతుంది. భానుమతి కనిపెట్టి అతన్ని మెత్తగా మందలిస్తుంది. అనుకోకుండా ఎదురైన సమస్యలు భానుమతిని కొద్దిగా చలింప జేస్తాయి.

10

రాజ్యలక్ష్మమ్మగారు ఆశ్చర్యపోయారు భానుమతి అకస్మాత్తుగా వచ్చినందుకు.

'ఆయన బొంబాయిలో వుండిపోవలసి వచ్చిందమ్మా! అందుకని కొన్నాళ్ళు నీ దగ్గర వుందామని వచ్చేశాను' అన్నది యదార్థాన్ని విప్పి చెప్పకుండా.

నిజమే గాబోలనుకున్నదామె.

'కులాసాగా వుందామ్మా! చిక్కిపోయి నట్లున్నావు' అన్నది తల్లి కళావిహీనమై వెలవెల పోతూన్న కుమార్తె ముఖం వంక చూసి.

భానుమతి గొంతులో దుఃఖం వెల్లుబికి పోతోంది. జరిగిన ఘోరాన్ని విన్పించి తల్లిని బాధ పెట్టాలనిపించలేదా మమతా మూర్తికి. అందుకే నిగ్రహించుకుని అన్నది.

'ప్రయాణం వలన నీరసంగా వుందమ్మా! అంతే' అని లోనికి దారి తీసింది.

ఆ రాత్రి తల్లి నిద్రించిన తరువాత లేచింది భానుమతి. తల్లి ప్రశాంతంగా నిద్రపోతోంది. వయోభారంతో వంగి పోయిన ఆమెలో యిక దుఃఖాన్ని జీర్ణంప జేసికొనగలిగినంత సత్తువ లేదనుకుంది భానుమతి.

'అమ్మా! నీ భాను జీవితమంతా స్వప్నంలా కరిగిపోతుంది దుఃఖంలో. అదృష్టవంతు రాలినని మురిసిపోయే నీ ముచ్చటనెందుకో భగవంతుడు ముక్కలు జేశాడు. సుఖం కాదు గదా, మనశ్శాంతి కూడా లేక జీవచ్ఛవంగా మిగిలిన యీ నీ భాను యింకా ఏమాశించి బ్రతుకుతుందో ఆ భగవంతునికే తెలియాలమ్మా!'

భానుమతి ప్రతిరోజూ ఆదేవిధంగా తల్లి నిద్రించిన తరువాత లేచి ఆలోచిస్తూ కన్నీరు కారుస్తూండి పోయేది. కాని వుదయాన తల్లి కంటే ముందే లేచి స్నానం పనిగిరాలు ముగించుకుని పూజా సామగ్రి సిద్ధంజేసి వుంచేది.

తల్లితో పాటే భగవద్ధ్యానంలో లీనమై పోయేది. ఆమెకు భగవద్గీత చదివి విన్పించుతోంది రోజూ.

ఆమె వారించేదప్పుడప్పుడు

'ఈ వయస్సులోనే యింత భక్తి ఎందుకమ్మా! ఏదో నాలాంటి ముసలివాళ్ళకు గానీ'—అని.

'ఇక నాకు మిగిలిందేముందమ్మా! ఒకవేళ భగవానుడు దీన్నుంచి కూడా నన్ను వంచించాలనుకుంటున్నాడేమో!' అనుకునేది మనస్సులో.

'దనికాంతుడికెంతో ప్రేమ తల్లీ నీవంటే. ప్రతి ఉత్తరంలో వ్రాస్తూంటాడు. 'అమ్మా! భాను జీవితంలో నవ్వులు నిండాయి. పువ్వులు కురిశాయి. భగవానుని కరుణా దృష్టితో పునీతమైంది చెల్లాయి.' అని. అన్నది రాజ్యలక్ష్మమ్మగారొకరోజున.

'నీకు తెలియదురా అన్నా! ఈ చెల్లెలి జీవితంలో నిప్పులు కురిశాయని. అపశ్రుతులు నిండాయని. వింటే నీ హృదయం బద్దలవుతుందేమో! ఆ భగవంతుడు నీ ముద్దుల భానుమతిని శపించాడు.'

మనస్సులో బాధపడుతూండేదీ విధంగా భానుమతి.

'వాడు డాక్టరుగా జాయినయిన రోజున వ్రాశాడు. అమ్మా! ఈ రోజెందుకో భాను మరీ జ్ఞాపకం వస్తోంది. కృష్ణమోహన్ ఎంతో మంచివాడు. పరిపూర్ణమైన జీవితాలు వాళ్ళవి. ఏ లోపమూ లేని నందనవనం భాను సంసారం' అని సంతోషంతో పొంగిపోతోందా మాతృహృదయం.

భానుమతి అక్కడ కూర్చోలేకపోయింది. వెంటనే లేచి గదిలోకివెళ్ళి మంచంమీద వాలిపోయింది శోకిస్తూ.

తల్లి ఏదో పనిమీద వెళ్ళివుంటుందని భావించింది.

'అన్నాయ్! నాకు సంసారమే లేదురా యిక. ఆయన మంచివారే. కాని అందానికి అమ్ముడుపోయారు. అవునురా! దుఃఖంతో నిండిపోయింది నా జీవితం. నా ఆశాలత మొదలంటా కూలిపోయింది. ఈ నీ భానుకి శోకం తప్ప మరేదీ లభించలేదురా అన్నా! లభించలేదురా!' భానుమతి దుఃఖంతో మెలికలు తిరిగిపోయింది.

రవికాంతుని వద్దనుంచి ఆ రోజొక జాబు వచ్చింది. చివర వ్రాసిన వాక్యాలు చదవలేకపోయింది భానుమతి. తల్లి వాటినే తిరిగి మరి రెండుసార్లు వినిపించమని కోరింది. భానుమతిలో దుఃఖం సుడులు తిరుగుతోంది. అశ్రుసిక్త నయనాలతో తల్లివంక చూసింది. ఆమె ఆనందంతో నవ్వుకుంటోంది.

'చదువు భానూ!' అన్నదామె.

'అమ్మా! నాకు మొన్న కలలో భాను కన్పించింది ప్రక్కన కృష్ణుడు కన్పించాడుగానీ ఎందుకో మరి తలవంచుకుని వుండిపోయాడు. భాను ముఖం కూడా స్పష్టంగా చూడలేకపోయాను. వాళ్ళ యిరువురి సంధ్యా ప్రణయకలహాలేమైనా వచ్చాయేమో — ఎందుకో భానును చూడాలన్పించింది. ఈరోజే మద్రాసు వెళ్తున్నాను.'

భానుమతి తల్లి చూడకముందే లేచి వెళ్ళిపోయింది 'నిద్రవస్తోందమ్మా' అంటూ.

'ప్రణయ కలహంగాదురా అన్నా! వచ్చింది ప్రళయ తాండవం ఈ నీ భాను హృదయమే అగ్నిగోళమైపోయింది. ఏం వుందిరా అన్నా! ఇంకా చూడడానికి నాలో? ఎందుకురా అంత భయం నీకు నాకేదో జరిగిపోయిందని? కలకే అంతగా దిగులు



రాగమయి

పడిపోతే యిక ఈ నగ్నసత్యాన్నెలా భరించ గలవ్ ?

మనస్సు నిండుగా మమకారం నింపుకుని అర్పించుకున్న నాకు లభించింది తిర స్కారంరా అన్నా! తిరస్కారం!

ఈ భాను జీవితమే పీడకలగా మారి పోయింది. ముక్కలు ముక్కలైన ఈ హృదయాన్నెలా అతికించగలవురా అన్నా? పరిత్యక్త అయిన నీ భానులో యింకా మిగిలిందేమీ లేదు శూన్యం తప్ప—'

భానుమతి వెక్కివెక్కి ఏడ్చింది.

*　　*　　*

బొంబాయిలో జోసఫ్‌గారికో మేడ వుంది. మేరీ కృష్ణమోహన్ లా మేడలో ఖాళీగా వున్న రెండు గదుల్లో వున్నారు.

ఒకరోజున హోటల్ అంబాసిడర్‌కు వెళ్లారిరువురూ. వస్తూండగా నవ యువ కుడొకడు మేరీని పలకరించాడు.

'హల్లో! మేరీ! వాట్! నువ్వు! పెళ్లి జేసికొన్నావా?'

ఆశ్చర్యంతో తల మున్కలై పోయాడా యువకుడు ప్రక్కన కృష్ణమోహన్‌ను చూసి.

మేరీ ఏదో మహాపరాధం జేసినట్లు తల పైకెత్తలేక పోయింది. కృష్ణమోహన్ తెల్లబోయాడు అతని సంభాషణ విని,

'ఏం లేదండీ! చదువుకునే రోజుల్లో అంటూండేది మేరీ—ఏముందా పెళ్లిలో? పుత్త న్యూసెన్స్ గాడిదల వ్యవహారం అది. జీవితాంతం ఒకణ్ణి పట్టుకుని వేలా డాలా?' అన్నాడతడు.

తర్వాత మేరీ ఆ యువకుని కృష్ణ మోహన్‌కు పరిచయం జేసింది. మెట్రిక్‌లో తన క్లాస్‌మేట్, రమేశ్ అని. అతడిపుడు బొంబాయిలో హోటలొకటి నడుపుతున్నా డని తెలుసుకుని మేరీ అభినందించింది.

ఆ రాత్రి కృష్ణమోహన్‌తో అన్నది—

'రమేశ్ చాలా మంచివాడు. ఎంతో సరదాగా వుంటాడు. చదువుకునే రోజుల్లో నా కోసం ఎంతగా యిదయిపోయేవాడని! ఒక్కసారి చూస్తే చాలు. అదే పదివేలు అనేవాడు'

కృష్ణమోహన్ మౌనంగా వుండి పోయాడు.

రెండవ రోజున రమేశ్ స్వయంగా వచ్చి, మేరీ కృష్ణమోహన్‌లను ఆహ్వానిం చాడు తన హోటలుకు.

అయిష్టంగావున్నా అనుసరించాడు కృష్ణ మోహన్. ఆ రోజున మేరీ ఎంతో శ్రద్ధంగా ఓపిగ్గా అలంకరించుకుంది. లిప్‌స్టిక్ అలదుకోడానికే పావు గంట పట్టింది. మెడలో సన్నని చైన్ వేసుకుంది. పసుపు పచ్చని చీర, అదే రంగు జాకెట్ ధరిం చింది. అణువణువూ ఒయ్యారంతో వూగి పోతోందామె నడుస్తూంటే.

రెప్ప వేయకుండా చూస్తూండి పోయాడు రమేశ్.

'రియల్లీ మార్వలస్! అందాల రాణిలా వున్నావ్ మేరీ! మిస్టర్ కృష్ణమోహన్! నిజంగా మీరదృష్టవంతులు' అన్నాడు.

అతనికి రమేశ్ అభినందన రుచించలేదు. నిశ్శబ్దంగా వుండిపోయాడు. మేరీ అతని ముఖమై ఖరి చూచి ముఖం ముడుకుంది.

హోటల్‌కి వెళ్లిన తర్వాత రమేశ్ లేకుండా చూసి అన్నది.

'ఏమిటలా ముఖం ముడుచుకుంటారు? మేనర్స్ తెలియని మనిషిలా?' కృష్ణ మోహన్ వెంటనే ఆమె వంక చూశాడు. ఆ చూపులో కించిత్ క్రోధం గోచరించింది.

'ఎవరికి తెలియనో కన్పిస్తూ వుంది— పన్నెక్కువగా మాట్లాడించకు' అన్నాడు విసుగుదల వ్యక్తపరుస్తూ.

అంతలో రమేశ్ రావడంతో మేరీ ముఖం మీద నవ్వు పులుముకుంది.

'ఇంత పెద్ద హోటల్ని ఒక్కడివే యింత చక్కగా మెయిన్‌టెయిన్ చేస్తున్నం దుకు నాకెంతో సంతోషంగా వుంది రమేశ్' అన్నదామె;

మందహాసం చేశాడతడు సగర్వంగా.

'రమేశ్ ! మరి పెళ్లిజేసికోలేదేమిటి యింకా?'

'నా కంటికి నచ్చినవాళ్ళు కన్పించక' అన్నాడతడు మేరీ కళ్లల్లోకి చూస్తూ.

'నచ్చినవాళ్ళు అందలేదు' అన్నాడు తిరిగి.

'వాట్! నిన్ను కాదనగల ఆ బుద్ధిహీను లెవరు?'

'కాదని అనలేదు మేరీ ! కాని నేనే నా కోరికను వాళ్లముందు వెలిబుచ్చలేదు' అన్నాడతడు.

కృష్ణమోహన్‌కు విసుగు జనిస్తోంది ఈ సంభాషణకు. లేచివెళ్లి కిటికీలోంచి రోడ్‌కేసి చూడసాగాడు.

'ఏమిటి రమేశ్! నువ్వడగలేదా? ఎందు కని?' మేరీ ఆశ్చర్యపడింది.

'నేనంత అందమైనవాణ్ని గాదేమో! ఆమెకు తగనేమో!—'

మేరీ ఫక్కున నవ్వింది.

'వాట్! నువ్వు అందంగా లేవా? ఎవరా అన్నది? నన్నడిగితే నీకంటే అందమైన మనిషిని యింతవరకు చూడలేదంటాను.'

'హా! అయితే నేను భగ్న ప్రేమికుణ్ణి గాదన్నమాట' అన్నాడతడు.

'ఇంతకూ ఆ అందాలరాశి ఎవరో?' కుతూహలం జనించిందామెలో.

'చెప్తానుగా!' అంటూ అతడు లేచి కృష్ణమోహన్‌ను పిలిచి స్వీట్స్ కొన్ని తెప్పించాడు.

వాళ్లిరువురూ సెలవుతీసికొని వెళ్లేప్పుడు అన్నాడు రమేశ్.

'మేరీ! ఈ రాత్రికి సెకెండ్‌షోకి మీక్కూడా టిక్కెట్స్ బుక్‌చేయమని ఫోన్ చేశాను రండి తప్పక'.

'సారీ మిస్టర్ రమేశ్! తల భారంగా వుంది రాలేను' అన్నాడు కృష్ణమోహన్ కటువుగా.

'అయితే మేరీ వస్తుంది లెండి' అన్నాడతడు వెంటనే కృష్ణమోహన్ ఆగ్రహంతో వూగిపోయాడా మాటవినగానే. పళ్లు కొరుకుతూ మేరీవంక చూశాడు. ప్రేమగా అతని కళ్లల్లోకిచూసి అన్నది మేరీ.

'సారీ! రమేశ్! రాలేను'

ఇంటికి వెళ్లిన తర్వాతకూడా అతడు కోపంగానే వున్నాడు.

'అలసిపోయినట్లున్నారు. కొంచెంసేపు నిద్రపోండి. సారిడన్ వేసుకుంటారా?' అంటూ మేరీ అనురాగం ఒలకబోస్తూ దగ్గరగావచ్చి అతని నుదుటిపై చేయివుంచి విమురసాగింది. అతడు నిద్రబోయేవరకూ ఆలాగే కూర్చుండిపోయింది.

లేచిన తర్వాత అడిగిందామె.

'తలనొప్పి తగ్గిందా! నిజంగా మీ కోపం చూడగానే నాకెంతో భయం వేసిందనుకోండి. తలనొప్పి అనగానే నాగుండెల్లో దడమెదలైంది' అన్నదామె అనునయంగా.

అతడు నవ్వుతూ అన్నాడు—

'నాకసలు తలనొప్పే రాలేదు'

'అమ్మదొంగా! అయితే పాపం రమేశ్‌నలా చిన్న బుచ్చారెందుకూ? ఎంతో సరదాపడి అడిగాడు. పోనీ యింకా టైముందిగా? వెళ్దామా?' అన్నది వాచీచూసి.

అయిష్టత గోచరించిందతని కన్నుల్లో:

'మీ మనస్సు చికాగ్గా వున్నట్లుంది. సినీమాకెళ్తె కాస్త రిలీఫ్‌గా కూడా వుంటుంది—

('4 వ పేజీ చూడండి)

ఆ! చూడండి! మీరీకోటు వేసికోండి! ఎంత బావుంటారని మీరీకోటు వేసుకున్నపుడు? నిజంగా దొరలా వుంటారు' అని మేరీ అతనికి మాట్లాడ్డానికూడా వ్యవధి యివ్వకుండా కోటు వేసింది.


'ఇందుకే నాకు నచ్చావ్ నువ్వు!' అన్నాడతడు టై కట్టుకుంటూ. కానీ ఎంత యుక్తిగా అతడిని మోసం చేస్తూందో గ్రహించలేకపోయాడు.

తర్వాత ఒకరోజున రమేశ్‌బాబు తల్లిని పంపించి మేరీ వాళ్లను తన యింటికి

(41 వ పేజీ తరువాయి)

ఆహ్వానించాడు. కృష్ణమోహన్ ప్రొఫెసరు నెవరినో కలిసికోవాలని వెళ్లిపోయాడు.

'ఏమో బాబూ! మీరు లేకపోతే నాకెలాగో వుంటుంది. పోనీ లెండి. పాపం! వాళ్లమ్మగారు పనిగట్టుకుని మరీ వచ్చారు. వెళ్లకపోతే ఆమె మనస్సు నొచ్చుకుంటుంది' అన్నది మేరీ అయిష్టతను ప్రదర్శిస్తూ.



సాయంత్రం ఆరుగంటలకు తిరిగి వచ్చాడు కృష్ణమోహన్. మేరీ రాలేదింకా. పడుకున్నాడతడు.

రాత్రి తొమ్మిదిగంటలకు వచ్చింది.

'అబ్బ! ప్రాణం తీసేశారనుకోండి! రమేశూ, వాళ్లమ్మా! యీ రాత్రి వుండిపొమ్మని' అన్నదామె వచ్చి రావడంతోనే విసుగుదల వ్యక్తపరుస్తూ అతని ప్రక్కనే కూర్చుని.

'అయితే వుండక పోయావ్?' అన్నాడు కోపంగా.

'భలేవారే! మీకోపం వచ్చినట్లుందే' అని ఆమె ఆపైన యిక ఆ ప్రసక్తి రాకుండా జాగ్రత్త వహించింది సంభాషణ మార్చి. ఒక్కసారాడు బయటకు దృష్టి సారించినట్లయితే అతని నిషా పూర్తిగా దిగిపోయేది.

రమేశ్ కారులో నుంచి దిగుతూ మేరీ అతనితో ఏమన్నదో, అందుకతడెంత ప్రేమగా సమాధానం యిచ్చాడో వినలేదతడు.

రెండు మూడు రోజులవరకూ ఎక్కడకూ వెళ్లలేదు వాళ్లు. ఒక రోజున కృష్ణమోహన్ తిరిగి ఆ ప్రొఫెసరు దగ్గరకు వెళ్లాడు. అతడు వచ్చేసరికి మేరీ యింటి దగ్గర లేదు. ఎక్కడికి వెళ్లిందా అని ఆశ్చర్యపడ్డాడతడు. ఎంత సేపటికీ రాకపోయేసరికి అలా వెదకసి వెళ్లాడు.

అక్కడి దృశ్యం చూసి నిర్విణ్ణుడయ్యాడు.

మేరీ, రమేశ్ యిరువురూ దగ్గరగా కూర్చుని మాట్లాడుకుంటున్నారిలోకాన్ని మరిచి. మధ్యలో రమేశ్, మేరీ చేతిని తీసికొని ముద్దుపెట్టుకున్నాడొకసారి. మేరీ సిగ్గుతో గాబోలు తలవంచుకుంది.

ఆ విశృంఖల విశృంఖలాపాన్ని విన గూడని వ్యక్తే విన్నాడని ఆ ప్రేమమయులకు తెలియదు.

కృష్ణమోహన్ కళ్ల నుంచి నిప్పులు రాల్తున్నాయి.

సరాసరి రూమ్‌కు వెళ్లాడు. తల తిరిగిపోతోంది. కణతలు నొక్కుకుంటూ అలాగే కూర్చుండి పోయాడెంతో సేపు. అంధకారం ప్రగాఢమౌతోంది. కానీ మేరీ రావేలేదు. ఆగ్రహంతో, అవమానంతో ఉడికిపోతున్నాడతడు. స్లీపింగ్ టాబ్లెట్ వేసు

కున్నాడు.

ఉదయాన లేవలేకపోయాడు. వళ్ళంతా నొప్పులే. తలనొప్పి విపరీతంగా వుంది. కళ్ళు మండిపోతున్నాయి. జ్వరం వచ్చినట్లుంది. ప్రక్కవాటాలోని వాళ్ళబ్బాయి కవరొకటి తెచ్చియిచ్చాడు.

'డియర్ కృష్ణా!

మనం యిక కలిసివుండలేము. అందుకే సెలవు తీసికుంటున్నాను. మరీ అంత సంకుచితంగావుంటే మిమ్మల్నెవరూ క్షమించరు.

'విత్ బెస్ట్ విషెస్
మేరీ'

ముక్కలు ముక్కలుగా చింపి వేశాడా జాబు నతడు. వెంటనే లేచి తన బట్టలు సర్దుకున్నాడు. సరాసరి స్టేషనుకు చేరుకున్నాడు లేవడానికి సత్తువ లేక పోయినా ఎలాగో ఓపిక దెచ్చుకుని.

రెండు మూడుసార్లు రైల్లో వాంతి చేసుకున్నాడతడు. వళ్ళు పెనంలా కాలిపోతోంది. లోపల వికారం ప్రారంభమైంది. రైల్లో వున్నన్నిరోజులూ అతనికి జ్వర తీవ్రతతో బాటు, అపరాధం చేశానన్న భావం మరింత బాధించసాగింది.

మద్రాసు చేరిన తర్వాత యింటికివెళ్ళి చూసి స్తబ్ధుడయ్యాడు. యజమాని ఆమె వెళ్ళిపోయింది— ఎక్కడికో తెలియదు అని చెప్పాడు.

భయంతో వణికిపోయాడామాట విన్న వెంటనే. జ్వరంతో, బాధతో అతని ముఖం పీక్కుపోయింది.

గాలికి పడిపోయేట్లు దివటలా వూగిపోతున్నాడు.

హైదరాబాద్ చేరుకున్నాడా జ్వరంతోనే ఆశాదీపం కళ్ళబడుతుందన్న వూహతో.

తలుపుతట్టాడు. తలుపు తెరిచిన మాధవి తెల్లబోయి 'అన్నాయ్' అన్నది ఆశ్చర్యంతో విప్పారిన నేత్రాలతో చూస్తూ.

నీరసంతో తూలిపోతున్నాడతడు. వెంటనే లోనికి నడిపించి ప్రక్కవేసి పడుకోబెట్టింది. కాఫీ యిచ్చిన తరువాత సారథికి ఫోన్‌చేసింది రమ్మని. ఎందుకింత లేవలేని పరిస్థితిలో అతడు ఒంటరిగా వచ్చాడో ఆమె కర్థంగావడం లేదెంత తల బద్దలు కొట్టుకొన్నా.

'వదిన...వ...చ్చిందా! జ్వర తీవ్రతలో కలవరిస్తున్నాడతడు. ఉండి వుండి నిస్తేజంగా వున్న కనులెత్తి చూస్తున్నాడు కృష్ణ

రాగమయి

మోహన్. క్షణక్షణానికీ భయంతో కంపించి పోతోంది మాధవి.

సారధి వచ్చి కృష్ణమోహన్‌నాపరిస్థితిలో చూసి స్తంభించి పోయాడు. మాధవిని అవతలకు పిలిచి అన్నాడు—

'అక్క రోగిని ప్రక్కన జేర్చుకుని మరీ సేవ జేస్తుంది! ఈస్థితిలో బావనెలా కాలు కదప నిచ్చింది? ఏదో కుంభకోణం జరిగే వుంటుంది?' అతని సందేహాలు ఆమెకూ సందేహాలయ్యాయి.

'సరే! అక్కకోసం ఏలూరు వెళ్తాను. అక్కడ వుందేమో తెలుసుకు రావడానికి. డాక్టరు విల్సన్ వస్తారిక్కడకు' అని వెంటనే ప్రయాణమై స్టేషనుకు వెళ్తూండగ దశరథరామయ్య గారెదురయ్యారు.

జరిగిందంతా చెప్పారాయన స్నేహితుడొకడు చెప్పాడని. విన్న సారధి, మాధవీ నిశ్చేష్టులయ్యారు. అగ్నిహోత్రుడయ్యాడు సారధి. బజారునుంచి అప్పుడే వచ్చిన వెంకట్రామయ్యగారీ విషయం విని కొడుకు నా పరిస్థితిలో చూసి నీరైపోయారు— ఆవృద్ధుని హృదయం ఆవేదనతో వూగి పోతోంది.

మాధవి కంటివెంట కన్నీటి ప్రవాహం అవిరామంగా ప్రవహిస్తోంది. క్షణక్షణానికీ కృష్ణమోహన్ పరిస్థితి విషమిస్తోంది. అప్పుడప్పుడు స్పృహకోల్పోతున్నాడు.

క్షమించరాని అపరాధం జేసినా, మనో వ్యధతో, జ్వరతీవ్రతతో దుర్బలుడైన ఆ రోగి నెవరూ ఏం చేయడానికీ వీలు లేకుండా వుంది.

* * *

ఏలూరులో వుండవని నిశ్చితాభిప్రాయానికి వచ్చిన సారధి ఆశ చంపుకో లేక ఏలూరు వచ్చిన తర్వాత భానుమతిని చూసి నివ్వెర పోయాడు. రవికాంతునితో చెప్పాడు జరిగినదంతా రహస్యంగా. అతడు అగ్నిజ్వాలే అయ్యాడు. ఇందుకా! భాను మద్రాసులో లేనిది. మాణిక్యాన్ని మసిబొగ్గుగా జూసిన వాడికి శాస్తి జరిగి తీరవలసిందే' అన్నాడతడు క్రోధంతో నిప్పులు గ్రక్కుతూ.

'ఏదేమైనా సరే! భాను రాదు! రాదు! రానీయను' రవికాంతుడు పెద్దగా అరిచాడు.

'అక్కా! పంతాలకిది సమయంగాదు— బావ ప్రాణాపాయ స్థితిలో వున్నాడు' అని భానుమతితో నిజాన్ని చెప్పివేశాడు.

'అయినా సరే—రాదు—పో!'

'అన్నాయ్! చెల్లెలిపైన పిసికెమాత్రమైనా ప్రేమ అన్నది వుంటే నా వెంటరా! పద! సారధీ!' అన్న భానుమతి మాటలకు రవికాంతుడు విస్మితుడయ్యాడు.

అందరూ కలిసి ప్రయాణమయ్యారు.

* * *

ఆ రాత్రి గడిస్తేగానీ ధైర్యం చిక్కదన్నారు డాక్టర్ విల్సన్. మాధవికి 'వదిన వస్తుందన్న ఆశ సన్నగిల్ల సాగింది. వెంకట్రామయ్యగారు గుండెలరచేతిలో పెట్టుకున్నారు. దుఃఖంతో బ్రద్దలై పోతోంది మాధవి హృదయం.

కృష్ణమోహన్ గొంతు నుంచి సన్నని మూల్గు వస్తోంది. వెంకట్రామయ్యగారికి కూడా కోడలు రాదన్పించుతోంది లోలోన. కానీ గాలికి కిటికీ రెక్కలు వూగినా అంత ఆందోళనలోనూ ఆ మమతామయి కోసం తలెత్తి చూస్తున్నారు.

కృష్ణమోహన్ గొంతు నుంచి మూలుగు కూడా ఆగి పోయింది. డాక్టర్ విల్సన్ నాడి చూసి పెదవి విరిచారు. కరుణ పుట్టిపడే స్వరంతో అన్నారాయన.

'ఆ భగవంతుడే కాపాడాలిక'

మాధవీ, వెంకట్రామయ్యగార్ల తలలు వాలిపోయాయి.

'ఎలావుంది మాధవీ?' అన్న ఆందోళనాపూరిత స్వరం విని తలెత్తిన మాధవి కళ్లల్లో కోటి దీపాలు వెలిగాయి. లేచి వెళ్లి భానుమతిని కౌగిలించుకుని సన్నగా రోదించసాగింది ఆవేదన నణచుకోలేక.

రవికాంతుని కనుకొలకుల్లో కన్నీరు నిలిచింది.

'నీ వస్తువును నీ కప్పగించలేవేమోనని భయపడ్డానక్కా! కానీ భగవాను డనుగ్రహించాడు. ఇక మా డాక్టర్ల వలన లాభం లేదు. నిన్నా పరమేశ్వరుడే కరుణించాలిపుడు' అన్నాడు సారధి బరువుగా నిట్టూరుస్తూ.

కాంతి విహీనమైన భర్త ముఖం వంక చూసి ఎదురుగావున్న కృష్ణ విగ్రహంపై తన దృష్టి మరల్చింది భానుమతి.

'భగవాన్! మానవరూపంలో అవతరించి అనురాగ మాధుర్యాన్ని చవిజూచిన లీలామయుడవు. ఆ మాధుర్యానికి ప్రతిరూపమైన రాధను కరుణించిన దయామయుడవు ప్రభూ! అమంగళం జరగకుండా ఆశీర్వదించు తండ్రీ!' ఆమె మనస్సు మొర పెట్టుకుంది లోలోనే ఆ దీనజన రక్షకునికి.

నిరాశాపూరిత సజల నేత్రాలను ఒత్తుకుని భర్తవంక చూసి నిట్టూర్చింది భారంగా.

నాల్గు గంటలకు సన్నగా మూలిగాడు కృష్ణమోహన్. సారధి నాడిచూసి అన్నాడు.

'ఇక భయంలేదక్కా! నీ ప్రార్థన విన్పించింది పరంధామునికి.'

అందరి మనస్సులూ కుదుటపడ్డాయి.

* * *

ఉగాది. ఆంధ్రుల జీవితాల్లో సర్వశోభలకది నాంది. అప్పటికి కృష్ణమోహన్ పరిపూర్ణ ఆరోగ్యవంత డయ్యాడు.

ఆనాడే మాధవి మాతృమూర్తి అయ్యింది. మేనల్లుని చూస్తూ అన్నాడతడు—

'మీ పోలిక రాగూడదని యేడుకొండలవాడికి మొక్కుకున్నాం బావగారూ!' అన్న సారధిమాటల కందరూ నవ్వారు.

ఆరాత్రి భానుమతి నడిగాడతడు.

'భానూ! నన్నెలా క్షమించ గలిగావ్! ఇంకా ఎలా మూర్ఖుణ్ణి ప్రేమించగలుగుతున్నావ్?'

'క్షమించడం స్త్రీజాతికి వెన్నలో పెట్టిన విద్య. స్త్రీ రాగమయి అని మీకు తెలియదా?'

అన్నదామె ప్రేమ పూర్వకంగా.

'అవును' భానూ! స్త్రీ రాగమయి'

(అయిపోయింది)

పెద్దకథ

'నానీ! కళ్లుమూసుకో నాన్నా" శ్యామల సబ్బుతో పిల్లాడి ముఖం కడిగింది చెవులు వీధిలో స్కూటరు శబ్దం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాయి కొడుకుని ఎత్తుకుని తుడుస్తూ హాల్లోకి వచ్చి కిటికీలోనుంచి బయటకి చూసింది

వీధిలో జనం హడావుడిగా తిరుగుతున్నారు

గడియారం సరిగా ఆరుగంటలు చూపిస్తోంది 'ఎప్పుడూ యింతే అనుకున్న సమయానికి యింటికి రావడం అనేది ఏనాడూ అలవాటులేదు' శ్యామలకి భర్తమీద మనసులో విసుగు ప్రారంభ మయింది పోనీ తను వచ్చేసరికి అన్నీ తయారుగా ఉంటే వెంటనే బయలుదేర గలిగితే షో మొదటికి అందుకోవచ్చు నానికి బట్టలు తొడిగి, వాడి బుగ్గలకి పౌడరుకొట్టి మంచం మధ్యగా కూర్చో పెట్టింది తను బట్టలు మార్చుకుందామని



స్నేహానికి సంకెళ్లు

అత్తిలి వెంకటరత్నం

గ్డాయరు తెరచి మళ్లీ జ్ఞాపకం వచ్చి వంట దిలోకి వెళ్లింది.

ప్లేటులో టిఫిను, గ్లాసుతో మంచినీళ్లు తెచ్చిపెట్టి, కాఫీ ఫ్లాస్కు దగ్గరగా జరిపింది. చివరకి హడావుడిగా బట్టలు మార్చుకుని వచ్చేసరికి టైము మరొక పదిహేను నిమిషాలు జరిగింది ముందుకి.

రమణమూర్తి వస్తున్న సూచనలేమీ కనపడ లేదు. ఒకసారి నిరుత్సాహంగా నిట్టూర్చి వీధితలుపు తెరచి గుమ్మంలో నిలబడింది.

క్షణంక్షణం ముందుకి నెట్టుకుంటూ పోయాయి. శ్యామల విసుగు, చిరాకు, కోపంలోకి మారటానికి ముందుకి నడచిపోతున్న కాలం చాల సహాయపడుతోంది.

తలుపు దగ్గరగా లాగి మళ్ళీ లోపలికి వచ్చేసింది. నాని మంచం మీదే నిద్రపోయాడు. వాడి ప్రక్కన కూర్చుని బొత్తాములు విప్పి నిద్ర మెలకువ రాకుండా చొక్కా, లాగూ తీసేసి ప్రక్కకి పడేసింది. వాడు కితకితల పుట్టి నిద్రలోనే నవ్వాడు. మరొ ప్పుడయితే శ్యామల ఆ అందానికి కొడుకుని నిద్ర మెలుకువ వచ్చేంత గట్టిగా ముద్దుపెట్టుకుని ఉండేది. ఆక్షణంలో మాత్రం చూస్తూ వూరుకుంది.

చీకటితెరలు గదిలోకి ప్రసరించాయి.

శ్యామల కోపం ఆమె ఆలోచన పరిధిని పెంచి అవకతవక చేస్తోంది. కొంచెం సేపటికి లేచిలైటు వేసింది. గడియారం దగ్గరగా ఏడు గంటలు చూపిస్తోంది.

స్కూటరు హారను, తర్వాత ఆగిన శబ్దం పరిచితంగా వినబడ్డాయి. మరుక్షణం రమణమూర్తి లోపలికి వచ్చాడు. ఒకసారి శ్యామల తయారయిన బట్టలవంక, బల్లమీద అమర్చిన టిఫిను కాఫీల వంక చూసి నీరసంగా నవ్వాడు.

శ్యామల భర్తవంకకూడా చూడలేదు. నిద్ర పోతున్న కొడుకు జుట్టులో చిక్కులు తీస్తున్న ట్లుగా ప్రేళ్లు కదుపుతూ కూర్చుంది.

"అనుకోకుండా ఉండిపోవలసి వచ్చింది మరి." రమణమూర్తి కూర్చుని చొక్కా బటన్సు విప్పాడు. భార్య మౌనంగా ఉండిపోయేసరికి మళ్లా అన్నాడు. "అయిదున్నర వరకూ వద్దామనే అనుకున్నాను. తీరా బయలుదేరబోయేసరికి....."

శ్యామల మధ్యలోనే అంది. "నాకు చెప్పక్కర లేదు, మామూలేగా. మీరు యింటికి వెళ్లిపోతున్నారని తెలిసి ఒక పేషంటుకి అకస్మాత్తుగా ప్రమాదం ముంచుకొచ్చింది. మీరు మీ విధి నిర్వర్తించడానికి తప్పనిసరిగా ఉండిపోయారు.

రమణమూర్తి మరేమీ మాట్లాడకుండా నిట్టూర్చి వూరుకున్నాడు.

అతనులేచి స్నానంచేసి వచ్చేసరికికూడా శ్యామల అలాగే కూర్చుంది.

"టిఫినువద్దు, ఆలస్యమయిపోయింది" కాఫీ మాత్రం గ్లాసులో పోసుకుని కూర్చున్నాడు. మధ్యమధ్యలో భార్యవంక చూస్తూ.

శ్యామల పాతవీక్లీ ఏదో చదువుతున్నట్లుగా పేజీలు పూంకే త్రిప్పుతుంది.

రమణమూర్తి గ్లాసు బల్లమీదపెట్టేసి భార్య దగ్గరగా వచ్చి భుజాలమీద చేతులు వేసాడు. "రేపు తప్పకుండా వెళ్దాం.

శ్యామలచేతులు ప్రక్కకి తొలగిస్తూ, ఒక్కొక్క అక్షరం కోపంగా వత్తి పలికింది. "యివాళ ఆఖరు రోజు". మళ్లీ ఆగి అంది. "మధ్యాహ్నం మీకు ఆసంగతికూడా చెప్పాను."

రమణమూర్తి మరేమీ మాట్లాడలేకపోయాడు. ఏం చేయడానికి తోచనట్లు కొడుకు బుగ్గలు వ్రేలితో సున్నితంగా మీటుతూ మంచంమీద కూర్చుండిపోయాడు..

"వాడిని కూడా నిద్ర లేపకండి, నా ప్రాణం తీస్తాడు." శ్యామల వాతావరణం చల్లబరచే ప్రయత్నం ఏదీ చేస్తున్నట్లు అనిపించలేదు.

ఒకసారి టైముచూసి అన్నాడు. యింగ్లీషు పిక్చరు అన్నావుగా. యింటర్వెల్ తరువాత కాని మొదలుపెట్టరు. యిప్పుడు వెళ్దాం నడు.

"నాకళ్లనీళ్లు తుడవక్కరలేదు జాలిపడి".

"సరే అయితే" రమణమూర్తి అంతకన్నా అనడానికి తోచలేదు. కథలు, సినీమాలలో మనుషులలాగ నన్ను క్షమించలేవా యీసారికి అని తను అనగలిగితే భార్య వెంటనే చల్లబడుతుందని అతనికి తెలుసు. చీటికీ మాటికీ ప్రతి చిన్నదానికి క్షమించు అని అనడం వాస్తవిక జీవితంలో అసహజం అని అతని నమ్మకం. యిలాగ జరిగినందుకు తను కూడా బాధపడుతూనే ఉన్నాడు. అది తనుగ్రహించి ఊరుకోవాలి.

రమణమూర్తికి భార్య ఒడిలో కరిగిపోయేంత భావావేశం, రసస్ఫూర్తిలేవు. మనసులో ఉన్న అనురాగం మాటలలో విప్పిచెప్పటం అసహజం కేవలం కథలలో చదవటానికి బాగుంటుందని ఎప్పుడూ అనుకునేవాడు.

అప్పటికి భార్యతో ఏమన్నా ప్రయోజనం ఉండదని చిరాకుపడి అక్కడనుండి లేచి వెళ్లిపోయాడు.

రాత్రి మళ్లీ శ్యామల యీసారి ప్రస్తావన తెచ్చింది.

"అసలు ఆ రోగులమధ్య ఉంటే భార్యా, పిల్లలు గుర్తుకి రారేమో!"

రమణమూర్తి చదువుతున్న పుస్తకం మూసేసి దగ్గరగా వచ్చాడు. "నీ కోపమేకాని ఏనాడు నా పరిస్థితి అర్థం చేసుకునేందుకి ప్రయత్నించవు. యిదేం నాస్వంత ప్రాక్టీసు కాదుకదా! అవసరమయితే మరి ఉండవలసి వస్తుంది."

"మీతోటి వాళ్లందరూ మీలాగే అంతసేపూ హాస్పిటల్‌లో భజన చేస్తూ కూర్చుంటున్నారా?"

రమణమూర్తి భార్య చేతివేళ్లు సున్నితంగా తన చేతిలో నొక్కి అన్నాడు. "యింకపోనిద్దూ. యీసారి నిన్ను ఎప్పుడయినా తీసుకెళ్లకపోతే అందు గాని."

"మీ హాస్పిటలు, రోగులు, జబ్బులు, అప్పుడూ ఉంటాయి." చెయ్యి విడిపించుకుంది.

"పోనీ నా కోసం కొంచెంసేపు చూసి, నువ్వు వెళ్లలేక పోయావా?" సర్దుకుని ప్రక్కలో కూర్చున్నాడు.

"ఒకసారా, రెండుసార్లా యీ అనుభవం! యీసారి తప్పకుండా అలాగే చేస్తాను."

"పోనీ సెకండ్ షోకి వెళ్దాం పద."

అదెలాగూ జరిగేపనికాదు. మర్నాడు మళ్లీ నైట్‌డ్యూటీ. రెండురోజులు వరుసగా నిద్ర పోతుంది. ఎలాగరా తను వద్దంటుంది కదా అని అంటున్నాడని గ్రహించి శ్యామల మాట్లాడకుండా వూరుకుంది.

"సినిమా గొడవ వదిలెయ్యండి. అసలు మీకు భార్యతో హాయిగా కొంచెం టైము గడపాలని ఉండదా? అందరూ మీలాగే హాస్పిటల్‌నే అంటుకుని కూర్చుంటున్నారా? తనే మళ్ళీ అడిగింది.

"నేనేం మనిషిని కాదనుకుంటున్నావేమిటి?" రమణమూర్తి తేలికగా నవ్వడానికి ప్రయత్నించాడు.

"ముందు నాకు జవాబు చెప్పండి."

"అందరిలాగ బాధ్యతలు క్రిందవాళ్లమీదకి నెట్టేసి యింటికి వచ్చేయాలంటే రావచ్చు. మరి అలా చెయ్యాలంటే నా మనసు ఎందుకో ఒప్పుకోదు.

"నన్ను ఏడిపించడానికి మీ మనసు ఒప్పుకుంటుంది. నా అవసరాలు, కోరికలు మీకు అవసరం లేదు. ప్రక్కమీదకి ఒరిగిపోతున్న భర్తవంక చిరాకు చూపింది.

"అబ్బ! ఒక పట్టాన వదలి పెట్టవు. నిద్ర వస్తోంది. పడుకునేప్పుడు లైటు ఆర్పెయ్యి. రమణమూర్తి ప్రక్కకి వత్తిగిల్లి ఆవలించాడు.

"మరి సెకండ్‌కి షో తీసుకు వెళ్తానని బడాయి కబుర్లెందుకు? ప్రసంగం తప్పించే నిర్లక్ష్యం చూసి మరీ మండిపోయింది కోపంతో.

"అన్నాను కాని నువ్వు వస్తానన్నావేమిటి? నేను పడుకుంటున్నాను.

శ్యామల మరింకేదో అనబోయి అప్పటికే అతను నిద్రపోతున్నట్లు కళ్ళు మూసుకోటంచూసి నిట్టూర్పుతో బయటికి కక్కడానికి ప్రయత్నించి ఊరుకుంది.

*　　　*　　　*

మరునాడు రమణమూర్తి మధ్యాహ్నం భోజనానికి యింటికి వచ్చేసరికి ఎవరో అపరిచిత వ్యక్తి శ్యామలతో మాట్లాడుతున్నాడు కూర్చుని.

"అదిగో తనువచ్చారు" శ్యామలనవ్వుతూచూసింది.

రమణమూర్తి ఎవరా అన్నట్లు చూస్తూ దగ్గరగా వెళ్లాడు.

"నేను చెప్పిన వర్ణన సరిపోయిందారేదా? సరిగ్గా చూడు. శుద్ధ బుద్ధావతారం. ప్రపంచం అంటే ఏమిటో తెలియదు హాస్పిటల్, రోగాలు తప్ప" శ్యామల భర్తని చూపిస్తూ మరింత నవ్వింది.

వచ్చిన వ్యక్తి యిబ్బందిగా చూసాడు శ్యామల పరిచయంచేయకపోవటంచేత. రమణమూర్తి కూడా సందిగ్ధంగా చిన్న చిరునవ్వు మాత్రం అరువు తెచ్చుకుని నిలబడిపోయాడు

చివరికి వచ్చినతనే లేచి పరిచయం పూర్వకంగా నవ్వుతూ చేయందించాడు. "నా పేరు జగన్నాథం, శ్యామల, నేను చిన్నప్పుడు బాగా స్నేహితులం"

"మీ కూర్చోండి ఎప్పుడు వచ్చారు?" రమణ మర్యాదగా అడిగాడు.

"నేను నాలుగు సంవత్సరాలనుంచి యిక్కడే

సంస్కారానికి...

ఉంటున్నాను" జగన్నాథం యీసారి స్థిమితంగా కూర్చున్నాడు.

శ్యామల జవాబు చెప్పింది. "అసలు నేను చూసి ఆరేళ్లవుతోంది. యివాళ అకస్మాత్తుగా కలిసాడు. చాలా రోజులయిందికదా అని క్లబ్బు మెంబర్ల ముఖాలు దర్శించవద్దామని బయల్దేరాను. బస్ స్టాప్‌లో నా ప్రక్కనే నిలబడ్డాడు. రెండుమూడు సార్లు నావైపు చూసి వూరుకున్నాడు. నాకుకూడా అనుమానం వేసి పేరడిగాను. అక్కడతో తేలిపోయింది. యింటికి లాక్కొని వచ్చాను."

"బాగుంది" రమణమూర్తి పొడిగా నవ్వాడు.

"మనిషి మారాడు. దానికితోడు గాగుల్స్. వెంటనే గుర్తుపట్టలేక పోయాను. అసలు మేము ఆఖరిసారి ఎలా విడిపోయామో చెప్పనా!" ఉత్సాహంగా అడిగింది.

"నీ అబ్బాయిని చూపిస్తున్నావు" జగన్నాథం మధ్యలో అన్నాడు.

"చాలా సేపైంది. నిద్రపోతున్నాడు. మనకథ చెప్పనీ అడ్డురాకు" శ్యామల భర్తవైపు తిరిగింది.

రమణమూర్తికి ప్రసంగం అంతగా ఆసక్తి కలిగించకపోయినా తప్పలేదు. చెప్తున్నట్లు చూసాడు.

"మన పెళ్లి ముందు, మేమూ, వీళ్లూ ప్రక్క ప్రక్కన అయిదారు సంవత్సరాలు ఉన్నామన్నమాట. హైస్కూల్వరకు కలిసే చదువుకున్నాం లెండి. తరువాత నేను ఉమెన్స్ కాలేజీలో చేరిపోవటంచేత ఎక్కువగా కలిసేవాళ్లంకాదు. ఒకయేడాది మామూలుగా తరువాత ఒకరోజు ఏమయిందంటే....." శ్యామల ఒకసారి గలగలా నవ్వి జగన్నాథం వంక చూసింది.

అతను తలవంచుకుని ఎటో చూస్తూ కూర్చున్నాడు.

"నేను ఒంటరిగా ఉన్న సమయం చూసి నా దగ్గరకొచ్చాడు. మీరు చెప్తే నమ్మరుకాని సభాలుగ మోకాలిమీద వంగి అచ్చం రోమియోలాగ చెయ్యిపట్టుకుని నిన్ను ప్రేమిస్తున్నానన్నాడు" ఒక్కగుక్కలో చెప్తూ నవ్వాపుకోలేక పోతోంది శ్యామల.

"ఆరోజు ఏమూడ్‌లో ఉన్నానో మరి రెండో చేత్తో చెంప చెళ్లుమనిపించి వెధవ్వేషాలు వెయ్యకు అనేసి యింటికి వచ్చేసాను. మరునాడు నాకు తెలిసింది అంతకుముందే జగన్నాథం అమ్మా, నాన్న మావాళ్లని వచ్చి అడిగి మామూలుగా అలాగేఅనిపించుకుని వెళ్లారుట. తరువాత అమ్మ అడిగితే నీకిష్టమేనా అని అడిగింది. నాకు సిగ్గుగా మతిపోయింది. వారంరోజులు జగన్నాథంకోసం తిరిగాను. పారిపోయాడని చెప్పారని.

అప్పటికే తను యింట్లో నన్ను చచ్చినా చేసుకోనని చెప్పేసి ఎవరో బంధువుల వూరికి వెళ్లిపోయాడు. తరువాత నేను మళ్లీ యితనిని చూడటం. పాపం పెళ్లిముందునాటొచ్చిగా ఉంటుందని తను తాపత్రయపడితే కథ అడ్డం తిరిగింది."

ఈసారి రమణమూర్తికి మనస్ఫూర్తిగా నవ్వు వచ్చినా జగన్నాథం సిగ్గుపడతాడని ఊరుకున్నాడు.

"మీ ఫామిలీ యీ ఊళ్లోనే ఉన్నారా?"

"నాకింకా వివాహం కాలేదండీ."

"పాపం భగ్న ప్రేమికుడు. నన్ను తప్ప ఎవరినీ చేసుకోకూడదనుకున్నాడేమో!" శ్యామల నవ్వుతూనే అంది.

"అంతగా గర్వపడకు. నేను నీతో అలా చెప్పలేదు కదా. యింతకీ అది కారణంకాదు" జగన్నాథం చొరవగా అన్నాడు సిగ్గుపడుతూనే.

కొంచెంసేపు మాట్లాడి చివరికి రమణమూర్తి లేచాడు. "శ్యామలా! నాకు నేళవుతుంది."

"తనకి ప్రొద్దున్నే భోజనం అలవాటుట. ఆడిగితే అయిపోయిందన్నాడు." శ్యామల భర్తచూపు అర్థం చేసుకుంది.

"అయితే మరొకరోజు తప్పకుండా రావాలి."

"అలాగే".

"మీరు కూర్చో. నేను వడ్డించుకుంటాలే" రమణమూర్తి ఒకసారి జగన్నాథం వంక చూసి లోపలికి నడిచాడు. కాళ్లు, ముఖం కడుక్కొని వచ్చేసరికి శ్యామలవంటగదిలో అన్నీ అమరుస్తోంది.

"అతన్ని ఒక్కణ్ణి వదిలేసి వచ్చావు. బాగుండదేమో".

"పర్వాలేదు. నాని లేచాడు. వాణ్ణి ఒళ్లో వదిలేసాను. బోలెడు కాలక్షేపం."

"సరేలే, బట్టలు తడుపుతాడు. అన్నీ దగ్గరగా ఉంచి నువ్వెళ్లు." కూర్చుంటూ అన్నాడు.

రమణమూర్తి భోజనంచేసి వచ్చేసరికి జగన్నాథం కొంచెం వాతావరణంకి అలవాటు పడ్డట్లు చురుకుగా మాట్లాడుతున్నాడు.

"వారిని యిలా యివ్వండి" రమణమూర్తి కొడుకుని అందుకుని కూర్చున్నాడు.

"అప్పట్లో శ్యాము.... శ్యామల చాలా దుడుకుగా, అల్లరిగా ఉండేదండీ" జగన్నాథం సర్దుకున్నాడు. రమణమూర్తి గమనించనట్లుగా కొడుకుని ఆడిస్తూ ఒకసారి నవ్వాడు.

"యిప్పుడు కాదనుకుంటున్నావేమో, పూర్వాపరం గుర్తు తెచ్చుకుని జాగ్రత్తగా ఉండు" శ్యామల మాటలలో భర్త ప్రక్కనే ఉన్నాడని జంకు ఏ మాత్రమూ కనపడలేదు.

జగన్నాథం మాత్రం రమణమూర్తి వంక పరిశీలనగా చూసాడు. రమణమూర్తికి అర్థమయింది. ఒకక్షణం తర్వాత అన్నాడు. "మీ స్నేహితురాలు మనసులో ఏదీ దాచుకోదు. ఆ తత్వం నాకు చాలా యిష్టం."

శ్యామలకి ఆ మాటల అవసరం ఏమిటో అర్థం కాలేదు. "యిందులో దాచవలసింది ఎవరికిమాత్రం ఏముంది?"

జగన్నాథం సంభాషణలో తన ప్రాముఖ్యం లేనట్లు మౌనంగా చూస్తూ కూర్చున్నాడు.

"ఉండకూడదనే నేనూ అనేది."

తరువాత జరిగిన సంభాషణలో రమణమూర్తి, జగన్నాథం ఒకరి గురించి మరొకరు చాలా తెలుసుకున్నారు.

"ఈ వూరు వచ్చిన ఆరునెలలనుంచి తెలిసిన వాళ్లు ఎవరూ లేరని గొడవచేస్తోంది. యింక నా బాధ తీరింది." రమణమూర్తి చేతులలో నిద్రపోయిన కొడుకుని మంచంమీద పడుకోబెట్టి వచ్చాడు.

"సులువుగా అనేసారు. నామీద పడుతున్న యీ

భారం అంత సులభంగా మోయగలిగింది కాదను కుంటున్నాను'' శ్యామల అతినాటకారితనం, స్వభావంలో హఠాత్తుగా ఉద్దేశించి వేళాకోళంగా జవాబిచ్చాడు జగన్నాథం.

''వరి చిన్నప్పటి స్నేహితులు కదా. ఆమాత్రం కష్టం తప్పదు'' రమణమూర్తి నవ్వుతూ పైకి చూసుకుని లేచాడు.

''యిప్పుడు యిన్ని చెప్తున్నావు. మరి ఆరోజు అన్నీ ఆలోచించకుండానే నన్ను ప్రేమిస్తున్నానని అనుకున్నావా?'' శ్యామల ప్రశ్నకి జగన్నాథం యిబ్బందిలో పడిపోయాడు. ఆమె హఠాత్తుగా ఎదురుగా పాత ప్రసక్తి తీసుకురావటం అతనికి ఏమాత్రం ఇష్టంలేదు. రమణమూర్తిమీద ఆ మాటలు ప్రభావం ఎలాగుంటుందోనని భయపడ్డాడు.

శ్యామల మాటలలో భోళాతనం మీద ఎంత విశ్వాసం ఉన్నా ఆనాటి ఆమె ప్రవర్తన రమణమూర్తికి సంస్కారపు లోతులకి అతీతమయిన చోట హృదయంలో ఒకమూల తాత్కాలికంగా చీపురుముల్లు గుచ్చినట్లనిపించి లేచాడు కాని పైకి మాత్రం మామూలుగా ఉండిపోయాడు.

''నేను మళ్లా హాస్పిటల్‌కి వెళ్లిపోవాలి. మీరు తరచు తప్పకుండా వస్తుండాలి శ్యామలకోసమయినా. నేనెక్కువగా యింట్లో గడపడానికి వీలుండదు. నన్ను రోజూ సాధిస్తూ ఉంటుంది.'' అనేసి రమణమూర్తి వెళ్లిపోయాడు.

తరువాత నెలరోజులలో జగన్నాథం చాలాసార్లు వచ్చాడు. రెండుమూడుసార్లు బయటకి తిరగడానికి సినిమాలకి ముగ్గురూ కలిసి వెళ్లారు.

ఆరోజు ఆదివారంకావటంచేత జగన్నాథం కారులో గండిపేట వెళ్లారు.

''నీకు వయస్సెంత యిప్పుడు?'' శ్యామల అడిగింది.

జగన్నాథం గడ్డిలో వెల్లకిలా పడుకుని మోచేతులమీద సగం ఆనుకున్నాడు.

''నువ్వు అడగబోయే తరువాత ప్రశ్ననాకు తెలుసు.'' మెల్లిగా అన్నాడు.

''జవాబు చెప్పండి. నేనుకూడా అదే ప్రశ్న అడగాలనుకున్నాను'' రమణమూర్తి కొడుకుని భార్య కందించాడు.

''నాకిష్టం లేదు.''

''ఎందుచేత?'' శ్యామల అడిగింది.

''చెప్పడం యిష్టం లేకపోతే బలవంతంలేదు'' రమణమూర్తి సున్నితంగా అడిగాడు.

'చెప్పడం యిష్టంలేకకాదు. వివాహానికి అయిష్టతకి నేను చెప్పే కారణం మీకు నచ్చదని నా భయం''

'చెప్పకుండానే మీకు నచ్చదు అనేది బాగాలేదు. శ్యామల అంది.

ఊరికి చాలామైళ్ల దూరంలో ఉండటం అక్కడ చాలా ప్రశాంతంగా అడవి మధ్యలో ఉన్నట్లుంది. ఆ ప్రాంతంలో ఏవో మూడు నాలుగుయిళ్లు కూడాలేవు. ఆదివారం మామూలుగా యిలాగే చూడటానికి వచ్చిన వాళ్లు మరో రెండు గుంపులున్నాయి. ఒకరినొకరు బాగా దూరంగా కూర్చున్నా అప్పుడప్పుడు నూతిలోనుంచి వస్తున్నట్లు మాటలు వినపడుతున్నాయి. మధ్యలో ఉండుండి పక్షుల కిచకిచలు మాత్రం అందంగా వినపడుతున్నాయి.

''నాకు మన వివాహ వ్యవస్థలో నమ్మకంలేదు'' లేచికూర్చుని జగన్నాథం చేతులు దులుపుకున్నాడు.


రమణమూర్తి ఒకసారి ఆశ్చర్యంగా కనులు తాటించి మళ్లా తనకలవాటయిన మవునంలో జారిపోయాడు.

''నువ్వు అప్పటికీ, యిప్పటికీ చాలా మారిపోయావు'' శ్యామల చేతులతో కొడుకుని గుండెలకి దగ్గరగా చేర్చుకుంది.

''నిజమే. అమ్మా, నాన్నా పోయిన తరువాత ఒంటరి జీవితంలో నేను చాలా మారాను మానసికంగా. కాని యీ మార్పుకి నేను విచారించటం లేదు''.

అయిదు నిముషాలు ఎవరూ మాట్లాడలేదు.

''మీకు స్త్రీమీద నమ్మకం పోయిందా?'' చివరకి రమణమూర్తి యథాలాపంగా వేళ్లతో చిన్నగడ్డి



రకలు పెరుకుతూ అడిగాడు.

"నాతో వాదించాలనుకుంటున్నారా?" జగన్నాథం నవ్వాడు.

"ఏమో నాకు అలా అనిపించింది. మీ వూహాలన్నీ వుత్సాహంగా ఉంటాయి. తెలుసుకోవడం కాకిష మే. ఏమీ అనుకోకపోతే చెప్పండి."

"చెప్పాం. నాకు వినాలనివుంది" శ్యామల కూడా ఉత్సాహంగా అంది.

జగన్నాథం ఆలోచించి మాట్లాడడానికి కొంచెం టైము తీసుకున్నాడు. "నాకు స్త్రీ అంటే నమ్మకం పోయిందాదు. నిజానికి స్త్రీ పక్షమే నేను. మన సమాజ వ్యవస్థలో వారికి ఎక్కువ అన్యాయం జరుగుతోంది. వివాహం ద్వారా స్త్రీ పురుషులు యిద్దరూ తమ స్వాతంత్ర్యం పోగొట్టుకుంటున్నారని నా అభిప్రాయం."

"స్వాతంత్ర్యం అంటే"

"అన్ని రకాలుగానూ, మన వివాహాలు ఎలా జరుగుతున్నాయి. ఒక్క సారిగా వ్యక్తిని సర్వస్వం వదిలేసామనుకుని వివాహానికి ఒప్పుకుంటున్నారు. వివాహం అంటే మన వ్యవస్థలో జీవితాంతం ముడిపడే కాంట్రాక్టు. ఆ తర్వాత తప్పించుకోడానికి ఎవ్వరికీ అవకాశం లేదు. ఇలా జరిగి నా సంఘం పుకారుగా ఆ వ్యక్తిని ఒంటరిని చేస్తుంది. ఇప్పుడిప్పుడు కొంచెం అయినప్పటికీ స్త్రీకి తనకు కావలసిన పురుషుడిని ఎన్నుకోవడంలో పురుషుడికి ఉన్న అవకాశాలు లేవు. అది మొదటి అన్యాయం. ఒకవేళ వివాహానంతరం వాళ్ళు విడిపోవలసి వచ్చినా స్త్రీకి తిరిగి వివాహం చేసుకొనే అవకాశమూ పురుషులకంటే తక్కువ. అందుచేతనే స్త్రీకి అన్యాయం జరుగుతోందని అంటున్నాను" జగన్నాథం ఆగి వూపిరి పీల్చి మళ్ళీ అన్నాడు. "స్త్రీ పక్షంగా ఆలోచిస్తే వివాహం ఒక పెద్ద లాటరీ అయిపోయింది."

శ్యామల కళ్ళు విచిత్రంగా పెద్దవి చేసి

సంస్కారానికి...

వింటోంది.

"మీరనేది వివాహం జరిగే పద్ధతిలో లోపం ఉందని" రమణమూర్తి మాట పూర్తి చేసేలోగానే అందుకున్నాడు జగన్నాథం.

"అది లోపమని అనుకున్న తరువాత ఎక్కడయినా ఒకటే, వ్యవస్థ కూలిపోడానికి. అందుచేతనే యీ వివాహ వ్యవస్థలో స్త్రీ పురుషులు సుఖపడటం లేదని నా నమ్మకం."

"సుఖం అనేది నిర్వచించలేము కదా. వ్యక్తుల తత్వాన్ని ననుసరించి ఉంటుంది. సర్దుకు పోగలిగిన స్వభావం ఉంటే తాత్కాలికంగా అసంతృప్తి కలిగినా తరువాత సుఖపడవచ్చు. అప్పుడు ఆ కొన్ని అసంతృప్తి క్షణాలు కూడా మరచిపోతారు."

"సర్దుకుపోవడం ఎందుకు రావాలి? సంఘం మన స్వాతంత్ర్యంని అరికట డమేకదా!"

"సంఘంకాదు. మనని మనమే అదుపులో ఉంచుకోడంలో తప్పులేదు. భార్యాభర్తలకి ఒకే మనసు రెండు శరీరాలు అయినప్పుడు ఒకరు హెచ్చు మరొకరు తగ్గు ప్రశక్తివుండదు.

"అది సాధించడానికే యీ లోపాలు అడ్డం పడుత న్నాయంటాను."

"మీరూహించే ఆసుఖం ఏమిటో నాకు అందటం టం లేదు ఆలోచనకి. నేనూ శ్యామల మరి సంతోషంగానే ఉన్నాం యింతవరకూ."

"వద్దు వ్యక్తుల ప్రసక్తి తేకండి. ప్రమాదం ఉంది. అయినా ఆ విషయం వాదించడానికి నాకు మీ ఆంతరంగిక ప్రపంచంలో స్థానంలేదుకదా! ఎప్పుడో ఒకప్పుడు మీరు ఈ వివాహానికి చింతించని క్షణాలు ఉండకపోవని నా నమ్మకం."

"కేవలం తాత్కాలికం అని అంటున్నాను."

"అదివాలు."

శ్యామలకి జగన్నాథం మాటలలో నిగూఢంగా సత్యం ఉన్నట్లనిపించింది.

అతను మళ్ళా అన్నాడు. మనందరికి సహజమయిన నైజం. ఎల్లప్పుడూ జీవితం ఒకలాగే ఉంటే విరక్తి కలుగుతుంది. మన జీవితపు నడకయిలా ఉంటుందని ఫార్ములాలా ముందే తెలిసిపోతే అందులో నాకు ఆసక్తి పోతుంది. ఎవరికయినా అంతరంగంలో అంతే."

"యింక కొంచెం తిన్నగా చెప్పు నీ భావం" శ్యామలకి కొంచెం అర్థమయి మరికొంచెం కాలేదని అనిపించింది.

"ఏముంది? మానవ నైజం అనుక్షణం మార్పు కోరుతుంది. ప్రతిరోజూ మార్పు కోరుతుంది. ప్రతిరోజూ ఒకేతిండి తినలేము. అలాగే ఎప్పుడూ ఒకే వ్యక్తులు పరిసరాలు, వాతావరణం....." జగన్నాథం పూర్తి చేయలేదు.

"అంటే స్త్రీకి ఒకే భర్త, పురుషుడికి ఒకేభార్య భార్య అనేది వారి సహజమయిన ప్రకృతినైజంలో సరిపోదనా నీ భావం?" జగన్నాథం ఆలోచనల ఎర్రదీపం దాటి ప్రమాదం దిశగా పరుగెడుతున్నట్లు అనిపించింది. రమణమూర్తికి.

"మీరు చాలా తిన్నగా చెప్పారు." జగన్నాథం తేలికగా నవ్వి అన్నాడు. "నిజమే, నా ఉద్దేశ్యం సరిగా అంతే. వివాహం అయినతరువాత మీరే ఆలోచించండి. చాలా కొద్దిమంది మీరు చెప్పిన ఒకస్త్రీ, ఒక పురుషుడు అన్నదానికి కట్టుపడి, సంఘానికి భయపడి తమ మనసులో నైజంని అస్వాభావికం, తప్పు అని నిర్ణయించి తమనితాము మోసగించి అన్యాయం చేసుకొంటున్నారు.

యిష్టంలేని చాలామంది యీకట్టుబాటును తమ మీద బలవంతంగా మోపిన సమాజం నిరంకుశత్వం నుంచి తెలివిగా తప్పించుకుని సంఘంని మోసగిస్తున్నారు పైకి తెలియకుండా.

"మీ అభిప్రాయం మొత్తంమీద ఏకీభవించకపోయినా చివరిమాటమాత్రం అక్షరాలా నిజం" రమణమూర్తి నవ్వి అన్నాడు.

"అందులోకూడా పురుషుడు ఎక్కువ అవకాశాలు పొందుతున్నాడు" ఈసారి శ్యామల కలుగజేసుకుని గట్టిగా అనేసింది నవ్వుతూ.

ఎంచేతనో తనకీ భార్యకీ మధ్యనున్న అసంఖ్యాకమయిన అనురాగపు బంధాలలో ఒకటి బలవంతంగా ఎవరో తెంపేసినట్లు బాధపడ్డాడు రమణమూర్తి. మొదటిసారిగా జగన్నాథం అంటే అతనికే అర్థం కాని భావం ఒకక్షణం హృదయంలో దోబూచులాడింది.

బలవంతంగా మనసులో ఆలోచన కడిగేసి అన్నాడు. "మీరెంత చెప్పినా సమాజం, వివాహవ్యవస్థ లేనిది స్త్రీకి రక్షణలేదు."

"నిజమే కొంతవరకు, కాని ప్రతిఫలంగా సమాజం హెచ్చుత్యాగం కోరుతోంది. కేవలం తమ ఆలోచనా స్వాతంత్ర్యం సమాజానికి అర్పించేసి సమాజం నిర్ణయించినవే సరయినవి అని అనుకున్నవారే వివాహ వ్యవస్థలో ఆనందం పొందగలుగుతున్నారు. మిగిలినవారు స్వతంత్రంగా తమకు కావలసినదేదో



తెలిసికోగలిగినా సమాజానికి భయపడి చేయలేక, చివరికి తాము నీతిగా బ్రతుకుతున్నామనే కృత్రిమపు సంతృప్తి నీడలో తలదాచుకుంటున్నారు.''

''కట్టుబాట్లు, డిసిప్లిన్ లేనిదే ఏ వ్యవస్థా నడవదు.''

''అందువల్ల మానసిక వ్యభిచారం పెరుగుతోంది. అదిమాత్రం సంతోషించతగ్గ విషయమా?'' జగన్నాథం కొంచెం ఆవేశపడ్డాడు.

''కాదు, కాని అది అల్పసంఖ్యాకుల బలహీనత''.

''అక్కడే మీ అభిప్రాయానికి నేను అంగీకరించను. అది అల్పసంఖ్యాకుల లోపంకాదు. అధిక సంఖ్యాకుల మనసులోని పచ్చికోరిక.''

రమణమూర్తి మాట్లాడలేదు. అస్తమిస్తున్న సూర్యుడినుంచి వస్తున్న రాగరేఖలు చూస్తూ వూరుకున్నాడు. పక్షుల గుంపులు నీటికి దగ్గరగా ఎగిరిపోతున్నాయి అందంగా.

''వివాహ వ్యవస్థ లేని సంఘం ఎలా ఉంటుందో చెప్పండి పోనీ.'' అడిగాడు.

''ఏమో! నాకూ తెలియదు. నేను వూహించలేను. ప్రస్తుత పరిస్థితిలో ఏదో విధంగా మార్పు రావాలని నా కోరిక. మనందరి సహజమయిన ప్రకృతి పైయటికి రావాలి. అటువంటి సమయం మనం వూహించగలిగే భవిష్యత్తులో రాదు. ఆమార్పు ఎటువంటిదో, ఎలా ఉండాలో నేను చెప్పగలిగినంత గొప్ప వాణ్ణి కాను. నా అభిప్రాయాలతో బాహ్యంగా మీరు ఏకీభవించేరోజు నేను బ్రతికుండగా రాదుకాని యిప్పుడు ప్రపంచంలో వస్తున్న మార్పులనిబట్టి ఆరోజు ఎప్పటికయినా వచ్చితీరుతుందని నమ్మకం కలుగుతోంది.'' జగన్నాథం నిర్లిప్తంగా అన్నాడు.

రమణమూర్తి మరేమీ అనకుండా వూరుకున్నాడు.

''అబ్బ! నీ తలలో యిన్ని ఆలోచన లున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది.'' శ్యామల నవ్వింది.

''హ్యూమన్ సైకాలజీ పుస్తకాలు చాలాం చివి వంటబట్టించుకున్నాను'' జగన్నాథం కూడా నవ్వాడు.

''యింక బయల్దేరవచ్చేమో.'' శ్యామల కొడుకుని ఒడిలోనుంచి భుజంమీదకి మార్చుకుంది.

యింటికివచ్చేసరికి ఆకాశంలో నక్షత్రాలు బయటపడ్డాయి. యిద్దరినీ యింటి దగ్గరదింపి జగన్నాథం వెళ్ళిపోయాడు.

రాత్రి భోజనాలు అయిన తరువాత పనులు పూర్తిచేసుకుని శ్యామలవచ్చేసరికి రమణమూర్తి వెల్లకిలా తలక్రింద చేతులు అమర్చుకుని చీకటిలో పడుకున్నాడు.

''యింకా ఆ విషయమే ఆలోచిస్తున్నారా?'' శ్యామల భర్త ప్రక్కలోనుంచి నిద్రపోయిన కొడుకుని వేరే మంచంమీద పడుకోబెట్టింది.

రమణమూర్తి నవ్వి వూరుకున్నాడు.

''అబ్బ! పచ్చి కమ్యూనిస్టులాగ మాట్లాడాడు కదూ.''

'జగన్నాథం పైకి కనబడని వ్యక్తిత్వం, దాగివున్న సుడిగుండంలా దగ్గరకి వెళ్ళినవారిని తనలో కలిపేసుకుంటుంది.' రమణమూర్తి మనసులో అనుకున్నది పైకి అనడానికి భయపడ్డాడు.

''స్వతంత్రంగా ఆలోచించే ప్రతివాడినీ కమ్యూనిస్టు అనడం పొరపాటు. అతని మాటలలో భావ విప్లవం ఉందికాని నాకు బాగా నచ్చాడు.'' రమణమూర్తి సంస్కారపు ముసుగు తెరికగా అబద్ధమాడింది.

''వింటున్నంతసేపూ మాత్రం తను చెప్పేది నిజమనిపించింది. తన మాటలలో ఆ ఎఫెక్టు ఉందికదూ'' శ్యామల ఆలోచిస్తూ అంది.

''ఊఁ అదే నా భయం'' ఒకక్షణం ఆగి భార్యను తనలో కలిపేసుకోవాలన్నంత ఆవేశంతో దగ్గరగా హత్తుకున్నాడు. ''శ్యామలా! నువ్వే నా సర్వస్వం.''

ఆమాటలు అర్థంకాలేదు సరికదా ఎన్నడూ ఎరగని భర్తలోని యీ మనస్తత్వం శ్యామలకి ఆశ్చర్యం కలిగించింది.

రమణమూర్తి కూడా తన మాటలలోని అస్వాభావికతను వెంటనే గుర్తించి వెంటనే చేతుల పట్టు సడలించి ప్రక్కకి తిరిగి పడుకున్నాడు మౌనంగా.

* * *

''ఏమిటిలా వచ్చావు?'' తలుపుతీసి చూసి జగన్నాథం నవ్వాడు.

''అంత ఆశ్చర్యం ఎందుకు? రాకూడదని నియమం ఉందేమిటి?'' శ్యామల తిన్నగా లోపలికివచ్చి కూర్చుంది.

''మరి యిన్నాళ్ళుగా రాలేదుకదా! అందులోనూ ఒంటరిగా.''

''నువ్వంటే నాకు భయంలేదని ఎప్పుడో చెప్పాను'' సోఫాలో వెనక్కి వ్రాలి కూర్చుని అంది.

''మీ అబ్బాయినేం చేసావు?'' మరొక కుర్చీలో నిండుగావున్న పేపర్లు తీసివేసి తనుకూడా కూర్చున్నాడు.

''నిద్రపోతున్నాడు. పనిమనిషికి అప్పచెప్పాను. ఎండ! వాడిని తీసుకువస్తే వాడికీకష్టం. నాకూ శ్రమ.''

పదినిముషాలు ఏదో మాట్లాడిన తరువాత జగన్నాథం పనివాడిని పిల్చి డ్రింకులు తెమ్మని డబ్బులిచ్చి పంపాడు.

"ఈ యింట్లో ఆడవాళ్లు లేకపోవడంవల్ల అతిథి మర్యాదలుకూడా నేనే చూసుకోవాలి."

"ప్రస్తుతానికి లేరు. ఎప్పటికీ ఉండరా?"

"ఏమో! ఎవరు చెప్పగలరు?"

"సరిసరిగా నీ అభిప్రాయాలతో ఏకీభవించే స్త్రీ లభిస్తే?"

జగన్నాథం జవాబు ఇయ్యలేదు. "మా యిల్లు చూపిస్తాను రా" లేచి నిలబడ్డాడు.

శ్యామల చుట్టూచూస్తూ అంది. "బాగా పెద్దిల్లు.

"బిజినెస్ బాగా ఉన్నప్పుడే కొనాలని కొనేసాను ఉన్న డబ్బంతా పెట్టి.

"యిప్పుడెలా ఉంది?

సంసారానికి...

"పర్వాలేదు. నా జీవితానికి కరువుండదు.

"యిదేమిటి? లైబ్రరీ యిూ? అబ్బ! యిన్ని పుస్తకాలు సేకరించావని తెలిస్తే రోజూ వచ్చేదాన్నే శ్యామల ఆశ్చర్యపోయింది.

"యిక్కడికి రానక్కరలేదు. నీక్కావలసినవి ఏకంగా పట్టుకువెళ్లు.

ఏదో పుస్తకం తిరగేస్తూ మధ్యలో ఆగిపోయింది. "నేనంటే అంత భయపడిపోతున్నావేమిటి? ఒకక్షణం తరువాత అన్నాడు. "యీ సమాజంలో నువ్వు వివాహితవు.

"నాకు తెలియని విషయం కాదు. శ్యామల మౌనంగా ఉండిపోయి తరువాత మెల్లిగా అంది. జగన్నాథం మరేమీ మాట్లాడకుండా హాల్లోకి నడిచాడు.

"ఆరోజు బాగా మాట్లాడావు. నువ్వు చదివిన పుస్తకాలు నాకు కూడా యియ్యి.

ఖాళీఅయిన డ్రింకుబాటిల్ బల్లమీద పెడుతూ జవాబిచ్చాడు. "మరొక విషయం ఏదయినా మాట్లాడితే నాకు సంతోషంగా ఉంటుంది.

"మరీ చిన్ని పాపాయినిచేసి మాట్లాడకు. నేను కూడా ఆలోచించగలనన్న సంగతి మరచిపోకు.

"సరే అయితే ఏ ఉద్దేశంతో అన్నావు చెప్పు" జగన్నాథం సూటిగా ప్రశ్నించాడు.

"మాట్లాడిన పద్ధతి బాగుందని అన్నాను కాని నీ భావాలన్నీ వచ్చి నిజం అనలేదుగా. జగన్నాథం వూరుకున్నాడు.

"నువ్వన్నట్లు నీ అభిప్రాయంతో బాహ్యంగా ఏకీభవించే వ్యక్తి యీ కాలంలో ఉండడు. శ్యామల మళ్ళీ అంది.

"బాహ్యంగా అన్న మాటవెనుక దాక్కుంటున్నావా? జగన్నాథం ప్రశ్నించాడు.

"సరే నువ్వన్నట్లు మరొక విషయం ఏదయినా మాట్లాడితే నాకు సంతోషంగా ఉంటుంది."

"అది యిద్దరికీ శ్రేయస్కరం" జగన్నాథం నవ్వులో గర్వం తొణికిసలాడింది.

తరువాత గంటలో యిద్దరూ ఏవేవో మాట్లాడారు అర్థం ఉన్నవీ అర్థం లేనివీ. కొంతసేపటికి యిద్దరికీ తెలిసిపోయింది తాము అసహజంగా మాట్లాడుతున్నట్లు, దేనినుంచో తప్పించుకోడానికి ప్రయత్నించి ఓడిపోయినట్లు.

"అబ్బ! బోరుకొట్టేసింది." మాట్లాడుతూ మధ్యలో విసుగ్గా ఆగిపోయింది చివరికి శ్యామల. నాకూ తెలుసు అని మాత్రం అన్నాడు జగన్నాథం.

యిద్దరూ మౌనంగా వుండిపోయారు.

చివరికి జగన్నాథం మెల్లిగా అడిగాడు. "నీ సంసారంలో నీకు అసంతృప్తి కలిగిందా?" శ్యామల ఆశ్చర్యపడినట్లు కనిపించలేదు. పైగా యిలాంటి ప్రశ్నకి ఎదురు చూస్తున్నట్లు జవాబు చెప్తేనే తన భారం తీరుతుందన్నట్లు నిశ్వసించింది. "నాకు తెలియదు. యిన్నాళ్ళు నేను అసలు అటువంటి ప్రశ్నకి సమాధానం ఆలోచించవలసివస్తుందని అనుకోలేదు. కాని ఆరోజు నీ మాటలు విన్న తరువాత నా హృదయంలో ఏదో పురుగు దొలుస్తుంది అనిపిస్తోంది. నాయిష్టం అభిరుచి ఏమిటో నాకు అర్థం కావడంలేదు. నా ఆలోచనలని పంచుకోడానికి ఎవరయినా తోడు అవసరమనిపిస్తోంది" తలవంచుకుని అంది.

జగన్నాథం అదోకలా నిట్టూర్చి వూరుకున్నాడు.

"ఆయన ప్రపంచంలో నాకున్న స్థానం చాలా తక్కువ. నా అభిప్రాయం తప్పు కావచ్చు. నాకు తెలియదు. తన మనసులో పేరుకున్న సంబంధం నాకు యిష్టం ఉండదు. నేనంటే తనకి పెద్ద అవసరం ఉన్నట్లు ప్రవర్తించరు. ఆయన ఎదురుగా ఉన్నప్పుడు నాని మా మధ్యన ఉంటే నాకు తృప్తిగా యింకేమి అక్కరలేదేమో అనిపిస్తుంది. కాని లేనప్పుడు నా మనసు బాగా ఒంటరిగా అయిపోయినట్లుగా బాధగా ఉంటుంది." శ్యామల సంకోచంగానే చెప్పేసింది.

జగన్నాథం ప్రోత్సాహకరంగా తల వూపాడు చెప్పమన్నట్లు.

"తనకి నేనుకాక మరొకసాధారణ స్త్రీ ఎవరు భార్యఅయిఉండినా ఆయనయిలాగే ఉంటారు. నాకు మాత్రం యింకా గుర్తింపబడాలని .... నేను చెప్పలేను" మధ్యలో ఆగిపోయింది.

"నీ భర్తనుంచి అధికంగా ఏం కోరుతున్నావు?"

"అదే నేను వూహించలేను. నాకే అర్థం కావడంలేదు. తనంటే నాకు ప్రేమలేకపోలేదు. కాని ఆయనకి పూర్తిగా దగ్గరికి చేరలేకపోతున్నాను. తను నాకు ఆ విషయంలో సహాయం చేయటంలేదు. ఆ మధ్యనుం గండిపేట వెళ్లిన రాత్రి మాత్రం." ఆవాక్యం పూర్తిచేయకుండానే మళ్ళీ అంది. "యీ

క్షణంలో నానుంచి తనకి పూర్తి తృప్తి ఉంది. నాకు ఏదో వెలితిగా అనుభవంలో పరిపూర్ణత లేదనిపిస్తోంది. నాకు తను సరయిన వ్యక్తి కాదేమో. నా మనస్తత్వం గ్రహించడానికి తను ఏనాడూ ప్రయత్నించలేదు."

"నువ్వు రమణమూర్తికి తగిన వ్యక్తివి కాకపోవచ్చుగా. తనుకూడా నీలాగే ఆలోచిస్తే" శ్యామల వెంటనే మాట్లాడలేదు. "నా ఆలోచనలు నన్ను భయపెడుతున్నాయి. నాలో ఏదో అసంతృప్తి ఉందని ఒప్పుకోడానికి కూడా సిగ్గుగా ఉంది." ఆమె మాటలు చాలా నీరసంగా వచ్చాయి. ప్రపంచం అంతటి నుంచి తనను దాచుకోవాలన్నట్లు ఎక్కడికో స్థిరం లేకుండా చూస్తూ అంది.

"శ్యామూ! నేను పొరపాటు చేశాను" జగన్నాథం మెల్లిగా అన్నాడు.

"లేదు లేదు నాగురించి నేను తెలుసుకునే అవకాశం నీమూలంగానే కలిగింది. ఎప్పటినుంచో నాలో యీ ఆలోచనలు బాధపెడుతున్నాయి. నీ మాటలవల్ల వాటి అర్థం ఏమిటో తెలుసుకోగలిగాను. అందుకు నేను బాధపడటంలేదు తలయెత్తి చూసి అంది.

"నీ ఆలోచనలన్నీ ఒకవైపుకే దారితీస్తున్నాయి. కేవలం నీ మనసు మార్పుకోరుతుందని నాభయం".

"వద్దు, నువ్వు నాకేమీ చెప్పొద్దు, నన్ను ఆలోచించుకోనీ" శ్యామల కంగారుగా అంది.

"శ్యామూ! యికమీద నువ్వూ నేనూ కలుసుకోవడం మంచిదికాదేమో. నీ మనసుకి విశ్రాంతి కావాలి. నన్ను చూసే అదినీకు లభించదని నాకు భయంగా ఉంది."

"నేను సక్రమంగా ఆలోచిస్తున్నానని నమ్మకం ఉన్నంతవరకూ ఏం జరిగినా వినాలనుంది. నాకీసమయంలో పూర్తిగా ఆలోచించుకునే అవకాశం పోగొట్టకు. మంచి పుస్తకాలు యియ్యి, చదువుతాను."

"యిప్పుడేనద్దు. కొన్నాళ్లు ఆగు. తరువాత యిస్తాను. చదివినదంతా క్రొత్తగా ఉందికదా అని నమ్మకూడదు. నీ స్వంత ఆలోచనాశక్తి వదిలిపెట్టకుండా ఉండగలిగే స్థిరమయిన మనసు కావాలి. నీకు అదిలేదు ప్రస్తుతం."

శ్యామల వూరుకుంది. యిద్దరూ మవునంగా కూర్చున్నారు: పదిహేను నిమిషాలు.

"నేను వెళ్తాను" శ్యామల నిలబడి లేచింది.

"నేను వచ్చి దిగబెడతాను" జగన్నాథం కూడా లేచి బట్ట సవరించుకుని వచ్చాడు.

రమణమూర్తి కొడుకుని ఎత్తుకుని వీధిలో నిల్చున్నాడు. చీకటిపడుతోంది అప్పటికి. "పెదు గంటనుంచి గుక్కపట్టి ఏడుస్తున్నాడు"

శ్యామల ఒక్క ఉదుటులో నానిని భర్త చేతుల లోంచి అందుకొని హృదయానికి హత్తుకుంది.

"లోపలకి రండి" రమణమూర్తి ఆహ్వానించాడు.

"మళ్లా వస్తాను" జగన్నాథం నీరసంగా నవ్వి మెట్లు దిగిపోయాడు. శ్యామల వెనక్కి తిరిగి చూడకుండా లోపలికి వెళ్లిపోయింది.

* * *

"ఎన్నాళ్లకి వచ్చావు మళ్లా" శ్యామల ముఖం వికసించింది.

"ఎలా ఉన్నావు? జగన్నాథం చుట్టూ చూస్తూ కూర్చున్నాడు.

అతని ప్రశ్నకు జవాబియ్యకుండా అంది: "ప్రతి రోజూ నువ్వు వస్తావని చూస్తున్నాను. చివరికి నేను నేనే వద్దామనుకుంటున్నాను. వూళ్లో లేవా?

"ఉన్నాను ముక్తసరిగా అన్నాడు.

"పోనీలే. యిప్పుడు అయినా వచ్చావు. ఒక క్షణం కూర్చో. డ్రెస్ చేసుకుని వస్తాను.

"ఎక్కడికి?

"తరువాత చెప్తాను. శ్యామల ఉత్సాహంగా లోపలికి వెళ్లిపోయింది. పది నిముషాలలో పూర్తిగా ముస్తాబయి వచ్చింది.

జగన్నాథం ఆశ్చర్యంగా చూశాడు. "ఎక్కడి కయినా బయటికి పోదాంపద. శ్యామల అంటూ అతని కుర్చీకి ఆనుకుని నిలబడింది.

"ఎక్కడికి?

"యీ మహానగరంలో ఎక్కడికయినా సరే షికారుకి పోదాంపోనీ.

జగన్నాథం ఏ నిశ్చయానికీ రాలేనట్లు చూశాడు ఏదో చెప్పబోయి చెప్పలేక ఆగిపోయాడు.

"నువ్వు ఎవరికి భయపడుతున్నావు? శ్యామల కొంచెం కోపంగా అంది.

"నేనెవరికీ భయపడను.

"అయితే నన్ను భయపెట్టడానికి ప్రయత్నించకు.

జగన్నాథం యింక మాట్లాడకుండా లేచాడు "అతను యింకో అరగంటలో యింటికి వస్తాడేమో.

"నా కోసం ఏనాడూ బెంగపెట్టుకోరులే. అయినా చీటి వ్రాసి ఉంచాను. యింట్లో పని మనిషి ఉంది ఏమయినా కావలసి వస్తే. నిర్లక్ష్యంగా అంది.

"మరి నాని?

"తను వస్తారుగా చూసుకుంటారు. వూరంతా నాతో కూడా ఎక్కడని త్రిప్పను? శ్యామల పట్టించుకోకుండా ముందుకి నడిచింది.

"ఎక్కడికి పోదాం? కారు స్టార్టు చేస్తూ అడిగాడు.

"ప్లాజాలో మంచి పిక్చరుంది. యీలోగా కావాలంటే ఎక్కడయినా టిఫిను తినొచ్చు. శ్యామల విశ్రాంతిగా సీటుమీదకి జారగిలబడిఅంది.

ఆ సాయంకాలం జగన్నాథంకి శ్యామల ఎప్పటి కంటె సంతోషంగా ఉంది అనిపించింది. సినిమా చూస్తున్నప్పుడు మధ్యలో ఆమె చేయి తాకినప్పుడల్లా జగన్నాథం తన చెయ్యి తీసేసుకున్నాడు.

శ్యామల చీకటిలోనే అతనికి దగ్గరగా జరిగి వచ్చింది. యింటర్వెల్ తరువాత అంతా తన తల అతని భుజంమీదకు ప్రక్కకి ఆన్చుకుని నిద్ర పోతున్నట్లుగా సినిమా చూసింది. ఉన్నా, కాలం గడుపుటకి అలవాటుపడిన జగన్నాథం శరీరం కూడా చివరికి నిగ్రహం సడలించింది.

తిరిగి వచ్చేస్తూ ఉంటే తన ప్రవర్తన కప్పి పుచ్చుకోవాలన్నట్లు మవునంగా కూర్చుంది శ్యామల.

"మెల్లిగా డ్రైవ్ చెయ్యి. చాలా హాయిగా ఉంది. చివరికి అంది.

కారు ట్యాంక్ బండ్ మీదుగా పోతోంది. హుస్సేన్ సాగర్ నీటి మీద నుంచి వస్తున్న చల్లగాలి ఒక ప్రక్కనుంచి దూసుకుపోతోంది. రాత్రి తొమ్మిది దాటటంచేత షికారుకి వచ్చినవాళ్లు నడచి వెళ్లే వాళ్లు తగ్గిపోయారు. కార్లు, సిటీ బస్సులు మాత్రం ఒకదాని వెంట మరొకటి పరిగెత్తుతున్నాయి.

"కొంచెం సేపు యిక్కడ ఆగి వెళ్దాం.


"యిప్పటికే ఆలస్య మయిందేమో చూసుకో.

జగన్నాథం ప్రక్కగా కారు ఆపి పార్క్ చేశాడు.

"పర్వాలేదులే. శ్యామల తన వైపు డోర్ తెరచి ముందు దిగింది.

రోడ్ క్రాస్ చేసి యినుప కమ్మి పట్టుకుని నీళ్ల లోకి చూస్తూ నిలబడింది. జగన్నాథం ట్రాఫిక్ ను తప్పించుకుంటూ వెనకాల వచ్చాడు.

సిటీలో లైట్లన్నీ హుస్సేన్ సాగర్ నీటిలో



సంస్కారానికి...

ందంగా ప్రతిబింబిస్తున్నాయి. నీళ్ళ కదిలినప్పు డల్లా పొడవుగా మెరిసే ప్రతిబింబాలు ముత్యా లుగా తునుకలుగా విడి పోతున్నాయి.

టాంక్ బండ్ పొడవునా ఉన్న నియాన్ లైట్ల నీలపుకాంతిలో చల్లదనం వెన్నెలతో పోటీ పడు తోంది.

"అతను నీకోసం ఎదురు చూస్తూ ఉంటా డేమో?

"హాయిగా నిద్రపోతూ ఉంటారు. నిన్న నైట్ డ్యూటీ చేశారు. నేను అసలు గుర్తుకి కూడారాను. జగన్నాథం మాట్లాడకుండా ఉండిపోయాడు.

"తనకి పేమంటు బాధలో ఆవేదన అర్థమవు తుంది కాని వెన్నెలలో ప్రేమించేవారి సన్నిధిలో ఆనందం అర్థం కాదు. అర్థమయినా అవసరం లేదనుకుంటారేమో.

"వివాహం అయిన నాలుగేళ్ళ తరువాత కూడా నీలో యింత తపన దాగి ఉందంటే ఆశ్చర్యంగా ఉంది. దూరంగా బంజారాహిల్స్‌మీద వెలుగు తున్న దీపాలవంక చూస్తూ అన్నాడు.

"సరిగ్గా అన్నావు. అది నా దురదృష్టం. శ్యామల తన చెవులకే వినపడనంత మెల్లిగా అంది.

పావుగంట తరువాత అన్నాడు "పోదాంపద.

ఆమె విననట్లు చూస్తూ ఉండిపోయింది. ఒక క్షణం తరువాత తన చెయ్యి కమ్మీమీద అతని చేతిమీద వేసి గటిగా పటుకుంది.

గాలికి చల్లబడిన యినుపకమ్మీ చల్లదనం ఆమె చెయ్యికంటె వెచ్చగా ఉంది అనిపించింది జగ న్నాథంకి.

"నేను చాలా పోగొటుకున్నాను. శ్యామల మాటలు బరువుగా బాధగా ధ్వనించాయి.

"శ్యామూ! నన్ను చాలా టెంప్ట్ చేస్తున్నావు. బలవంతాన నవ్వి తన చెయ్యి ప్రక్కకి తీసేసు కున్నాడు.

"ఆనంద పారవశ్యంలో నా మనసు పూర్తిగా కరగించే అనుభవం ఒక క్షణమయినా ఎవరయినా యియ్యగలిగితే ఆ క్షణంకోసం నా జీవితం అంతా వెచ్చించడానికయినా నేను సిద్ధమే. ఈ సారి కొంచెం ఆవేశంతో అంది. తన మాటలు అసం గతంగా, అసహజంగా వాస్తవిక జీవితంలో నాట కంలో పాత్ర సంభాషణలా ఉన్నాయని ఆమెకి తెలియలేదు.

"నువ్వు చాలా యింపల్సివ్. జగన్నాథం ఒక క్షణం చూసి అన్నాడు.

శ్యామల మవునంగా ఉండి పోయింది.

"చాలా రాత్రయింది. వెళ్లిపోదామా?

నడు. ఒకసారి శ్యామల అతని కళ్లలోకి చూసి నిటూర్చింది.

* * *

తరువాత మూడు నెలల్లో శ్యామలలో వచ్చిన మార్పు రమణమూర్తి బాధగా ఎప్పటికప్పుడు గ్రహిస్తూనే ఉన్నాడు. ఎప్పటిలా తనతో మాట్లాడదు. సరసమూ లేదు. విరాగమూ లేదు పలుకరిస్తే జవాబిస్తుంది లేకపోతేలేదు. అదికూడా తనముఖంలోకి చూసి మాట్లాడదు. తనేదోపరాయి వ్యక్తిలాగ ఎటోచూస్తూ జవాబు చెప్తుంది. నాని ఏడుస్తూ ఉన్నా ఎదురుగా కూర్చుని ఏదో ఆలో చిస్తూ వూరుకుంటోంది. తను చెప్తే అప్పటికి జ్ఞాపకం వచ్చినట్లు కొడుకుని దగ్గరకి తీసు కుంటుంది.

రమణమూర్తికి మనసులో బెంగపటుకుంది. ఏం చెయ్యాలో, ఏంచెయ్యకూడదో అనే మీమాంస మనసుని తినేస్తోంది. జగన్నాథం యధాప్రకా రంగా వస్తూ పోతూ ఉన్నాడు. యిద్దరూ ఎక్క డికో వెళ్తారు. శ్యామల ఆసమయంలో మాత్రం ఆనందంగా కనిపిస్తోంది. అందుచేత రమణ మూర్తి జగన్నాథం వచ్చేసమయానికి యింట్లో ఉండక పోవటం అలవాటు చేసుకున్నాడు.

ఎంత కాలం యిలా జరుగుతుంది? పర్యవ సానం ఏమిటవుతుంది? తను తిన్నగా భార్యతో మాట్లాడితేనే పరిస్థితి మెరుగవుతుందేమో దాగుడు మూతలకంటె.

ఆరోజు రమణమూర్తి లేని ఉత్సాహం తెచ్చు కుని యింటికి సాయంకాలం నాలుగింటికే వచ్చేసాడు.

శ్యామల మంచంమీద గోడకి ఆనుకునికూర్చుని ఏదో వీక్లీ చదువుతోంది. స్నానం చేసివచ్చి భార్య ఎదురుగా పనిఉన్నట్లు తిరిగాడు. 'యివాళ పెందరాళే వచ్చారేం? అని అడుగుతుందేమోనని ఎదురు చూసాడు. పావుగంట గడచినా అతని కోరిక నెరవేరలేదు.

శ్యామల అతనితో తనకేం సంబంధం లేనట్లు మవునంగా కూర్చుంది భర్తవైపు కూడా ఒకసారి చూడకుండా. రమణమూర్తి యింక తనని తాను నిగ్రహించుకోలేక పోయాడు. ఆమె తన భార్య పరాయి స్త్రీ కాదు. తనమూలంగా మాతృ మూర్తి అయింది!

ఒక ఉదుటున లేచి భార్య చేతిలో వీక్లీలాగేసి వంగి చెక్కిలిమీద ముద్దు పెటుకున్నాడు ఆవేశంగా. మరుక్షణం అతని ఆవేశం చప్పగా చల్లారింది.

శ్యామల ఒకక్షణం అతని కళ్ళలోకి నాతోపని అయిందా అన్నట్లు విరాగంగా చూసి మళ్ళీ ప్రక్కకి పడిపోయిన పుస్తకం అందుకుంది. రమణమూర్తికి ఒక్క చూపుతో, ఒక్కక్షణం అనుభ వంలో తనకీ, భార్యకీమధ్య ఏర్పడిన అఘాతం స్పష్టంగా కనపడింది. కాళ్లలో సత్తువపోయి నీరసం ఆవరించినట్లయింది.

మళ్లీ వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

"శ్యామలా! నీతో మాట్లాడాలి . క్షణం ఆగి అన్నాడు.

ఒకసారి ఆమె వీక్లీ తనే ప్రక్కకి పడేసి చూచింది.

"నువ్వు పూర్వంలా లేవు. మారిపోతున్నావు .

"ప్రపంచం రోజూ మారుతోంది. నేనూ మారు తున్నాను. నిన్నటిలాగే ఇవాళ ఎవరూ ఉండరు. ఉండలేరు. ఆమె జవాబుకి రమణమూర్తికి యింక మాట్లాడ వలసింది ఏమీ మిగులలేదు.

తరువాత యింకా మాట్లాడవలసింది ఏమ యినా ఉందా అన్నట్లు భర్తవంక చూసి అక్కడ నుంచి లేచింది.

"మనిద్దరం బయటికి వెళ్లి చాలా రోజు లయింది. యివాళ వెళ్దామని త్వరగా వచ్చాను. భార్యవంక ఆశగా చూసాడు.

"జగన్నాథం వస్తానన్నాడు. నాకోసం మీకిష్ట మయిన యితర పనులు మానుకో నక్కరలేదు. గుమ్మంలో ఆగి అనేసి వెళ్లి పోయింది



భారతదేశంలోని విద్యాసంస్థలని దర్శించేనిమిత్తం అమెరికన్ ఫీల్డ్ సర్వీస్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం క్రింద యిటీవల మద్రాసువచ్చిన ఏడుగ్గురు హైస్కూల్ అమ్మాయిలు, ఒక అబ్బాయి.

(ఇంకా వుంది)

సినిమా

శ్రీ రాజ్ ఆర్ట్సు పిక్చర్సు నిర్మిస్తున్న సమస్యాత్మకమయిన సాంఘిక చిత్రాన్ని శ్రీ కె. ఎస్. గోపాలక్రిష్ణన్ ఆంధ్ర ప్రదేశ్ ప్రేక్షకుల మనోఫలకంపై మరువ రాని ముద్ర నేర్పరచే రీతిలో మలుస్తున్నారు. ఈ కథను వ్రాసిందీయనే. ఈ కథను శ్రీ రామారావుకు వినిపించినప్పుడు ఆయన గోపాలక్రిష్ణన్ భుజాలను తట్టి సెభాష్ అన్నారని నిర్మాత శ్రీ సుంకరవల్లి వెల్లడించారు. తమిళ చిత్రాన్ని ఆయనే తన స్వంత స్టుడియోలో నిర్మిస్తున్నారు. తమిళ చిత్రపరిశ్రమలో శ్రీ కె. ఎస్. జి కున్న స్థానం అద్వితీయం. ఆయన దర్శకత్వం నెరపిన చిత్రాన్ని చూడడానికి జనం వేయికండ్లతో యెదురు చూస్తుంటారు. తమిళ ప్రేక్షకులచే విశేషంగా ప్రశంసింపబడుతున్న శ్రీ కె. ఎస్. జి.ని తెలుగునాట కూడ అసమానుడని నిరూపించాలనే తలంపుతో శ్రీ సుంకరవల్లి ఆయన్ను అంగీకరింప చేసారు.

తెలుగు చిత్రంయొక్క షూటింగు ఆగస్టు 1 న ప్రారంభమై అక్టోబరు 1 కి పూర్తయ్యేట్లు నిర్మాత ఏర్పాట్లు వేసుకున్నారు. దానికి తగ్గట్టు బిజీ ఆర్టిస్టులయిన శ్రీయుతులు ఎన్. టి. రామారావు, కృష్ణ, నాగభూషణం, రాజబాబు, విజయనిర్మల తమ కాల్‌షీట్లను యిచ్చారు. ఈ చిత్రంలోని ప్రధాన పాత్రల్లో ఒకదాన్ని శ్రీమతి సావిత్రి హాస్య భూమికను మీనాకుమారి ధరిస్తున్నారు. సంగీతాన్ని టి. వి. రాజు, ఆర్ట్సను కృష్ణారావు, కాస్ట్యూమును గాంధి నిర్వహించే ఈ చిత్రం దీపావళికి విడుదలౌతుందని నిర్మాత వ్యక్తపర్చారు.

రసస్పందన కలిగించే రాగాలాపన

ఈ చిత్రానికిగాను శ్రీమతి సుశీల పాడిన 'పోతున్నావా, నను విడచి పోతున్నావా' పాట రికార్డింగ్ విజయా గార్డెన్స్‌లో జరిగినప్పుడు, దాన్ని వినడానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఎం. ఎస్. విశ్వనాథం తన మిత్రులతోవచ్చి, ఆద్యంతం విని 'బ్రహ్మాండంగా వుందమ్మా, సుశీలా' అని మెచ్చుకున్నారని నిర్మాత చెప్తే నమ్మకం కుదరక 'ఆపాట కాస్త వినిపించండి' అని అడిగా. వెంటనే టేప్ రికార్డరు ఆన్ చేశారు.



'కలసివచ్చిన అదృష్టం'లో
కాంచన, రామారావు.

ఆ పాటయొక్క ఒక్కొక్క చరణం వింటుంటే చెరకు రసం త్రాగినట్టనిపించింది. సుశీలకూడ ఆ పాటను మూడు సార్లు విన్నదంటే దానిలోని మధురిమను మీరే వూహించుకోండి. ఈ చిత్రంలో టి. వి. రాజు 'సంగీతరాజు' అన్పించుకుంటారు అంటే అతిశయోక్తి లేదేమో.

* * *

శ్రీ రాజ్ ఆర్ట్సు పిక్చర్సు అధినేతకు అహం యిసుమంతయినా లేదు. ఇక మర్యాద విషయంలో పనివాండ్లను యెలా చూడాలో, వారివద్ద పని నెలా రాబట్టాలో గుర్తెరిగి వారిని మెప్పిస్తూ, తాను మెప్పొందుకుంటూ ఆదర్శ యజమాని అనిపించుకునే శ్రీ సుంకరవల్లి తన సహృదయంతో పరిశ్రమలో సుస్థిర స్థానాన్ని యేర్పరచుకో గలరని ఆశించవచ్చు.

ముక్కుమీద వేలు వేయించిన చుక్క నటన

మద్రాసుకు ముప్పై మైళ్ల దూరంలో చెంబాకం అనే గ్రామం వుంది. ప్రకృతి సిద్ధమయిన వృక్ష సంపదతో అలరారే ఆ ప్రదేశంలో ఒక కొలను: ఆ కొలనులో రోజారమణి బంతిని పారేసింది. నీళ్లలోతు మనకెలా తెలుస్తుంది. అలాంటప్పుడు ఆ పసిపాప యెలా నీళ్లలోకి దూకుతుంది?

సినిమా డైరీ

● నిర్మాత శ్రీ సి. ఎస్. రాజు నిర్మించే సాంఘిక చిత్రానికి ఎస్. డి. లాల్ దర్శకునిగాను, కె. ఎస్. ప్రసాద్ ఛాయాగ్రాహకునిగాను, టి. వి. రాజు సంగీత దర్శకునిగాను నియమించబడ్డారు. ముఖ్య పాత్రను శ్రీ ఎన్. టి. రామారావు ధరిస్తారు.

● ప్రముఖ నిర్మాత శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్ తెలుగులో నిర్మించనున్న మొదటి చిత్రంలో శ్రీ రామారావు నటిస్తారు, దర్శకత్వాన్ని శ్రీ సి. ఎస్. రావు నిర్వహిస్తారు.

● ఎ. వి. ఎం. నిర్మించిన "రాము" వసూళ్లలో రజతోత్సవ చిత్రాలను మించిపోయింది. వారు నిర్మించే "మూగ నోము" షూటింగు త్వరితగతిన జరుగబోతుంది.

● కౌముదీ ఫిలింస్ నిర్మించే చిత్రంయొక్క షూటింగు వీనస్ స్టుడియోలో రాత్రింబగళ్లు జరుగుతూంది. ఈ వారంలో వాణిశ్రీ, బేబి శాంతికళ, రేలంగికి సంబంధించిన దృశ్యాలను శ్రీ కమలాకర కామేశ్వరరావు చిత్రించారు,

● డి. బి. ఎస్. ప్రొడక్షన్స్ చిత్రాన్ని శ్రీ వి. రామచంద్రరావు డైరెక్టు చేస్తారు. నాయకీ నాయకులుగా విజయ నిర్మల, కృష్ణ నటిస్తారు.

● విజయా గార్డెన్స్‌లో ఎస్. వి. ఎస్. నిర్మించిన "కలసి వచ్చిన అదృష్టం" రి–రికార్డింగ్ జరిగింది.

● రేఖా అండ్ మురళీ ఆర్ట్సు నిర్మించే "శ్రీరామ కథ" షూటింగును శ్రీ నాగేశ్వరరావు చూచి పద్మనాభంను ప్రశంసించారు.

● పి. ఎస్. అరోరా నిర్మించనున్న ఈస్టుమన్ కలర్ చిత్రంలో సాధన, రాజేష్ ఖన్నా మొట్టమొదటిసారిగా నాయకీ నాయకుల భూమికల్ని ధరిస్తున్నారు.

● కల్పనా చిత్ర తమ రెండవ చిత్రానికి "ప్రేమలు — పెళ్లిళ్లు" అని పేరు పెట్టారు. ఈ చిత్రానికి కెమరాను కె. ఎస్. ప్రసాద్, ఆర్ట్సును సూరన్న నిర్వహించడానికి నియమించబడ్డారు. ఈ చిత్రాన్ని బాబూరావు నిర్మిస్తున్నారు.

దూకితే ప్రాణాలతో బయట పడుతుందా? మరి ఆ బంతి కావాలని మారాం చేసింది ఆ పాప కోరికను తీర్చేందుకని చలం అందులోకి దూకుతాడు. కానీ అతనికి ఈత రాదు పాపం. మునిగిపోతాడు. విజయలలిత కాపాడి గట్టుకు చేర్చింది విజయలలితతో బాటు రెండడుగుల సీమ కుక్క కూడ నీళ్లలోకి దూరి బంతిని నోటికి కరుచుకుని రోజారమణికి తెచ్చి యిస్తుంది. ఈ ఘట్టంలో కుక్క నటించిన విధం షూటింగులో పాల్గొన్న అందర్ని ఆశ్చర్య చకితుల్ని చేసింది. దర్శకులు శ్రీ బాలచందర్ టేక్ అన్నారో లేదో కుక్క తన యాక్టింగును చక్కగా ప్రదర్శించి ఫస్టు టేక్‌లోనే ఓకే అనిపించుకుంది. ఇది అతిశయోక్తి అని భావించేరు సుమా! నిర్మాత ప్రసాద్ నన్ను ఆ ప్రదేశానికి తీసికెళ్లాడు. కళ్లారా చూచిన దాన్ని మీకు తెల్పాలిగా. అందుకే వున్న దున్నట్లు రాపా.

*　　*　　*

ఎన్. టి. రామారావు సజ్జనుడు, సంఘసేవా పరతంత్రుడు. ఒక రోజు వీధిలో నుంచి ఒక మేడలోకి ప్రవేశిస్తాడు.



'శ్రీరామకథ'లో శారద.



పాత బొమ్మలు - కొత్త కబుర్లు

ఈ ఫొటోలో మంచం మీద కూచున్నావిడ అంజలీదేవి అని మీరు చటుక్కున గుర్తుపట్టేసి ఉంటారు. మరి ఆ పడుకున్న వ్యక్తి? తక్కున చెప్పుకోండి. చూద్దాం!

ఆ మంచం మీద పడుకున్న మనిషి రేలంగి. అంజలీదేవి, రేలంగి కలసి ఒకే ఒక చిత్రంలో నాయకీ నాయకులుగా నటించారు. ఆ చిత్రం పేరు 'పక్కయింటి అమ్మాయి.' 1953లో సి. పుల్లయ్యగారి దర్శకత్వంలో వచ్చిన యీ చిత్రం, అన్ని చిత్రాల లాగా హైదరాబాద్, మద్రాసుల్లో తయారవలేదు. కలకత్తాలో తీశారు.

పక్కయింటి అమ్మాయే గదా ఎంత సేపు ప్రేమించేసెయ్యడం అనుకుని వెంటనే ఆ అమ్మాయి మీద మనసు పారేసుకుని మమత పెంచేసుకున్నాడు. ఈ అబ్బాయి అల్లరి చేష్టలూ, చిలిపితనం భరించలేక కొంత మంది రౌడీలకు డబ్బిచ్చి ఊరికె బెదిరించమంది. వాళ్లు అలాగేనని తల చిల్లు పడేదాకా, స్పృహ తప్పేదాకా కొట్టి పోయారు. నెమ్మదిగా తలకు కట్లు అవీ కట్టి తెలివిలోకి వచ్చాక వాళ్లమ్మ బుజ్జగించి అడిగింది, 'ఎవరు చేయించార్రా వాయనా యీ పని?' అని. అమ్మాయి మీద ఉన్న మనసు చేత, మక్కువ చేత — ఆమె చేయించిందని తెలిసినా చెప్పలేదు. అది విన్న అమ్మాయి అతని మంచితనానికి, సంస్కారానికి కరిగిపోయి పరుగున వచ్చింది చూడటానికి...ఇదీ సందర్భం!

*　　*　　*

'అప్పట్లో బిజినెస్ లైక్‌గా ఉండేవారు కాదెవరూ. పనిపట్ల ఎక్కువ ఉత్సాహం కనపరచి చేసేవారు. అందరి మధ్యా ఎంతో ఆప్యాయత ఉండేది. మంచి పాత్రలు కావాలనీ, బాగా చెయ్యాలనీ అభిలషించేవాళ్లం. ఒక సెట్లో పని చేస్తున్నామంటే అందరి మధ్యా చక్కని సహకారం ఉండేది. డబ్బుకంత ప్రాముఖ్యత లేదప్పుడు. ఆర్టిస్టులకు 'రెమ్యూనరేషన్స్' తక్కువగానే ఉండేవి. 1955 నుంచి అనుకుంటాను — రెమ్యూనరేషన్స్ పెరగటం ప్రారంభం అయింది పరిశ్రమ బాగా పెరిగి అభివృద్ధి అవటంకూడా నిజానికి అప్పటినుంచే! అన్నారు శ్రీమతి అంజలీదేవి; ఆ రోజుల్ని స్మృతిపథంలోకి తెచ్చుకుంటూ.

—మోహన్‌కుమార్

బుసకొడ్తూ మేడపై వున్న పెద్ద మనుష్యుల్ని కొరకొర చూస్తాడు. ఏమిటీ హఠాత్పరిణామం యీయనలో అనే సమస్య మీకు తలెత్తొచ్చు. ఇది వారి స్వగృహంలోనో, నిత్యజీవితంలో జరిగింది కాదు. గోపాలక్రిష్ణా పిక్చర్స్ నిర్మిస్తున్న పెంఫుక చిత్రంలో యిలాంటి సన్నివేశం ఒకటుంది.

రామారావు : మా వదినను, పిల్లల్ని యింట్లోంచి వెళ్ళగొడ్తావా! నిన్నే దేముడని నమ్ముకున్న వా అన్నయ్యకు అన్యాయం చేస్తావా; అభం, శుభం తెలియని అమాయకుడ్ని బలి చేస్తావా. నీకు కక్ష వుంటే నాపై సాధించు అని కోపావేశంతో మాట్లాడిందెవర్తో తెలుసా? మరెవ్వరో కాదు. చిత్ర చిత్రానికీ మీ అభిమానాన్ని అపారంగా చూరగొంటున్న నాగభూషణం తానే.

'అడపడుచు' చిత్రాన్ని అందరూ మెచ్చుకునే విధంగా చిత్రించిన హేమాంబరధరరావే యీ చిత్రాన్ని మన మనస్సుల్లో అనుహ్యమయిన అనుభూతిని కల్గించే విధంగా చిత్రిస్తున్నారు. దర్శకుడు కోరిన ఎఫెక్టును క్షణాల్లో చూపిస్తున్నాడు కెమెరా స్వామి. సన్నివేశం యొక్క ఔచిత్యానికి తగినట్లు బి. ఎన్. కృష్ణ సెట్లను నిర్మిస్తున్నాడు. కథా ప్రాముఖ్యతకు టి. వి. రాజు సంగీత శాఖ సమాన ప్రతిపత్తిలో సాగిపోతూంది. ఈ చిత్రంలో జయలలిత నాయిక. ఆమెకు సంబంధించిన దృశ్యాలను సెప్టెంబరు నుండి చిత్రీకరిస్తామని నిర్మాత గోపాలక్రిష్ణ వ్యక్తపర్చారు. నేను వివరించిన

సినిమా

సన్నివేశం ప్రసాద్ స్టుడియోలో చిత్రీకరణ జరిగింది.

* * *

ప్రసాద్ నుండి వెళ్తూ యెదురుగా వున్న భరణిలోకి వెళ్ళా. ఆహా! యెంత మధుర సన్నివేశం. రాకపోతే మిస్ అయ్యేవాడ్నే అని మరింత దగ్గరగా వెళ్ళి చూసా. ఏమిటబ్బా అంత 'యిది'ని కల్గించింది అని మీరడుగుతారు!

సెట్టుకి దిగి వచ్చిన స్వర్గలోకం

అది పరమ పవిత్రమయిన బృహస్పతాశ్రమం. ఆ దేవముని అర్ధాంగి తార. ఆయన శిష్యుడు చంద్రుడు. యౌవనం అడవి కాచిన వెన్నెల అయింది అని బాధపడుతున్న సమయంలో మన్మథ బాణాడిలా వూడిపడ్డాడు చంద్రుడు. ఒక రోజున దేవేంద్ర సభకు బృహస్పతి వెళ్తాడు. తార పడక గదిలో ఒక మూల వయ్యారంగా నిలబడి, కామదృక్కులతో చంద్రుడ్ని తదేకంగా చూస్తుంది. ఆమె చూపులకి చంద్రుడు అయస్కాంతంలా ఆకర్షింపబడ్తాడు. మనస్సులో కోరికలు పెల్లుబికాయి. తారా, చంద్రులు బిగికౌగిలో స్వర్గ సుఖాల్ని ఆనందించారు. ఆ ఆవేశంలో మైమరచి తన్మయత్వంలో అమర సుఖాన్ని పొందే మధురాతి మధురమయిన సమయంలో బృహస్పతివచ్చి ఆ దృశ్యాన్ని చూచి మండి పడ్తాడు. ఈ సన్నివేశంలో తారగా దేవిక, చంద్రుడిగా— శోభన్‌బాబు, బృహస్పతిగా గుమ్మడి సహజంగా నటించారు. శ్రీ మానాపురం అప్పారావు దర్శకునిగా సత్యం ఛాయాగ్రహణంతో ప్రతి సన్నివేశం నిండుగానూ, కన్నుల పండువుగానూ వస్తున్నట్లు నిర్మాత సత్యనారాయణ వెల్లడించారు. దేవేంద్రలోకం సెట్టును రాజేంద్రకుమార్ తన హస్తలాఘవంతో



'వింతకాపురం'లో పద్మనాభం, రమాప్రభ.

మీకు తెలుసా?

ప్రముఖ నిర్మాత, దర్శకుడు హాస్య నటుడు శ్రీ పద్మనాభం మద్రాసు వచ్చి సినిమాల్లో చేరినప్పుడు (మొదట్లో) వాడిన సైకిలును యింకా తమవద్దనే భద్రంగా ఉంచుకున్నారు.

నిర్మాణ నిర్వాహకుడు శ్రీ ఆనంద మోహన్ 31 మైళ్ళ వాకింగ్‌రేసులో ఆంధ్రప్రదేశ్‌కి ఫస్టుగానూ, ఇండియాలో నాల్గవవాడిగానూ నిర్ణయించబడ్డాడు.

హాస్యనటుడు శ్రీ బాలకృష్ణకు కోతికొమ్మంచి ఆడడమంటే యిప్పటికీ సరదా అట.


నేపథ్యగాయకుడు శ్రీ పి. బి. శ్రీనివాస్‌కు తను పాడిన పాటలను ఒకటికి రెండుసార్లు (రోజు కి) వినడం ఒక సరదా.

మేకప్ ఆర్టిస్టు శ్రీ భద్రయ్య మంచి గాయకుడేకాక చక్కటి రంగస్థల నటుడు కూడా.

బేబి రోజారమణికి పెదిమల క్రింద వుండే నల్లటి పుట్టుమచ్చే అదృష్టాన్నిచ్చిందట.

హాస్యనటుడు శ్రీ రాజబాబు రెండు మూడు మాసాల్లో ఒక బంగళాను కొనే ప్రయత్నంలో ఉన్నాడు.

శ్రీయుతులు ఎస్. సూర్యనారాయణ, ఎస్. అప్పారావు, వి. పట్టాభి, వెంకటేశ్వరరావుల సహకారంతో నటుడు శ్రీ జగ్గారావు మద్రాసులో నిటినగర్‌లో 'హోటల్ మధు'ని నెలకొల్పారు.


జనరంజని ఫిలింస్ వారి
పల్లని నీడ
దర్శకత్వం
తాతినేని రామారావు
నిర్మాణం:
డా. కె.వి. సుబ్బయ్య · చలపతిరావు
విడుదల. ఆంధ్ర, రాయల రాయలసీమ జయలక్ష్మి, తెలంగాణా డీషా
KE

పరిచయం:



రూపశిల్పి

పోతరాజు

1947లో పుబుసుపోకగా మద్రాసుకు వచ్చిన పోతరాజు 1957కి మేకప్‌రాజు అయ్యాడు. ఈ విచిత్ర పరిణామం ఎలా జరిగిందో తెలుసా?

ప్రముఖ నటుడు శ్రీ ఎస్. పి. రాజారాం నాయుడుతో మద్రాసుకు సినిమా యెలా తీస్తారో చూడాలని వచ్చాడు. అప్పుడు రాజుకు సరిగ్గా పదేండ్లు. ప్రముఖ రూప శిల్పులయి శ్రీయుతులు గోపాలరావు, మంగయ్య దగ్గరబంధువులవడంతో వాళ్ళయిండ్లకు వస్తూ పోతూ వుండడంతో యీ కుర్రాడికి రూపాలంకరణపై గురి యేర్పడింది. వాళ్ళవద్ద క్రమక్రమంగా నేర్చుకుంటూ "అంతామనవాళ్లే", "రోజులుమారాయి" చిత్రాల్లో తన స్వయం ప్రతిభను చూపెట్టి సెభాష నిపించుకున్నాడు. అంజలిపిక్చర్స్ చిత్రాలకు మేకప్ శాఖను నిర్వహించాడు. "సువర్ణ సుందరి"లోని రాక్షసుడి పాత్రకు గుమ్మడికాయంతటి గుండు తలను, దీర్ఘమయిన ముక్కులను ప్లాస్టిక్ మేకప్‌తో తయారు చేసి మెప్పించడు.

1958లో సారథి స్టూడియోకెళ్ళిఅక్కడ షుమారు 15 చిత్రాలకు సక్రమంగా పనిచేసి 1962లో మరలా మద్రాసు చేరుకున్నాడు. తనేమో, తన పనేమో తప్ప అనవసర విషయాల జోలికి పోయే అలవాటు లేదు. ఇప్పటికి నూరు చిత్రాలకుపైగా పోతరాజు స్వహస్తాలతో విభిన్న పాత్రలకి వైవిధ్యంగల రూపాన్ని అలంకరించి రంజింప చేసారు. క్రమశిక్షణ, వృత్తిలో ఆసక్తి ఉన్న పోతరాజు ముందు ముందు యింకా అభివృద్ధి సాధించగలడని ఆశించవచ్చు.

భులోకానికి తీసుకొచ్చారనడంలో అతిశయోక్తి లేదు.


'మంత్రాలకి చింతకాయలు రాలాయా?'

దేవికను ఈ సెట్టులో చూచినపుడు నా కళ్లను నేనే నమ్మలేక పోయాను. శరీరంలో ఎంతమార్పు; ముఖంలో యెంత వర్చస్సు; కళ్లల్లో యేదో అనూహ్యమయిన కళాకాంతి; నడుం తీగెలా ఎలా అయిందబ్బా అనే ప్రశ్న పదే పదే నన్ను వేధించింది. సరే ఆమెనే అడిగి తెల్సుకుందామని నా మనస్సులోని విషయాన్ని బయటపెట్టా. ఉండబట్టలేక 'మీరేదయినా దివ్య ఓషధి సేవయినా సేవిస్తున్నారా' అని ప్రశ్నించా. నా ప్రశ్నకు పకపక నవ్వింది దేవిక. 'ఏమిటండీ మీ చాదస్తం. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? ఆ మధ్య శరీరం కాస్త బరువనిపించింది. తగ్గడానికి వ్యాయామాన్ని మించిన సాధనం లేదని మధ్యలో విడచిపెట్టినదాన్ని మళ్లీ ప్రాక్టీసు చేసా. రెండు పూటలు భోజనం మానేసి, గోధుమ రొట్టె ఒకటో, రెండో తింటున్నా' అంది తాపీగా.

* * *



'నడమంత్రపు సిరి'లో
విజయనిర్మల, హరనాథ్.



'అగ్గిమీద గుగ్గిలం'లో
రామకృష్ణ, విజయలలిత.

భరణినుండి వాహినికి వచ్చా. అక్కడ 'నడమంత్రపుసిరి' షూటింగులో విజయనిర్మల, హరనాథ్ వున్నారని విని సెట్టులోకి వెళ్లా.

హరనాథ్, విజయనిర్మలను గాఢంగా ప్రేమిస్తాడు. చదివేది కాలేజి — అయినా ధ్యాస అంతా ప్రియురాలి మీదే. ఇంట్లో హరనాథ్ తన తల్లి మాలతి కళ్ళుగప్పడానికి సర్వదా యేదో పుస్తకాన్ని చదువుతున్నట్లు నటించడం అలవాటు చేసుకున్నాడు. అలవాటు ప్రకారం ఒకరోజున హరనాథ్ తన పుస్తకంలో విజయనిర్మల ఫోటోను చూచి మురిసి పోతుంటాడు. ఆ సమయానికి తన ప్రియురాలు అక్కడికి వస్తుంది. హరనాథ్ చేతిలోని పుస్తకం జారుతుంది. అందులోని ఛాయా చిత్రం క్రింద పడుతుంది. ఆ ఫోటోను యిద్దరూ తీయబోయి తల బాదుకుంటారు. అబ్బా అంటుంది విజయనిర్మల. ఈ మాత్రానికే యింత అయితే మున్ముందు ఎలా సోస్తావ్ అని వేళాకోళం చేస్తాడు హరనాథ్. ఈ రసవంతమయిన సన్నివేశాన్ని దర్శకులు తాతినేని రామారావు రసవంతంగా చిత్రించారు. శ్రీ నందనం, సాంబశివరావులు నిర్మించే ఈ చిత్రం యొక్క షూటింగు దాదాపు పూర్తయినట్లే. శ్రీ చలపతిరావు కూర్చిన సంగీతం వీనుల విందుగా వుంది

ఒక్క రుతప్ప అంతా కొత్తవారే

అన్నపూర్ణా ఎంటర్‌ప్రయిజస్ అనెడి నూతన చిత్ర నిర్మాణ సంస్థ 'విష వలయం' అనెడి కొంగ్రొత్త పోకడలు గల్గిన ఔట్ డోర్ చిత్రాన్ని నిర్మించారు. చడీ, చప్పుడు లేకుండా నిర్మాణాన్ని ప్రారంభించి రెండు మాసాల్లో షూటింగును ముగించి, తక్కువ పెట్టుబడిలో నిర్మాణాన్ని సక్రమంగా సంపూర్తి చేసారు. ఈ చిత్రాన్ని ఎస్. వి. ఎస్. రామారావు 1 లక్ష ముప్పై రెండు వేల రూపాయల్లో ముగించారంటే విన డానికే ఆశ్చర్యంగా వుంది కదూ! ఈ చిత్రంలో ఒక్క రమణమూర్తి తప్ప మిగతా పాత్రధారులందరూ వెండితెరకు నూతనంగా పరిచయం చేయబడిన వారే. ఈ మధ్య ఈ చిత్రం రష్ చూచే అవకాశం కల్గింది మీరు నమ్మండి, నమ్మక పోండి చిత్రం చూస్తుంటే హాలివుడ్ చిత్రం జ్ఞాపకం వచ్చింది. మీరూ చూస్తారుగా. మీ నిర్ణయమే వాళ్లకు కావల్సింది.

దృశ్యంలో దుఃఖం

ఎప్పుడూ ఆనందంగా కన్పడే రాజశ్రీని శోకంలో చూసేసరికి ఏమిటమ్మా అని ప్రశ్నిద్దామనుకున్నా. నేను యేదయినా అశుభం పల్కబోతానేమోనని నిర్మాత పూర్ణచంద్రరావు నా వీపు తట్టి 'యిలా మా చిత్రంలో ఒక సీనులో రాజశ్రీ కంట తడి పెట్టాల్సి వస్తుందండీ' అన్నారు. తీరా అంత దూరం వెళ్లి విషయం యేమిటని తెల్సుకుంటేనేగా మీకు చెప్పగల్గేది!


రాజశ్రీ గారాబంగా పెరిగిన రాకుమార్తె. చిన్న తనంలోనే తల్లిని పోగొట్టుకుంది ఇప్పుడు ఆమెకు తల్లి, తండ్రీ, గురువు, దైవం, ప్రాణం అన్నీ తండ్రీ. మరి ఆ తండికి యేదయినా అవాంతరం జరిగితే ఆ కుసుమకోమలి హృదయం ఎలా తల్లడిల్లిపోతుందో మీరే వూహించండి. రాజశ్రీ తండ్రి పాత్రను గుమ్మడి పోషిస్తున్నారు. నిజంగానే రాజశ్రీ తండ్రి పరమ పదించారా లేక యెవరయినా పన్నాగం పన్ని యిలా కల్లబొల్లి కబురు లేవదీసారా అనెడి ప్రశ్నకు సమాధానం నవభారత్ ఫిలింస్ 'అగ్గిమీద గుగ్గిలం' చిత్రం చూస్తే మీకే తెలుస్తుంది. ఈ చిత్రానికి జి. విశ్వనాథం దర్శకుడు తే, వేణు ఛాయాగ్రాహకుడు.

* *

స్టూడియో సంచారం ముగించుకుని తిరుగుముఖం పట్టినప్పుడు ఆర్కాటు రోడ్డు లోని ఒక మూలన వున్న గదిలో సురటి దుర్గారావు యేకాంతంగా దీర్ఘాలోచనలో వుండడాన్ని చూచి 'ఏమిటండీ అలోచిస్తున్నారే' అని ప్రశ్నించా. 'అబ్బే ఏం లేదండీ. నేను మద్రాసుకు వచ్చింది వేషాలు వెయ్యడానికి. అందరి అభిమానం, ఆదరం నన్ను ఒక డాక్యుమెంటరీ నిర్మాతను చేసాయి. పేరు మోసిన డాక్యుమెంటరీలను నిర్మించి పెద్దల ఆశీర్వాదాల్ని అందుకున్నా. మొన్న కూడా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ నా డాక్యుమెంటరీలను ప్రత్యేకంగా ప్రదర్శన యేర్పాటు చేసినప్పుడు వీక్షించారు.' అన్నారాయన. 'మరి చీకూ, చింతా యెందుకండీ' అన్నా. 'అదికాదండీ. ఇన్ని సంవత్సరాలుగ పరిశ్రమలో వుంటూ యింత మంది పెద్దల ప్రోత్సాహం లభిస్తూ కూడా ఒక మంచి చిత్రాన్ని నిర్మించలేక పోతున్నానే అనే బాధ యిలా మిగిలి పోవల్సిందేనా' అని ఆలోచిస్తున్నా నన్నా రాయన.

చిత్రం ద్వారా సందేశం

ఆర్కాటు రోడ్డు నుండి భగీరథమ్మాళ్ వీధికి టాక్సీని మరల్చా. ఎందుకని అడగరేం? అక్కడే సారథి స్టూడియో చిత్రానికి సంబంధించిన కార్యక్రమం కొన సాగుతూంది. 32 నెంబరులోకి వెళ్ళా.



'నిన్నే పెండ్లాడుతా'లో భారతి, రామారావు.

ఆఫీసులో వున్న శ్రీ శాస్త్రి ఆప్యాయంగా కుర్చీ చూపెట్టి తమ చిత్ర వివరాలను క్రింది విధంగా వెల్లడించారు.

శ్రీ దుక్కిపాటి మధుసూదనరావు నిర్మాతగా ఆగస్టు ఫస్టు నుండి సారథి స్టూడియో చిత్రం షూటింగు ప్రారంభమౌతుంది. ప్రస్తుతం మద్రాసులో పాటల రికార్డింగ్ జరుగుతూంది. నాయకీ, నాయకులుగ వాణిశ్రీ, నాగేశ్వరరావు నటిస్తున్నారు. ఇతర ముఖ్య పాత్రలను గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, చంద్రమోహన్, విజయనిర్మల, చంద్రకళ, సూర్యకాంతం పోషిస్తారు. సంభాషణలను పినిసెట్టి వ్రాసారు. సంగీతాన్ని రాజేశ్వరరావు వినిపిస్తున్నారు. కెమెరాను సెల్వరాజ్, అర్టును జి. వి. సుబ్బారావు నిర్వహిస్తారు. ఆంధ్ర ప్రేక్షకులకు ఈ చిత్రం ఒక చక్కటి సందేశాన్ని యివ్వగలదని ఆశిస్తున్నాం, అన్నారు అసోసియేట్ నిర్మాత శాస్త్రి. మరి దర్శకు లెవరని అడుగరేం? ఇంకెవరు? బాక్సాఫీస్‌ను బద్దలుకొట్టే వి. మధుసూదనరావే.

చిన్న తారలతో చిత్రం

ఆదే వీధిలోగల విజయభట్ మూవీస్ ఆఫీసు కెళ్ళా. లోపల అధినేతల్లో ఒకరయిన ఏకామ్రేశ్వరరావు యేదో స్క్రిప్టును తిరగేస్తూ, నన్ను చూసి సాదరంగా ఆహ్వానించారు. 'ఏమిటిసార్, గట్టిగా పని తగిలినట్టుందే' అన్నా. 'ఆ...కాస్త... మరేం లేదు కన్నడం పిక్చర్ విడుదలకు

ఆటలు



ఔత్సాహికులు, వృత్తి క్రీడాకారులు పాల్గొనే ఆసియా ఛాంపియన్ షిప్స్ పోటీలు ఈ సంవత్సరం డిశంబర్, వచ్చే ఏడాది జనవరి నెలలలో జరగాల్సి ఉంది. కానీ భారతదేశం వాటిని నిర్వహిస్తుందనటం సందేహాస్పదమే అని ఆలిండియా లాన్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ కార్యదర్శి ఆర్. కృష్ణన్ అన్నారు. వృత్తి క్రీడాకారుల సంఘం ఒప్పందం ప్రకారం ఆరుగురు ఆటగాళ్లని తీసుకు రావడానికి అయ్యే ఖర్చు 25,000 నుంచి 30,000డాలర్ల (యు. ఎస్)కి పరిమితమై ఉంది అని ఆయన అన్నారు. కానీ ప్రయాణం, బస తదితర సదుపాయాలకి మరి కొంత ఖర్చవుతుంది. మొత్తం ఐలక్షల రూపాయలవుతుందని అంచనా. ఈ మొత్తం చాలా ఎక్కువగా కన్పిస్తుందని నేనుకూడా ఒప్పుకుంటాను.

పదేళ్లక్రితం మొట్టమొదటిసారిగా ఒక వృత్తి క్రీడాకారుల బృందం మద్రాసు వచ్చినప్పుడు 4 ఆటగాళ్లకి రు. 30,000 యివ్వాల్సి వచ్చింది. అలాంటప్పుడు ప్రపంచంలో అగ్రస్థానం అందుకున్న ఆటగాళ్ల విషయంలో ఆ ఖర్చు అంత పట్టించుకోవాల్సిన అవసరం లేదనుకుంటాను.

పెద్ద ఆటగాళ్లని ఆహ్వానించినప్పుడు ఖర్చు కూడా పెద్దగానే ఉంటుంది. కనీసం ఆరుగురు ఆటగాళ్లని ఆహ్వానించాలని వృత్తి క్రీడాకారుల సంఘం పట్టుపట్టటం కూడా సమంజసమే.

కానీ ఈ శ్రమా ఖర్చు భరించడంలో అర్థం ఉంది. ఔత్సాహికులకి వృత్తి క్రీడాకారులకి మధ్యఉంటే విభేదాన్ని రూపుమాపటంలో భారతదేశం ముందంజవేసింది. కాబట్టి మొట్టమొదటి ఆసియా పోటీలని మన దేశంలో నిర్వహించడం అన్నది ఒకవిశేషం. 1962లో మెడ్రాస్ స్టేట్ అసోసియేషన్ ఇంటర్ – జోన్ ఫైనల్స్‌ని మెక్సికోలో నిర్వహించినప్పుడు ప్రేక్షకులకోసం భారీ ఎత్తున ఏర్పాట్లు జరిగాయి. అప్పుడు మొత్తం రు. 50,000 లు వసూలైంది. కాబట్టి ఇలాంటి మహత్తరమైన పోటీలు జరుగుతున్నప్పుడు పెద్ద ఆటగాళ్ళు ఆపోటీలలో పాల్గొంటున్నప్పుడు యింకా మంచి ఆదాయన్ని ఆశించవచ్చు—ఆటకూడా ఉన్నతమైన స్థాయిలో ఉంటుంది కాబట్టి.

కాబట్టి నాసూచన ఏమంటే ఆగస్టు 10 న జరిగే సమావేశంలో ఆలిండియా అసోసియేషన్, పోటీల నిర్వహణలో బాధ్యత వహించడానికి తటపటాయించరాదని. టెన్నిస్ ఆట అభిమానులకు కూడా ఉత్తమశ్రేణి ఆటని ఎదురుచూడవచ్చన్న విషయాన్ని గమనించి ప్రవేశరుసుము ఎక్కువగా ఉన్నా ఉపేక్షించరని అందువల్లనష్టం అన్నప్రసక్తే లేదని నా అభిప్రాయం. కాబట్టి దానికి సంబంధించిన పెద్దలు ధైర్యంగా ఈ కార్యాన్ని చేపట్టి మద్రాసు అభిమానులకి ప్రపంచంలోని ఉత్తమస్థాయి టెన్నిస్‌ని వీక్షించి ఆనందింపచేసే బాధ్యతని తీసుకుంటారని ఆశిస్తున్నాను.

— కె. ఎస్. నరసింహన్

సినిమా

సిద్ధంగా వుంది. తెలుగు చిత్రాన్ని నవంబరులో ప్రారంభించాలి. శ్రీ నాగేశ్వరరావుతో తీసేముందు చిన్నతారలతో యేదయినా చిత్రాన్ని తీద్దామా అని కొన్ని కథలను తిరగేస్తున్నా,' అన్నారు శ్రీ ఏకామ్రేశ్వర రావు.

* * *

యువకుడు, చురుకయినవాడు, ఆదర్శ భావాలు గలవాడు, విచక్షణాజ్ఞానం తెలిసిన




'బంగారు గాజులు'లో నాగేశ్వరరావు, భారతి.

వాడు, విద్యావంతుడు, కార్యశూరుడు అయిన శ్రీ ఏకామ్రేశ్వరరావు విజయభట్ సంస్థకు వెన్నెముకలాంటివాడు. శ్రీ భట్‌కు అన్ని శాఖల్లో సహకరిస్తూ, పరిశ్రమలోని లోతుపాతులను అవగాహనం చేసుకుని, యెవ్వరినీ నొప్పించక, తానొవ్వక ప్రవర్తిస్తూ నిగర్వి అని పేరందుకుంటున్న ఈ యువనిర్మాతకి ఉజ్వల భవిష్యత్తు ఉందనటంలో సందేహం లేదు.

—శ్రీనివాస్ ●

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.



ఆగష్టు 10 విడుదల
SVS FILMS
యస్.వి.యస్. ఫిలిమ్సు
కలిసొచ్చిన అదృష్టం
నిర్మాత: ఎం. జగన్నాథరావు
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: కె. విశ్వనాథ్ B.Sc.
ఆంధ్ర: జ్యోతి, నైజాం: ఉషా ఫిలిమ్స్, సీడెడ్: నవభారత్ ఫిలిమ్స్, మైసూర్: శివశంకర ఫిలిమ్సు